Prajalakshyam Telugu Daily

# ప్రజాలక్ష్యం

తెలుగు దిన పత్రిక

ఎడిటర్ : గోలి సమ్మిరెడ్డి

సంపుటి: 16 | సంచిక: 328 | కరీంనగర్ | శనివారం 18 ఏప్రిల్ 2026 | పేజీలు: 12 | వెల: 2.00

## తేజస్వీ వ్యాఖ్యలు- పార్లమెంట్ ముందు ఎంపిల నిరసన

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

న్యూఢిల్లీ, ఏప్రిల్ 17 : పార్లమెంట్ ఆవరణలో తెలంగాణ కాంగ్రెస్ ఎంపీలు ఆందోళనకు దిగారు. ప్లకార్డులు పట్టుకుని బైఠాయిచారు. తెలంగాణ ఏర్పాటును భారత్ - పాకిస్థాన్ విభజనతో పోల్చుతూ భాజపా ఎంపీ తేజస్వీ సూర్య లోక్‌సభలో చేసిన వివాదాస్పద వ్యాఖ్యలను తప్పుబట్టారు. ఆయనకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. తెలంగాణ ప్రజలకు క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. తెలంగాణ ఉద్యమాన్ని అవమానించవద్దని ప్లకార్డులు ప్రదర్శించారు. కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డికి వ్యతిరేకంగా కూడా ఎంపీలు నినాదాలు చేశారు. ఎంపిలు చామల కిరణ్ కుమార్ రెడ్డి, వేం నరేందర ÷- రెడ్డి, కడియం కావ్య తదితరులు పాల్గొన్నారు.

## కాళేశ్వరం ప్రాజెక్ట్ పునరుద్ధరణ

### బ్యారేజీల పునరుద్ధరణకు కమిటీ ఏర్పాటు

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

హైదరాబాద్, ఏప్రిల్ 17 : కాళేశ్వరం ప్రాజెక్ట్ రిపేర్‌పై తెలంగాణ ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. మేడిగడ్డ, సుందిళ్ల, అన్నారం బ్యారేజీల పునరుద్ధరణకు కమిటీ ఏర్పాటు చేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఈ మేరకు అనీ. పరిచిత్ మెహ్రా ఆధ్వర్యంలో కమిటీ ఏర్పాటు చేసింది. ఇంజినీర్లు, నిపుణులతో ప్రత్యేక బృందాన్ని ఏర్పాటు చేసింది. మూడు బ్యారేజీల మరమ్మతులకు సమన్వయ కమిటీ ఏర్పాటు చేసింది. కాళేశ్వరం ప్రాజెక్ట్ రిపేర్ పనులు

11 లో

## 30 లక్షలకు పైగా
# ధాన్యం సేకరణ చేపట్టండి

- కేంద్రమంత్రి ప్రహ్లాద్ జోషికి సీఎం రేవంత్ వినతి





(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

న్యూఢిల్లీ, ఏప్రిల్ 17 : 2025-26 వానాకాలం, యాసంగి సీజన్లకు సంబంధించి 30 లక్షల మెట్రిక్ టన్నుల పార్ బాయిల్డ్ ధ్యానం సేకరించాలని కేంద్రమంత్రికి సీఎం రేవంత్, మంతంరి ఉత్తమ్ విజ్ఞప్తి చేశారు. అలాగే యాసంగి పంట 90 లక్షల మెట్రిక్ టన్నులు వస్తుందని కేంద్రమంత్రి ప్రహ్లాద్ జోషికి సీఎం రేవంత్ వివరించారు. ఈ ధాన్యం మొత్తం కొనుగోలు చేసి తెలంగాణ రైతాంగానికి అండగా నిలవాలని కోరారు. కేంద్ర పౌరసరఫరాల శాఖ మంత్రి ప్రహ్లాద్ జోషితో తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి, మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి భేటీ అయ్యారు. కేంద్ర పౌరసరఫరాల శాఖ నుంచి రాష్ట్రానికి రావాల్సిన పెండింగ్ నిధులు, ఇతర అంశాలపై చర్చించారు. కేంద్ర మంత్రితో భేటీ అనంతరం మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ..'దేశంలోనే అత్యధికంగా తెలంగాణలో వరిధాన్యం ఉత్పత్తి జరుగుతోంది. ఈ రబీ సీజన్‌లో 90 లక్షల మెట్రిక్ టన్నుల వరి ధాన్యం రైతుల నుంచి కొనుగోలు చేయబోతున్నాం. వరి ధాన్యం రైతుల నుంచి కొనుగోలు చేసిన 48 గంటల్లోనే మద్దతు ధర డబ్బులు వారి ఖాతాల్లో వేస్తున్నాం.

11 లో

## శాస్త్రిపురంపై
# ఫ్లై ఓవర్ ప్రారంభం

- ప్రారంభించిన మంత్రి శ్రీధర్ బాబు





(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

హైదరాబాద్, ఏప్రిల్ 17 : హైదరాబాద్ నగర అభివృద్ధిలో కీలక అడుగుపడింది. నగరంలో మరో ఆర్‌వోబీ ప్రజలకు అందుబాటులోకి వచ్చింది. శుక్రవారం శాస్త్రిపురం రైల్వే ఓవర్ బ్రిడ్జ్‌ను మంత్రి శ్రీధర్ బాబు ప్రారంభించారు. ఈ ఫ్లై ఓవర్ నిర్మాణానికి జీహెచ్‌ఎంసీ 71 కోట్ల రూపాయలు ఖర్చు చేసింది. సుమారు 490 మీటర్ల పొడవుతో, నాలుగు లైన్లలో ఫ్లై ఓవర్ జీహెచ్‌ఎంసీ నిర్మించింది. జీహెచ్‌ఎంసీ, సౌత్ సెంట్రల్ రైల్వేల సమన్వయంతో ఈ ప్రాజెక్ట్‌ను చేపట్టారు. శాస్త్రిపురం ఫ్లై ఓవర్ అందుబాటులోకి రావడంతో మైలార్ దేవ్‌పల్లి నుంచి ఫలక్‌నుమా మార్గంలో ప్రయాణం సులభతరం అయింది. ఉద్దమ్‌గడ్డ రైల్వే లెవల్ క్రాసింగ్ వద్ద ఏర్పడే ట్రాఫిక్ జామ్‌కు చెక్ పడనుంది. ప్రయాణ సమయం కూడా చాలా వరకు తగ్గనుంది. ద్వారా మైలార్‌దేవ్‌పల్లి, వ్టటెపల్లి, ఫలక్‌నుమా,ఆర్టీసీబస్‌డిపోప్రాంతాలమధ్య కనెక్టివిటీమెరుగుపడింది.

## సిగాచీ బాధితులను
# నట్టేట ముంచారు

- కోటి పరిహారం హామీ ఇచ్చి మరచిన సిఎం
- మరోమారు మండిపడ్డ హరీష్ రావు



(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

పటాన్‌చెరువు, ఏప్రిల్ 17 : సిగాచి ప్రమాద బాధితులకు ఇచ్చిన హామీని కూడా నిలుపుకోలేక తన అసమర్థతను సీఎం రేవంత్ రెడ్డి మరోసారి చాటుకున్నారని బీఆర్‌ఎస్ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ హరీశ్‌రావు విమర్శించారు. నాడు కోటి రూపాయల సాయం అంటూ సిగాచి బాధితులను నమ్మబలికి అందులో సగం కూడా వారికి చేర్చని రేవంత్ రెడ్డి నయవంచనలో తనను మించినవారు లేరని నిరూపించుకున్నారని అన్నారు. ఆ పూటకు మాటలు చెప్పడం.. ఆ తర్వాత తాను చెప్పిన మాటలకే విలువ ఇవ్వకపోవడం రేవంత్ రెడ్డికే చెల్లిందని విమర్శించారు. సిగాచి పరిశ్రమ అగ్నిప్రమాదంలో 54 మంది అమాయక కార్మికులు ప్రాణాలు కోల్పోతే, ఆ బాధితుల కుటుంబాలను ఆదుకోవడంలో రాష్ట్ర ప్రభుత్వం పూర్తిగా విఫలం అయ్యిందని అన్నారు. ప్రమాదం జరిగిన వెంటనే సంఘటనా స్థలానికి వెళ్లిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, మంత్రులు వివేక్, దామోదర రాజనర్సింహ.. మృతదేహాల సాక్షిగా ఒక్కో కుటుంబానికి కోటి రూపాయల పరిహారం ఇస్తామని ఆర్భాటంగా ప్రకటించారని తెలిపారు. కానీ ఇదంతా కంటితుడుపు చర్యే అని, బాధితులకు జరిగిన న్యాయం శూన్యమని ప్రభుత్వం అసెంబ్లీలో ఇచ్చిన లిఖితపూర్వక సమాధానంతో తేటతెల్లమైందని పేర్కొన్నారు. యాజమాన్యం, ప్రభుత్వం కుమ్మక్కై పరిహారం లెక్కల్లో చేస్తున్న మోసం అంతా ఇంతా కాదని హరీశ్‌రావు అన్నారు. ప్రభుత్వం అసెంబ్లీలో సమర్పించిన అధికారిక లెక్కల ప్రకారం, 54 మంది బాధితులకు కలిపి ఇప్పటివరకు చెల్లించిన

11 లో



## కాళేశ్వరంపై ఎలాంటి
# దురుద్దేశ్యం లేదు

- నేషనల్ డ్యామ్ సేఫ్టీ అథారిటీ చైర్మన్ జైన్‌తో చర్చించాం
- వానాకాలం లోగానే సాయిల్ టెస్టింగ్ పూర్తి
- 20న సిఎం రేవంత్ మేడిగడ్డను పరిశీలిస్తారు
- నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

న్యూఢిల్లీ,ఏప్రిల్17 : కాళేశ్వరం ప్రాజెక్టుపై సీఎం రేవంత్‌రెడ్డికి, తమ ప్రభుత్వానికి ఎలాంటి దురుద్దేశం లేదని తెలంగాణ నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి స్పష్టం చేశారు. ఈనెల 20వ తేదీన సీఎం రేవంత్‌రెడ్డితో కలిసి మేడిగడ్డ బ్యారేజ్‌ను పరిశీలిస్తామని పేర్కొన్నారు. శుక్రవారం ఢిల్లీలో మంత్రి ఉత్తమ్ మీడియాతో మాట్లాడారు. నేషనల్ డ్యామ్ సేఫ్టీ అథారిటీ చైర్మన్ అనిల్ జైన్‌తో కాళేశ్వరం

11 లో

# రేవంత్‌ది అసదుద్దీన్ ఓవైసీ ఫార్మాలా

- ఉత్తరాది, దక్షిణ్యాది పేరుతో విషం చిమ్ముతున్నారు
- కాంగ్రెస్, బిఆర్‌ఎస్‌ల తీరుపై మండిపడ్డ కిషన్ రెడ్డి



(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

న్యూఢిల్లీ,ఏప్రిల్17 : దక్షిణాది రాష్ట్రాల్లో సీట్లు తగ్గకుండా డీలిమిటేషన్ పక్రియ జరుగుతోందని కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి అన్నారు. కొత్త నాయకత్వానికి అవకాశం వస్తుందని ప్రతిపక్షాలు డీలిమిటేషన్‌ను వ్యతిరేకిస్తున్నాయని మండిపడ్డారు. దిల్లీలో ఆయన మీడియాతో మాట్లాడారు. అన్ని రాష్ట్రాలకు సమానంగా సీట్ల పెంపు నిర్ణయం తీసుకుంటే.. తప్పుడు వ్యాఖ్యలు చేస్తున్నారు. డీలిమిటేషన్‌పై కాంగ్రెస్, బీఆర్‌ఎస్ కలిసి రాష్ట్ర ప్రజలను తప్పుదారి పట్టిస్తున్నాయని మండిపడ్డారు. మహిళల రిజర్వేషన్లకు ఎంఐఎం వ్యతిరేకం. ఈ అంశంలో కాంగ్రెస్, బీఆర్‌ఎస్‌లను కలిపింది ఎంఐఎం పార్టీయే. సీఎం రేవంత్‌రెడ్డిది హైబ్రిడ్ ఫార్ములా కాదు.. అది అసదుద్దీన్ ఓవైసీ ఫార్మాలా అని కిషన్‌రెడ్డి మండిపడ్డారు. అలాగే మహిళా రిజర్వేషన్ బిల్లు సవరణ, నియోజకవర్గాల పునర్విభజన అంశాలపై ప్రతిపక్షాలు చేస్తున్న విమర్శలను కిషన్ రెడ్డి తీవ్రంగా ఖండించారు. విపక్షాలు రాజకీయ దురుద్దేశంతో, ప్రజలను తప్పుదోవ పట్టించేలా మాట్లాడుతున్నాయని ఆయన మండిపడ్డారు. మహిళా రిజర్వేషన్ బిల్లు అమలును అడ్డుకోవాలనే తప్పుడు ఆలోచనతో ప్రతిపక్షాలు రాజకీయ విమర్శలు చేస్తున్నాయని కిషన్ రెడ్డి విమర్శించారు. నియోజకవర్గాల పునర్విభజన వల్ల దక్షిణాది

11 లో

## పదేళ్లు అధికారంలో
# ప్రజలను ఎందుకు కలవలేదు

- ఇప్పడే పాదయాత్ర చేయాలని ఎందుకనో
- కెటిఆర్‌పై విమర్శలు గుప్పించిన కవిత
- ప్రజాసమస్యలు పరిష్కరించే వరకు ప్రభుత్వాన్ని నిదీస్తాం
- జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత



(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

హైదరాబాద్,ఏప్రిల్17 :పదేళ్లు బీఆర్‌ఎస్ అధికారంలో ఉందని.. పాదయాత్ర చేస్తానని మాజీ మంత్రి కేటీఆర్ ఇప్పుడు ఎందుకు అంటున్నారని తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత ప్రశ్నించారు. పదేళ్లు అధికారంలో ఉండి ఆయన ఎందుకు ప్రజల్లోకి పోలేదని నిలదీశారు. ప్రజా సమస్యలను పరిష్కరించేది అధికార పార్టీనేనని.. అందుకే కాంగ్రెస్‌ను టార్గెట్ చేశానని కవిత తెలిపారు. ఆయా సమస్యల ఆధారంగా బీఆర్‌ఎస్ పైన కూడా మాట్లాడుతానని అన్నారు. పరిగిలో రైతు దీక్షకు మద్దతు ఇచ్చేందుకు వెళ్తున్నానని చెప్పి.. హరీశ్‌రావు హౌస్ అరెస్ట్ అయ్యారని తెలిపారు. ఆ సమయంలో హరీశ్‌రావు ఫోన్ చేస్తే పోలీసులు ఆయన ఇంటికి వచ్చి హౌస్ అరెస్ట్ చేశారని విమర్శించారు. హరీశ్‌రావు పరిగిదాకా కూడా పోలేదని ఎద్దేవా చేశారు. తాము పరిగి వెళ్లి రైతులకు మద్దతుగా దీక్షలో పాల్గొన్నామని స్పష్టం చేశారు. పోలీసులు తమను అరెస్టు చేశారని.. రైతులకు మద్దతుగా తాము నిలిచామని తెలిపారు. ఖమ్మం జిల్లా వెలుగుమట్లలో ఏ విధంగానైతే పోరాటం చేశామో...అదే విధంగా పరిగిలో కూడా పోరాటం చేశానని వెల్లడించారు. భవిష్యత్తులో కూడా పోరాటం చేస్తానని కవిత పేర్కొన్నారు. తెలంగాణలో అన్నివర్గా లకు అధికారం రావాలన్నదే తన ధ్యేయమని వ్యాఖ్యానించారు. అందరికీ అధికారమని

11 లో

# 9 ఏళ్ల బాలికను కాపాడిని ముగ్గురు

- వారిని పిలిచి సన్మానించిన కమిషనర్
- ప్రజా చైతన్యంతోనే పోలీసింగ్ పటిష్టం
- ప్రజలు అప్రమత్‌ంగా ఉండాలన్న సజ్జన్నార్



(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

హైదరాబాద్,ఏప్రిల్17 : తొమ్మిదేళ్ల బాలికను కాపాడిన ముగ్గురు సామాన్య పౌరులను హైదరాబాద్ పోలీస్ కమిషనర్ వీసీ సజ్జనార్ ప్రశంసించారు. చిన్నారిపై లైంగిక వేధింపులకు పాల్పడుతున్న కామాంధుడిని ప్రాణాలకు తెగించి పట్టుకున్న సెజల్, గణపతి, కాశీనాథ్‌లను సీపీ సజ్జనార్ ప్రత్యేకంగా అభినందించారు. బషీర్‌బాగ్‌లోని పాత కమిషనరేట్ కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో సీపీ సజ్జనార్ ఈ ముగ్గురును శాలువాలతో సన్మానించి, ప్రశంసా పత్రాలతో పాటు నగదు రివార్డును అందజేశారు. 'వీరి సాహసం సమాజానికి ఒక గొప్ప

11 లో

# తేజస్వీ సూర్య మాటల్లో తప్పేముంది

- మంత్రి పొన్నం వ్యాఖ్యలపై బండి మండిపాటు



(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

న్యూఢిల్లీ,ఏప్రిల్17: తెలంగాణ విభజనపై బీజేపీ ఎంపీ తేజస్వి సూర్య మాటలను కాంగ్రెస్ నేతలు ఎందుకు తప్పుబడుతున్నారంటూ కేంద్ర మంత్రి బండి సంజయ్ మండిపడ్డారు. రాష్ట విభజన సమయంలో కాంగ్రెస్ తప్పిదాలతో పలువురు యువకులు ఆత్మబలిదానాలు చేసుకున్నారని ఎంపీ తేజస్వి సూర్య చెప్పారని తెలిపారు. 2009లో కాంగ్రెస్ తెలంగాణ ఏర్పాటుకు సహకరించి మళ్లీ వెన్నక్కి తగ్గారని.. దీని గురించే తేజస్వి సూర్య మాట్లాడారని అన్నారు. రేవంత్ రెడ్డి గతంలో సోనియాగాంధీని బలిదేవత అన్నారన్న విషయాన్ని గుర్తుచేశారు. తెలంగాణ ఉద్యమాన్ని వ్యతిరేకించిన వ్యక్తి సీఎం రేవంత్ రెడ్డి అంటూ విమర్శిం చారు. అలాంటి రేవంత్ కుఏబినేట్‌లో ఉన్న పొన్నం తదితరులు గతాన్ని మరిచి విమర్శలు

11 లో

# రొటేషన్‌లో మహిళలకు ప్రధాని పదవి

- కాంగ్రెస్ ఎంపీ కల్యాణ్ బెనర్జీ సూచన

న్యూఢిల్లీ,ఏప్రిల్17 :మహిళా రిజర్వేషన్ బిల్లు, డీలిమిటేషన్‌పై తృణమూల్ కాంగ్రెస్ ఎంపీ కల్యాణ్ బెనర్జీ లోక్‌సభలో మాట్లాడారు. 2011 జనాభా లెక్కల ప్రకారం 2002లో డీలిమిటేషన్ చేశారు. ప్రస్తుతం మనం 2026లో ఉన్నాం.ఇప్పుడు 2011 జనాభా లెక్కల ప్రకారం పునర్విభజన చేస్తామంటున్నారు. 15 ఏళ్లు గడిచిపోయింది. దీనిపై ప్రజలకు ఎలా న్యాయం చేస్తారు. మహిళా రిజర్వేషన్లకు మేం వ్యతిరేకం కాదు. కానీ, ఈ అంశాన్ని డీలిమిటేషన్‌తో లింక్ చేయడాన్ని వ్యతిరేకిస్తున్నాం. ప్రభుత్వానికి నేను కొన్ని సూచనలు చేస్తున్నా. మంత్రిత్వ శాఖలో మహిళలకు 50 శాతం రిజర్వ్ చేయాలి. ప్రధాని పదవిని కూడా రొటేషన్ పద్ధతిలో మహిళలకు రిజర్వ్ చేయాలి. ఎందుకంటే 2029 ఎన్నికల్లో భాజపా అధికారంలోకి రాదని కల్యాణ్ బెనర్జీ అన్నారు.

# రేపే తెలంగాణ అస్తిత్వ వేదిక ఆవిర్భావం...

## ప్రతి తెలంగాణ వాసి అస్తిత్వ పరిరక్షణలో భాగస్వామి కావాలని పిలుపు

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

హైదరబాద్, ఏప్రిల్, 17 : తెలంగాణ ప్రత్యేక అస్తిత్వాలను పరిరక్షించి భావితరాలకు అందించాలనే లక్ష్యంతో 'తెలంగాణ అస్తిత్వ వేదిక' ఆవిర్భవిస్తోందని చైర్మన్ వీరమల్ల ప్రకాశ్, కన్వీనర్ పిట్టల రవీందర్, కో-ఆర్డినేటర్ శ్రీధర్ దేశ్‌పాండే ప్రకటించారు. ఈ మేరకు శుక్రవారం హైదరాబాద్ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వేదిక ప్రారంభ సమావేశం ఏప్రిల్ 19న హైదరాబాద్ రవీంద్రభారతిలో జరగనుందని తెలిపారు. తెలంగాణ భూమి కేవలం భౌగోళిక పరిమితి కాదని, వేల సంవత్సరాల చరిత్ర, సంస్కృతి, సాహిత్యం, ఆధ్యాత్మికత, సామాజిక విలువల సమాహారమని తెలిపారు. కాలక్రమేణా మారుతున్న పరిస్థితుల్లో తెలంగాణ అస్తిత్వాలను కాపాడాల్సిన అవసరం మరింత పెరిగిందని పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో విశాల తెలంగాణ ప్రజానీకాన్ని మమేకం చేస్తూ 'తెలంగాణ అస్తిత్వ వేదిక'ను ఏర్పాటు చేసినట్లు వెల్లడించారు. ఈ వేదిక ఆవిర్భావ సమావేశం ఏప్రిల్ 19, 2026న ఆదివారం ఉదయం 10 గంటలకు హైదరాబాద్‌లోని రవీంద్ర భారతిలో నిర్వహించ నున్నారు. ఈ సందర్భంగా గత మూడు నెలలుగా నిర్వహించిన ఆన్‌లైన్ చర్చల ఆధారంగా రూపొందించిన "తెలంగాణ అస్తిత్వం" వ్యాస సంకలనాన్ని ఆవిష్కరించనున్నారు. అదే విధంగా, వరంగల్ జిల్లా కమలాపూర్‌కు చెందిన ప్రముఖ జర్నలిస్టు ఎస్.వెంకట్ నారాయణకు "జీవన సాఫల్య సాధన" పురస్కారాన్ని డా.బి.ఆర్. అంబేద్కర్ ఓపెన్ యూనివ ర్సిటీ వైస్ చాన్సలర్ ప్రొఫెసర్ ఘంటా చక్రపాణి




చేతుల మీదుగా అందజేయ నున్నారు. తెలంగాణ అస్తిత్వాలను దెబ్బతీసే శక్తులను బహిర్గతం చేయడం, ప్రజల్లో చైతన్యం కల్పించడం, సాంస్కృతిక-సామాజిక విలువలను పునరుద్ధరించడం, ప్రాంతీయ వనరులను స్థానిక ప్రజల అభివృద్ధికి వినియోగించాలనే దిశగా ఈ వేదిక పనిచేస్తుందని నిర్వాహకులు తెలిపారు. ఇది కేవలం సమావేశం కాకుండా తెలంగాణ ఆత్మను మేల్కొలిపే ఉద్యమమని పేర్కొంటూ, ప్రతి తెలంగాణ వాసి ఈ కార్యక్రమంలో పాల్గొని అస్తిత్వ పరి రక్షణలో భాగస్వామి కావాలని పిలుపునిచ్చారు. ఇంకా ఈ కార్యక్రమంలో డాక్టర్ అంబేద్కర్ ఓపెన్ యూనివర్శిటి మాజీ వైస్ చాన్సలర్ ప్రొఫెసర్ కె. సీతారామారావు, డిగ్రీ కళాశాల ప్రిన్స్‌పాల్ ప్రొఫెసర్ రాజ్యలక్ష్మీ, ప్రముఖ సైకాలజిస్టు డాక్టర్ చెన్నోజు విరేంద్రాచారు, ప్రముఖ మీడియా విశ్లేషకులు డి.పాపారావు, సీయర్ జర్నస్టులు సిహెచ్‌వి ప్రభాకర్ రావు, బుచ్చన్న తదితరులు పాల్గొన్నారు.

# ఏప్రిల్ 20న జగిత్యాల జైత్ర యాత్ర సభ

**- ఈ ప్రభుత్వంపై ధిక్కరణ స్వరం వినిపించే సభ - కాంగ్రెస్ పోవాలి-కెసిఆర్ రావాలి**
**- కెసిఆర్ పాలనే శ్రీ రామరక్ష - జగిత్యాల సభను విజయవంతం చేయాలి**
**- మాజీ ఎమ్మెల్యే కోరుకంటి చందర్ పిలుపు**

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

కోల్ సిటి (గోదావరిఖని), ఏప్రిల్ 17 : ఏప్రిల్ 20న జగిత్యాల లో జరిగే బిఆర్ఎస్ బహిరంగ సభ తెలంగాణ రాష్ట్ర రాజకీయాల్లో ఒక కొత్త మలుపనీ, రాష్ట్రంలో రేవంత్ పోవాలి-కెసిఆర్ రావాలని తెలంగాణ ప్రజలు కోరుకుంటున్నారని, 20న జరిగే బహిరంగ సభను విజయవంతం చేయాలని బిఆర్ఎస్ పెద్దపల్లి జిల్లా అధ్యక్షులు రామగుండం మాజీ శాసనసభ్యులు కోరుకంటి చందర్ పిలుపునిచ్చారు. శుక్రవారం గోదావరిఖని లో రామగుండం కార్పొరేషన్ లోని 60 మంది ఇంచార్జ్ లు పాలకుర్తి-అంతర్గాం మండలాల 27 మంది ఇంచార్జ్ లతో ముఖ్య నాయకులతో జగిత్యాల సభకు సన్నాహక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీలోని సీనియర్ నాయకులను తొక్కి పెడుతూ, నియంతల వ్యవహరిస్తున్న రేవంత్ రెడ్డి జగిత్యాల నియోజక వర్గం సీనియర్ నాయకులు జీవన్ రెడ్డిని పక్కన పెట్టడం అత్యంత దారుణమని, నాలుగు దశాబ్దాల రాజకీయ నాయకున్ని విస్మరించడం బాధాకరమని, రేవంత్ రెడ్డి పాలన తో తెలంగాణ ప్రజలు విసిగిపోయారని, హామీలను పక్కన పెట్టి స్కామ్లతో పైసల వేటలో పడ్డారని, మూసి ప్రక్షాళన పేరుతో లక్షల కోట్ల దోపిడీకి రంగం సిద్ధం చేశారని, కష్టనష్టానికి ఓర్చుకొని మధ్యతరగతి కుటుంబాలు ఇల్లు కట్టుకుంటే దయలేని ప్రభుత్వం హైడ్రా పేరుతో వాళ్ళ ఇల్లు నేలమట్టం చేస్తూ వారి కుటుంబాలను రోడ్డుపాలు చేశారని, అడిగిన వారిపై అక్రమ కేసులు బనాయిస్తూ



అనేక ఇబ్బందులకు గురి చేస్తున్నారని, ప్రజలకు ఇచ్చిన హామీలను ఆటకెక్కించి, మోసపూరిత హామీలతో గద్దెనెక్కిన రేవంత్ రెడ్డిని దించి మళ్లీ కేసిఆర్ ని ముఖ్యమంత్రి చేయాలని పిలుపునిచ్చారు. తెలంగాణ రాష్ట్రంలో కెసిఆర్ పాలనే శ్రీరామరక్ష అని, జగిత్యాల సభ కేవలం ఒక రాజకీయ సభ మాత్రమే కాదని, రాబోయే రోజుల్లో తెలంగాణ రాజకీయ ముఖ చిత్రాన్ని మార్చబోయేది జగిత్యాల సభ అని ఇది ఒక చారిత్రాత్మక ఘట్టమని అన్నారు. జగిత్యాల సభకు కార్యకర్తలు, పార్టీ ముఖ్య నాయకులు అధిక సంఖ్యలో తరలివచ్చి కెసిఆర్ సభను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ కార్పొరేటర్లు సర్పంచ్‌లు పట్టణ అధ్యక్షులు మండల అధ్యక్షులు మాజీ జడ్పీటీసీలు మాజీ ఎంపిటిసిలు, మాజీ సర్పంచ్‌లు, నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# రాజకీయ జోక్యాల వల్లే సింగరేణి ఆర్థిక సంక్షోభం

**- రూ.50 వేల కోట్ల బకాయిల వసూళ్లలో గుర్తింపు సంఘాల వైఫల్యం**
**- 12వ వేతన ఒప్పందం అమలుకు దశలవారీ ఆందోళనలకు సిద్ధం కావాలి**
**- ఏబికేఎంఎస్ కార్యదర్శి జాతీయ మాధవ నాయక్**

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

భద్రాద్రి-కొత్తగూడెం, ఏప్రిల్ 17 : ప్రభుత్వ రంగ సంస్థ అయిన సింగరేణి ఆర్థిక నష్టాల్లో కూరుకుపోవడానికి గత బీఆర్ఎస్ ప్రభుత్వం, ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం అనుసరిస్తున్న విధానాలే కారణమని బీఎంఎస్ అనుబంధ ఏబీకేఎంఎస్ జాతీయ కార్యదర్శి పి.మాధవ నాయక్ తీవ్రంగా విమర్శించారు. కొత్తగూడెంలోని బీఎంఎస్ భవన్‌లో యూనియన్ ఉపాధ్యక్షుడు బి.రాంసింగ్ అధ్యక్షతన శుక్రవారం నిర్వహించిన సమావేశంలో కార్పొరేట్, కొత్తగూడెం ఏరియాలకు చెందిన నాయకులు, కార్యకర్తలతో కలిసి ఆయన మాట్లాడారు. అధిక రాజకీయ జోక్యంతో సంస్థ ఆర్థికంగా బలహీనపడుతోందని ఆరోపించారు. డిసెంబర్ 2025 నాటికి సింగరేణికి రావలసిన సుమారు రూ.50 వేల కోట్ల బకాయిలను ట్రాన్స్‌కో, జెన్‌కో వంటి రాష్ట్ర ప్రభుత్వ సంస్థల నుంచి వసూలు చేయడంలో గుర్తింపు సంఘాలు అయిన ఏఐటీయూసీ, ఐఎన్‌టీయూసీ విఫలమయ్యాయని పేర్కొన్నారు. ఈ కారణంగా సంస్థ ఆర్థిక పరిస్థితి మరింత దిగజారిందని ఆందోళన వ్యక్తం చేశారు. గత రెండు సంవత్సరాలుగా గుర్తింపు సంఘంగా ఉన్న ఏఐటీయూసీ కార్మిక సమస్యల పరిష్కారంలో, యాజమాన్యంపై ఒత్తిడి తీసుకురావడంలో పూర్తిగా విఫలమైందని ఆరోపించారు. కార్మికులకు ఇచ్చిన హామీలు అమలు కాలేదని, కాలపరిమితి ముగిసిన తర్వాత మాత్రమే ఆందోళనలు చేపట్టడం బాధాకరమని అన్నారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన సొంతింటి పథకం, పెర్క్స్‌పై ఆదాయపు పన్ను రీయింబర్స్‌మెంట్, చీఫ్ ఫార్మసిస్ట్, చీఫ్ రేడియాలజీ, ల్యాబ్ టెక్నీషియన్ క్యాడర్ స్కీమ్‌ల అమలు జరగలేదని విమర్శించారు. నర్సులకు ఆఫీసర్ గ్రేడ్ హామీ కూడా నెరవేర్చలేదని ప్రశ్నించారు.



మారుపేర్ల సమస్య వంటి కీలక అంశాలు పరిష్కారం కాని స్థితిలోనే ఉన్నాయని తెలిపారు. కొత్త గనుల కేటాయింపులో రాజకీయ కారణాలతో సింగరేణికి అన్యాయం జరిగిందని ఆరోపిస్తూ, గతంలో గనులు రాకుండా అడ్డుకున్న సంఘాలే ఇప్పుడు వేలం ద్వారా గనులు పొందాలని చెప్పడం విచిత్రమని వ్యాఖ్యానించారు. భారతీయ మజ్దూర్ సంఘ్ (బీఎంఎస్) మాత్రం రాజకీయాలకు అతీతంగా సింగరేణి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తోందని, బొగ్గు బ్లాకుల వేలం ద్వారా కొత్త గనులు సాధించేందుకు ప్రయత్నిస్తోందని తెలిపారు. కార్మికులు బీఎంఎస్‌ను ప్రత్యామ్నాయంగా ఆదరించాలని పిలుపునిచ్చారు. ప్రస్తుతం అమల్లో ఉన్న 11వ వేతన సవరణ కాలపరిమితి ఈ ఏడాది జూన్ 30తో ముగియనున్న నేపథ్యంలో, జూలై 1 నుంచి అమలులోకి వచ్చే 12వ వేతన సవరణ కోసం జేబీసీసీఐ కమిటీని వెంటనే ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. ఈ మేరకు దేశవ్యాప్తంగా గేట్ మీటింగ్‌లు నిర్వహించనున్నట్లు వెల్లడించారు. కేంద్ర బొగ్గు మంత్రిత్వ శాఖ మంత్రి కిషన్ రెడ్డికి జేబీసీసీఐ ఏర్పాటు చేయాలని ఏబీకేఎంఎస్ తరఫున లేఖ పంపినట్లు తెలిపారు. 12వ వేతన ఒప్పందం సాధన కోసం చేపట్టే ఆందోళనల్లో కార్మికులు పెద్ద సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. ఈ సమావేశంలో యూనియన్ చీఫ్ ఆర్గనైజింగ్ సెక్రటరీ టి.ఎస్. పవన్ కుమార్, నాయకులు ఎం. శ్రీనివాస్, కాసర్ల మోహన్, ఉదయ్, భీమా, బాలకృష్ణ, అశోక్, ఠాగూర్, నరేష్, చంద్రశేఖర్, బి. రవి, వడ్డీ కాసులు, శైలేందర్, వీర కుమార్, రాజేష్, ఆత్రేయ, సుధాకర్, సంగం చందర్, ఇనుపనూరి నాగేశ్వరరావు, నిర్మల తదితరులు పాల్గొన్నారు.

# ఆసుపత్రిలో వైద్యులు ఎల్లప్పుడూ అందుబాటులో ఉండాలి

**- ఓపీ తర్వాత కూడా వైద్యులు ఆసుపత్రిలో ఉండాలి - అవసరమైన వైద్యులు, సిబ్బందిని కాంట్రాక్ట్ విధానంలో వెంటనే నియమించాలి - ప్రైవేట్ ఆసుపత్రులకు అవసరం లేకుండా రిఫర్ చేయరాదు**
**- అన్ని సేవలు ప్రభుత్వ ఆసుపత్రిలోనే అందాలి - మందులు, పరికరాల కొరత లేకుండా స్టాక్ నిర్వహణ, యంత్రాల మరమ్మతులు వెంటనే పూర్తి చేయాలి - జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష**



(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

పెద్దపల్లి, ఏప్రిల్ 17 : ఆసుపత్రిలో వైద్యులు ఎల్లప్పుడూ అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని, ఓపీ సంఖ్య తగ్గుతున్న అంశంపై వెంటనే దృష్టి సారించాలని జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష ఆదేశించారు. శుక్రవారం సమీకృత జిల్లా కలెక్టరేట్‌లో గోదావరిఖని జనరల్ ఆసుపత్రి పనితీరుపై సంబంధిత అధికారులతో కలెక్టర్ శ్రీహర్ష సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆసుపత్రిలో రోజువారీ ఓపీ వివరాలను సమీక్షిస్తూ రోజుకు ఎంతమంది రోగులు వస్తున్నారో తెలుసుకున్నారు. అన్ని విభాగాల్లో అవసరమైన వైద్యులను కాంట్రాక్ట్ విధానంలో వెంటనే నియమించాలని, ఎటువంటి ఖాళీలు లేకుండా చూడాలని ఆదేశించారు. వైద్యులు సమయానికి విధులకు హాజరు కావడంతో పాటు ఓపీ సమయం ముగిసిన తర్వాత కూడా ఆసుపత్రిలో అందుబాటులో ఉండాలని స్పష్టం చేశారు. మధ్యాహ్నం 12 గంటల తర్వాత వైద్యులు అందుబాటులో లేరనే ఫీడ్‌బ్యాక్ ఉన్నందున ఇటువంటి పరిస్థితి ఎట్టి పరిస్థితుల్లోనూ ఉండకూడదని హెచ్చరించారు. ఆసుపత్రిలో వైద్యులు ఎల్లప్పుడూ అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఆసుపత్రిలో ఓపీ సంఖ్య తగ్గుతోందని పేర్కొంటూ, దానిపై వెంటనే చర్యలు తీసుకోవాలని సూచించారు. ఏ రోగి కూడా సేవల నుండి వెలుపల ఉండకూడదని స్పష్టం చేశారు. కొంతమంది రోగులను ప్రైవేట్ ఆసుపత్రులకు రిఫర్ చేస్తున్నారనే ఫీడ్‌బ్యాక్ ఉన్నందున అవసరం లేకుండా ప్రైవేట్ ఆసుపత్రులకు పంపకూడదని ఆదేశించారు. ఆసుపత్రిలో అవసరమైన పరికరాలు లేనప్పుడు తరచుగా కేసులు వస్తున్నట్లయితే వెంటనే ప్రతిపాదనలు పంపించాలని, అవసరమైన పరికరాలు సమకూర్చేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు. ప్రభుత్వ ఆసుపత్రిలోనే రోగికి అవసరమైన అన్ని సేవలు అందేలా చూడాలని సూచించారు. స్టాక్‌లో లేని, అవసరమైన మందుల జాబితాను సిద్ధం చేసి సమర్పించాలని, జిల్లా నిధులతో కనీసం మూడు నెలల స్టాక్ అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు. మందులు, ఔషధాలు లేదా ఇతర అవసరమైన వస్తువుల కొరత ఎట్టి పరిస్థితుల్లోనూ ఉండకూడదని ఆదేశించారు. వైద్య పరీక్షల కోసం అవసరమైన సామగ్రి స్టాక్‌ను నిరంతరం తనిఖీ చేయాలని, యంత్రాల్లో లోపాలు ఉంటే వెంటనే మరమ్మతులు చేయించాలని సూచించారు. ఆసుపత్రికి అవసరమైన కొత్త ఏసీల కోసం ప్రతిపాదనలు పంపించాలని, వెంటనే ఆమోదం ఇచ్చేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు. సెక్యూరిటీ గార్డుల అవసరాన్ని సమర్పించాలని, వారి ఏర్పాటు కోసం చర్యలు తీసుకుంటామని చెప్పారు. అత్యవసర కేసుల్లో పేషెంట్ కేర్‌పై ప్రత్యేక దృష్టి సారిస్తూ, శానిటేషన్, సెక్యూరిటీ, పేషెంట్ కేర్ సిబ్బంది మొత్తం 120 మంది ఉండాల్సి ఉండగా ప్రస్తుతం 115 మంది మాత్రమే ఉన్నారని పేర్కొన్నారు. ఈ సిబ్బంది మూడు షిఫ్ట్‌లలో పనిచేస్తారని తెలిపారు. ప్రజలకు మెరుగైన సేవలు అందించేందుకు అవసరమైన అదనపు సిబ్బందిని కాంట్రాక్ట్ విధానంలో నియమించాలని ఆదేశించారు. ఈ సమావేశంలో డాక్టర్ కృపా బాయి, డాక్టర్ రాజు, డాక్టర్ ప్రసాద్, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# రాష్ట్ర ప్రభుత్వం రైతుల సంక్షేమానికి అత్యంత ప్రాధాన్యత ఇస్తుంది

**- మేడిగడ్డ-కాళేశ్వరం సందర్శనకు సీఎం రేవంత్ రెడ్డి.**
**- 20న భూపాలపల్లిలో రైతు భరోసా రెండో విడత ప్రారంభం.**
**- రాష్ట్ర ఐటీ పరిశ్రమల శాఖ మంత్రి దుదిల్ల శ్రీధర్ బాబు.**

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)



జయశంకర్-భూపాలపల్లి, ఏప్రిల్ 17: రాష్ట్ర ప్రభుత్వం రైతుల సంక్షేమానికి అత్యంత ప్రాధాన్యత ఇస్తుందని రాష్ట్ర ఐటీ పరిశ్రమల శాఖ మంత్రి దుదిల్ల శ్రీధర్ బాబు పేర్కొన్నారు. శుక్రవారం ఐడిఓసి కార్యాలయంలో జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ, ఎస్పీ సిరిసెట్టి సంకీర్త్, భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు, రామగుండం ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్ రాజ్ ఠాకూర్ తదితరులతో కలిసి మంత్రి సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, రైతు భరోసా రెండో విడత నిధుల విడుదల కార్యక్రమాన్ని భూపాలపల్లి జిల్లా నుంచి ప్రారంభించడం గర్వకారణమని పేర్కొన్నారు. ఈ నెల 20వ తేదీన రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఇరిగేషన్ శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డి సాయంత్రం 4 గంటలకు మేడిగడ్డ, కాళేశ్వరం ప్రాంతాలను సందర్శించనున్నారు. అనంతరం కాటారం మండలం నస్తూరిపల్లిలో నిర్వహించే కార్యక్రమంలో వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావుతో కలిసి రైతు భరోసా రెండో విడత నిధులను విడుదల చేయనున్నట్లు మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు తెలిపారు. నస్తూరిపల్లిలో నిర్వహించనున్న బహిరంగ సభకు పెద్ద సంఖ్యలో రైతులు, మహిళలు హాజరయ్యేలా చర్యలు తీసుకోవాలని, కార్యక్రమం విజయవంతం కావడానికి జిల్లా యంత్రాంగం సమగ్ర ఏర్పాట్లు చేయాలని అధికారులకు ఆదేశించారు. ఈ సమావేశంలో అటవీ శాఖ అధికారి నవీన్ రెడ్డి, కాటారం సబ్ కలెక్టర్ మయాంక్ సింగ్, అదనపు కలెక్టర్లు అశోక్ కుమార్, విజయలక్ష్మి, ఏఎస్పీ నరేష్ కుమార్, గ్రంథాలయ సంస్థ చైర్మన్ రాజబాబు, మున్సిపల్ చైర్మన్ బుర్ర కొమరయ్య, కౌన్సిలర్లు, వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.





# గిరిజన గ్రామానికి రక్షణ కవచం

## మాణిక్‌గూడలో కరకట్ట నిర్మాణానికి శ్రీకారం చుట్టిన కలెక్టర్

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

ఆసిఫాబాద్, ఏప్రిల్ 17: అది ఒక గిరిజన కు గ్రామం. అక్కడ నివసిస్తున్న వారంతా పీవీటీజీలే. కుమ్రం భీం ప్రాజెక్టు నిర్మాణం సమయంలో మాణిక్‌గూడ గ్రామంలోని గిరిజనులకు పునరావాసం కల్పించారు. పునరావాస ప్రాంతంలో సీసీ రోడ్డు, అంగన్వాడి కేంద్రం, పాఠశాల వంటి మౌలిక సదుపాయాలను ఏర్పాటు చేశారు. అయితే ప్రాజెక్టు కుడి కాలువ గ్రామ సమీపం నుంచి వెళ్లడం వల్ల వర్షాకాలంలో గ్రామానికి వెళ్లే రహదారి కోతకు గురవుతూ పెద్ద సమస్యగా మారింది. అమాయకమైన గిరిజనులు తమ సమస్యను ఎవరికి చెప్పుకోవాలో తెలియని పరిస్థితిలో ఉండేవారు. ఫిబ్రవరి 24న దానాపూర్ గ్రామంలో నిర్వహించిన భూభారతి అవగాహన సదస్సుకు జిల్లా కలెక్టర్ కె. హరిత హాజరయ్యారు. ఈ సందర్భంగా మాణిక్‌గూడ గ్రామ సర్పంచ్, గ్రామస్థులు తమ సమస్యను కలెక్టర్ దృష్టికి తీసుకువచ్చారు. వెంటనే స్పందించిన కలెక్టర్ హరిత సంబంధిత అధికారులతో కలిసి గ్రామాన్ని సందర్శించి పరిస్థితిని పరిశీలించారు. సమస్య తీవ్రతను గుర్తించి దాని పరిష్కారానికి ప్రత్యేక దృష్టి సారించారు. జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి జూపల్లి కృష్ణారావు దృష్టికి సమస్యను తీసుకెళ్లి నిధుల మంజూరుకు రిక్వెస్ట్ లెటర్ పొందారు. అనంతరం ఇరిగేషన్ శాఖ సెక్రటరీని ప్రత్యేకంగా కలిసి కరకట్ట నిర్మాణానికి రూ.48 లక్షల నిధులను మంజూరు చేయించారు. ఈ క్రమంలో మాణిక్‌గూడ గ్రామానికి వరద ముప్పు లేకుండా రక్షణ కరకట్ట నిర్మాణానికి శుక్రవారం స్థానిక ఎమ్మెల్యే కోవా లక్ష్మితో కలిసి జిల్లా కలెక్టర్ కె. హరిత భూమి పూజ నిర్వహించారు. గ్రామానికి ఎన్నాళ్లుగానో ఉన్న ప్రధాన సమస్య పరిష్కారం దిశగా చర్యలు ప్రారంభమవడంతో గిరిజనులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. కలెక్టర్ స్పందనతో సమస్యకు శాశ్వత పరిష్కారం లభిస్తుందని ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

# ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలి

## తెలంగాణ ఉద్యోగుల జేఏసీ డిమాండ్

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)



ములుగు, ఏప్రిల్ 17 : తెలంగాణ ఎంప్లాయిస్ టీచర్స్ మరియు పెన్షనర్స్ జాయింట్ యాక్షన్ కమిటీ (టీజీఈ జేఏసీ) పిలుపులో భాగంగా శుక్రవారం మధ్యాహ్న భోజన విరామ సమయంలో ప్రభుత్వ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలని జిల్లాలోని ఆర్డీవో, అన్ని మండల తహసిల్దార్లకు వినతిపత్రం అందించి వారు మాట్లాడుతూ రాష్ట్రంలో దీర్ఘకాలి కంగా పెండింగ్‌లో ఉన్న ఉద్యోగుల సమస్యలను సత్వరం పరిష్కరించాలని కొన్ని సమస్యలు పరిష్కారమైనప్పటికీ ఇంకా అనేక సమస్యలు, పెండింగ్‌లోనే ఉన్నాయని అవేదన వ్యక్తం చేశారు. ఈ విషయాన్ని వివిధ రూపాలలో సీఎస్, ప్రభుత్వ పెద్దల దృష్టికి తీసుకెళ్లడం జరుగుతుందని, పెండింగ్‌లో ఉన్న సమస్యలను పరిష్కరించాలని, న్యాయబద్ధమైన డిమాండ్లను వెంటనే అమలు చేయాలని వారు కోరారు. జూన్ 2వ తేదీ నాటికి ప్రభుత్వ ఉద్యోగులకు పీఆర్సీ ప్రకటించాలని తెలంగాణ ఎంప్లాయిస్ జాయింట్ యాక్షన్ కమిటీ మండల ప్రతినిధులు అన్నారు. ప్రభుత్వ ఉద్యోగుల సమస్యల పరిష్కారమే లక్ష్యంగా తమ కార్యాచరణ ఉంటుందన్నారు. రిటైర్డ్ ఉద్యోగులకు సంబంధించిన పెండింగ్ బిల్స్ అన్నీ క్లియర్ చేసి రిటైర్డ్ ఉద్యోగులతో పాటు ప్రభుత్వ ఉద్యోగులకు హెల్త్ కార్డ్స్ జారీ చేసి తక్షణమే అమలు చేయాలని ప్రభుత్వాన్ని కోరారు. ఈ కార్యక్రమంలో టీజీఈ జెఏసి జిల్లా కార్యవర్గ సభ్యులు వాంకుడోతి జ్యోతి, గోనె రవీందర్, సల్లగొండ పద్మాకర్ రెడ్డిచ తదితరులు పాల్గొన్నారు.

# మొక్కజొన్న కొనుగోలు కేంద్రం ఏర్పాటు చేయాలి

## వేంసూర్ మండల రైతులు డిమాండ్

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)



సత్తుపల్లి, ఏప్రిల్17 : ఖమ్మం జిల్లా సత్తుపల్లి నియోజకవర్గం వేంసూర్ మండలంలోని రైతులు ప్రభుత్వాన్ని మొక్కజొన్న కొనుగోలు కేంద్రం ఏర్పాటు చేయాలని విజ్ఞప్తి చేశారు. ప్రస్తుతం మండలంలో మొక్కజొన్న పంట విస్తీర్ణం పెరిగిందని, దిగుబడులు కూడా ఆశాజనకంగా ఉన్నాయని రైతులు తెలిపారు. అయితే సమీపంలో ప్రభుత్వ కొనుగోలు కేంద్రం లేకపోవడంతో తమ పంటను ప్రైవేట్ వ్యాపారులకు తక్కువ ధరకు విక్రయించాల్సిన పరిస్థితి ఏర్పడుతోందని ఆవేదన వ్యక్తం చేశారు రైతులు మాట్లాడుతూ, రవాణా ఖర్చులు అధికంగా ఉండటం వల్ల దూర ప్రాంతాలకు పంట తరలించడం కష్టంగా మారిందన్నారు దీంతో మద్దతు ధరకు అమ్ముకునే అవకాశం లేక నష్టపోతున్నామని చెప్పారు వెంటనే వేంసూర్ మండలంలోనే మొక్కజొన్న కొనుగోలు కేంద్రం ఏర్పాటు చేస్తే రైతులకు ఉపశమనం కలుగుతుందని పేర్కొన్నారు ఇప్పటికే పంట కోతలు ప్రారంభమయ్యాయని, ఆలస్యం లేకుండా చర్యలు తీసుకోవాలని రైతులు ప్రభుత్వాన్ని కోరారు కొనుగోలు కేంద్రం ఏర్పాటు ద్వారా మధ్యవర్తుల జోక్యం తగ్గి, రైతులకు న్యాయమైన ధర లభిస్తుందని వారు అభిప్రాయపడ్డారు. ఈ విషయంపై సంబంధిత అధికారులు స్పందించి, రైతులకు అనుకూలంగా చర్యలు తీసుకోవాలని స్థానిక ప్రజాప్రతినిధులను కూడా రైతులు కోరుతున్నారు.

# కేసీఆర్ సభను అడ్డుకునేందుకు కాంగ్రెస్ సర్కార్ కుట్ర

**- నేషనల్ హైవేను తవ్వడం దుర్మార్గం**
**- కేసీఆర్ సభకు ప్రజలు రాకుండా రోడ్లు కట్ చేస్తారా..?**
**- జగిత్యాల ఎమ్మెల్యే తీరుపై వేముల ఆగ్రహం**



(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

జగిత్యాల, ఏప్రిల్ 17 : బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ జగిత్యాల బహిరంగ సభను అడ్డుకోవడానికి కాంగ్రెస్ ప్రభుత్వం, స్థానిక ఎమ్మెల్యే అత్యంత నీచమైన కుట్రలకు పాల్పడుతున్నారని బాల్కొండ ఎమ్మెల్యే, మాజీ మంత్రి వేముల ప్రశాంత్ రెడ్డి తీవ్రంగా ధ్వజమెత్తారు. జగిత్యాల పట్టణ శివార్లలో నేషనల్ హైవే (ఎన్హెచ్-63) పై రోడ్డును తవ్వి పనులు చేపట్టిన ప్రాంతాన్ని శనివారం జిల్లా పార్టీ ప్రెసిడెంట్ కల్వకుంట్ల విద్యాసాగర్ రావుతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా వేముల ప్రశాంత్ రెడ్డి మాట్లాడుతూ. ఈ నెల 20,న జగిత్యాలలో కేసీఆర్ భారీ బహిరంగ సభ ఉన్నందున ఆర్మూర్ బాల్కొండ, కోరుట్ల, మెట్‌పల్లి వైపు నుంచి వచ్చే ప్రజలు, పార్టీ కార్యకర్తలు సభకు రాకుండా అడ్డుకోవడానికే ఉద్దేశపూర్వకంగా ఈ ప్రధాన రహదారిని తవ్వేయడం జరిగిందని ఆరోపించారు. పనులు ప్రారంభం కాకముందు నాలుగైదు రోజుల ముందుగానే జిల్లా పార్టీ ప్రెసిడెంట్ విద్యాసాగర్ రావు డైవర్షన్ రోడ్ ఏర్పాటు చేసినంకనే రోడ్ కట్ చేయాలనీ కోరినా కూడా కుట్రపూరితంగా ఎన్హెచ్ రోడ్డు మొత్తం కట్ చేశారని అన్నారు. ఇక్కడ బ్రిడ్జి పనులు మంజూరై రెండేళ్లు కావస్తోంది. అప్పటి నుంచి పనులు చేయకుండా, సరిగ్గా కేసీఆర్ గారి సభకు రెండు రోజుల ముందే రోడ్డు కట్ చేయడం వెనుక ఉన్న దురుద్దేశం ఏంటని ప్రశ్నించారు. ఇది జగిత్యాల ఎమ్మెల్యే సంకుచిత స్వభావానికి నిదర్శనమని మండిపడ్డారు. ఒక సివిల్ ఇంజనీర్‌గా, మాజీ ఆర్ అండ్ బీ మంత్రిగా చెబుతున్నాను.. నేషనల్ హైవేపై పనులు చేసేటప్పుడు ముందుగా ప్రత్యామ్నాయంగా 'బైపాస్ రోడ్డు'ఏర్పాటు చేయాలి. ఇది కనీస నిబంధన. కానీ ప్రజలకు ఇబ్బంది కలుగుతుందని తెలిసి కూడా కనీసం డైవర్శన్ ఇవ్వకుండా రోడ్డును పూర్తిగా మూసివేయడం దుర్మార్గమని విమర్శించారు. సభ సంగతి పక్కన పెడితే, జగిత్యాల నియోజకవర్గ ప్రజలు తమ దైనందిన పనుల కోసం పట్టణానికి రావాలంటే కిలోమీటర్ల మేర చుట్టూ తిరిగి రావాల్సి వస్తోందని, ప్రజలను ఇబ్బంది పెడుతున్న ఎమ్మెల్యేకు తగిన బుద్ధి చెబుతారని హెచ్చరించారు. ఈ వ్యవహారంపై ఆర్ అండ్ బీ ఉన్నతాధికారులు ఎన్ హెచ్ ఎస్ ఈ రూ తో మాట్లాడారు , వెంటనే ఇక్కడ డైవర్షన్ రోడ్డును ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో ప్రజలకు మరియు ట్రాఫిక్‌కు ఆటంకం కలిగిస్తున్నందుకు ఆర్ అండ్ బీ శాఖపై, సంబంధిత అధికారులపై న్యాయస్థానంలో కేసు వేస్తామని హెచ్చరించారు. కేసీఆర్ టికెట్ ఇచ్చి గెలిపిస్తే, ఇవాళ ఆయన సభనే అడ్డుకోవాలని చూడటం ఎమ్మెల్యే అవివేకమని, ఎన్ని అడ్డంకులు సృష్టించినా జగిత్యాల సభను లక్షలాది మందితో విజయవంతం చేసి తీరుతామని వేముల ప్రశాంత్ రెడ్డి స్పష్టం చేశారు.



# ఆసుపత్రిలో ప్రజలకు మెరుగైన సేవలందించాలి

**- జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష**
**- ఖని జనరల్ ఆసుపత్రిని ఆకస్మికంగా తనిఖీ చేసిన కలెక్టర్**
**- సీసీ రోడ్డు పనులు, పరిశుభ్రత, శానిటేషన్ పనితీరును మెరుగుపర్చాలని సూచన**
**-అదనపు ఓపీ బ్లాక్ ఏర్పాటుపై ప్రత్యేక దృష్టి**

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

గోదావరిఖని టౌన్, ఏప్రిల్ 17 : జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష శుక్రవారం గోదావరిఖని జనరల్ ఆసుపత్రిని ఆకస్మికంగా తనిఖీ చేసారు. ఆసుపత్రిలోని మెడికల్, ఓపీ, న్యూ బ్లాక్, ఐసీయూ బ్లాక్, ఎమర్జెన్సీ విభాగం, డ్యూటీ డాక్టర్స్ గదులను పరిశీలించి, రోగులకు అందుతున్న వైద్య సేవలపై వివరాలు తెలుసుకుని అవసరమైన సూచనలు చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ శ్రీహర్ష మాట్లాడుతూ ఆసుపత్రి ప్రాంగణంలో జరుగుతున్న సీసీ రోడ్డు పనులను వేగవంతంగా పూర్తి చేయాలని ఇంజనీర్లను ఆదేశించారు. శానిటేషన్ పనితీరును మెరుగుపర్చాలని సంబంధిత ఏజెన్సీకి సూచిస్తూ, తక్షణమే తనను కలవాలని ఆదేశించారు. రోగుల అవసరాలను దృష్టిలో ఉంచుకొని బెడ్ స్ట్రెంగ్త్ పెంపు కోసం చర్యలు చేపట్టాలని, మెడిసిన్ విభాగానికి అదనంగా ఒక ఓపీ బ్లాక్ ఏర్పాటు చేయాలని సూచించారు. ల్యాబ్ యంత్రాలు, ఎసీ వంటి పరికరాల్లో ఎలాంటి లోపాలు వచ్చినా వెంటనే మరమ్మత్తులు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. ఈ పర్యటనలో కలెక్టర్ వెంట డాక్టర్లు కృపా బాయి, రాజు, సంబంధిత అధికారులు, ఆసుపత్రి సిబ్బంది, తదితరులున్నారు.

# ఎఫ్ఎల్ఎన్ లక్ష్య సాధనలో జిల్లా ముందంజలో ఉండాలి

**- రీడింగ్ కాంప్రెన్షన్, రైటింగ్, గణిత నైపుణ్యాలపై ప్రత్యేక దృష్టి - ఉపాధ్యాయుల వినూత్న బోధన పద్ధతులతో మెరుగైన ఫలితాలు సాధించాలి - వచ్చే విద్యా సంవత్సరానికి సమగ్ర ప్రణాళికలు రూపొందించాలి - జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష - ఛాంపియన్ పాఠశాలలకు ప్రశంసా పత్రాలు ప్రదానం**



(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

పెద్దపల్లి, ఏప్రిల్ 17 : ఎఫ్ఎల్ఎన్ లక్ష్యాలను సమర్థవంతంగా అమలు చేసి, ప్రాథమిక స్థాయిలో విద్యార్థుల భాషా, గణిత నైపుణ్యాలను పెంపొందించడంలో పెద్దపల్లి జిల్లా ముందంజలో నిలవాలని జిల్లా కలెక్టర్ తెలిపారు. శుక్రవారం పెద్దపల్లి జిల్లాలోని ఎంబీ గార్డెన్‌లో నిర్వహించిన ఎఫ్ఎల్ఎన్ డిస్ట్రిక్ట్ కాంక్లేవ్-2025-26 కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ పాల్గొని, ప్రాథమిక, ప్రాథమికోన్నత పాఠశాలల ప్రధానోపాధ్యాయులతో ప్రొజెక్టర్ ద్వారా ఎఫ్ఎల్ఎన్ రివ్యూ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఉత్తమ ఫలితాలు సాధించిన పాఠశాలలను ఎఫ్ఎల్ఎన్ ఛాంపియన్ పాఠశాలలుగా ఎంపిక చేసి ప్రశంసా పత్రాలు అందజేశారు. ఉపాధ్యాయులు విద్యార్థుల పఠన అవగాహన మెరుగుపరచడానికి అనుసరించిన బోధన పద్ధతులు, భాషలలో రచనా నైపుణ్యం, గణితంలో గుణకం, భాగహారం నైపుణ్యాల పెంపుకు చేపట్టిన తరగతి గది చర్యలపై తమ అనుభవాలను పంచుకున్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ శ్రీహర్ష మాట్లాడుతూ బేస్‌లైన్, మిడ్‌లైన్, ఎండ్‌లైన్ పరీక్షల ఫలితాలను విశ్లేషించి, విద్యార్థుల అభ్యాస స్థాయిని నిరంతరం మెరుగుపరచాలని సూచించారు. మండలాల వారీగా ఫలితాలను సమీక్షిస్తూ, లోపాలు ఉన్న చోట ప్రత్యేక చర్యలు తీసుకోవాలని తెలిపారు. వచ్చే విద్యా సంవత్సరానికి ముందస్తుగా ప్రణాళికలు రూపొందించి, ప్రతి విద్యార్థి ప్రాథమిక నైపుణ్యాలు, రీడింగ్ కాంప్రెన్షన్ సామర్థ్యాలను పెంపొందించేలా ఉపాధ్యాయులు కృషి చేయాలని ఆదేశించారు. గడ్డం జగదీశ్వర్, ఆర్.కిరణ్, కృష్ణా రెడ్డి, రవి, ప్రభాకర్ రెడ్డి, దేవేందర్ రెడ్డి, పుష్పలత తదితరులకు జిల్లా కలెక్టర్ ప్రత్యేక ప్రశంసా పత్రాలు అందజేశారు. ఇంకా ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ సూపర్ సమ్మర్ క్యాంప్ వీడియోను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా విద్యాధికారి జి.శారద, జిల్లా అకడమిక్ మానిటరింగ్ ఆఫీసర్ డాక్టర్ పిఎం.షేక్, అలోక్ ప్రాజెక్ట్ సిఈఓ ప్రమోద్, ప్రతినిధి సమీద్ అహ్మద్, జిల్లాలోని ఎంఈఓలు, కాంప్లెక్స్ హెడ్‌మాస్టర్లు, జిల్లా రిసోర్స్ టీం సభ్యులు పాల్గొన్నారు.




# ఇండియన్ బ్యాంకులో అగ్ని ప్రమాదం

**ఖాతాదారుల డబ్బు, బంగారం భద్రమని తెలిపిన బ్యాంక్ మేనేజర్**

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)




గోదావరిఖని టౌన్, ఏప్రిల్ 17 : స్థానిక మార్కండేయ కాలనీలోని ఇండియన్ బ్యాంక్ లో శుక్రవారం ఉదయం మంటలు చెలరేగాయి. ఇండియన్ బ్యాంక్ లోపల నుండి దట్టమైన పొగలు బయటకు రావడంతో పక్కనే ఉన్న ఆదిత్య హోటల్ మేనేజర్ శంకర్ బ్యాంకు మేనేజర్‌కు సమాచారమందించి, వెంటనే ఫైర్ స్టేషన్‌కు కూడా సమాచార మందించారు. హుటాహుటిన ఫైర్ సిబ్బంది, బ్యాంక్ మేనేజర్ అక్కడకు చేరుకుని బ్యాంక్ తాళాలు తీయడంతో ఫైర్ సిబ్బంది మంటలను ఆర్పే ప్రయత్నాలను ముమ్మరం చేశారు. లోపల ఉన్న పొగనంతా ఫైర్ పరికరాలతో బయటకు తొలగించారు. బ్యాంక్ మేనేజర్ గదిలో ఉన్న ఏసీ నుండి ప్రింటర్ వరకు చిన్న షార్ట్ సర్క్యూట్ కావడంతో మేనేజర్ రూమ్ లో మంటలు అంటుకున్నట్లుగా తెలిసింది. బ్యాంకులోని మిగతా సిస్టమ్స్‌కు గానీ, లాకర్ రూమ్, స్ట్రాంగ్ రూమ్‌కు గానీ ఏమీ కాకపోవడంతో బ్యాంక్ అధికారులు ఊపిరి పీల్చు కున్నారు. ఖాతాదారులు కూడా భయపడాల్సిన అవసరం లేదని, వారి డబ్బులు, గోల్డ్ లోన్ ద్వారా బ్యాంక్ లో ఉంచిన బంగారం భద్రంగానే ఉన్నట్లు బ్యాంక్ మేనేజర్ సౌరబ్, అసిస్టెంట్ మేనేజర్ వెంకటేష్ తెలిపారు. బ్యాంకులో చెలరేగిన మంటలను తొందరగా పసిగట్టడంతో పెద్ద ప్రమాదం తప్పింది. మేనేజర్ రూమ్ లోని సిస్టమ్ తప్ప అన్ని సేఫ్ గానే ఉండడంతో ఖాతాదారులు ఊపిరి పీల్చుకున్నారు.

# బిజెపిని విమర్శించే నైతిక హక్కు కాంగ్రెస్, బిఆర్ఎస్ లకు లేదు

**- బిజెపి జిల్లా అధికార ప్రతినిధి మర్రిపెల్లి సత్యమ్**

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

జగిత్యాల, ఏప్రిల్ 17 : బిజెపిని విమర్శించే నైతిక హక్కు కాంగ్రెస్, బిఆర్ఎస్ లకు లేదని బిజెపి జిల్లా అధికార ప్రతినిధి మర్రిపెల్లి సత్యమ్ అన్నారు. ఈ సందర్భంగా శనివారం ఆయన మాట్లాడుతూ..కాంగ్రెస్ వైఖరి వల్ల భారతదేశానికి స్వాతంత్రం రావడానికి లక్షలాది మంది ప్రాణాలు అర్పించారని, దానివల్ల భారతదేశం నుండి పాకిస్తాన్ మత ప్రాతిపదికన ఏర్పడిందని తెలిపారు. స్వాతంత్ర అనంతరం కాంగ్రెస్ పార్టీ వైఖరి వల్లనే 2009 లో డిసెంబర్ 03,న సోనియాగాంధీ జన్మదినం సందర్భంగా ఇచ్చిన తెలంగాణ హామీని విస్మరించడం వల్లనే తెలంగాణలో 1200 మంది బలిదానం చేసుకున్నారని, వాజ్పేయి నేతృత్వంలో మూడు రాష్ట్రాలు ఏర్పడితే ఒక్క రక్తం బొట్టు కూడా చిందలేదని, ఎంపీ తేజస్వి సూర్య చెబితే దానికి కాంగ్రెస్, టీఆర్ఎస్ నాయకులు తేజస్వి సూర్యపై అవాకులు చవాకులు మాట్లాడుతున్నారని బిజెపి జిల్లా అధికార ప్రతినిధి మర్రిపెల్లి సత్యం విమర్శించారు. మంత్రి పొన్నం ప్రభాకర్, ఇతర మంత్రులు ఎమ్మెల్యేలు ఎంపీలు కాంగ్రెస్ నాయకులకు ఏ మాత్రం సిగ్గు శరం ఉన్న ముందుగా కాంగ్రెస్ పార్టీలో ఉన్న పాకిస్తాన్ ప్రేమికులను పార్టీ నుండి సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశారు. నీకు పాకిస్తాన్ శత్రువు అయితే నాకెందుకు శత్రువు కావాలని నేను పాకిస్తాన్ ను ప్రేమిస్తా అన్న ఎమ్మెల్సీ అద్దంకి దయాకర్ ను, ఇతర దేశాలకు వెళ్ళినప్పుడు భారతదేశం జిడిపి కంటే పాకిస్తాన్ జిడిపి చాలా గొప్పగా ఉందని ప్రశంసించి భారత్ పరువు తీసిన రాగుల్ బాబాను భారతదేశం గుండెకాయ అయినా భారత పార్లమెంటుకు ఎన్నికై ప్రమాణ స్వీకార అనంతరం జై పాలస్తీనా అన్న ప్రియాంకను పాకిస్తాన్ వెళ్ళితే సొంత ఇంటికి వెళ్లినట్లుందని వ్యాఖ్యానించిన రాహుల్ సలహాదారు శ్యామ్ పిట్రోడను ముందుగా కాంగ్రెస్ నుంచి బహిష్కరించిన తరువాతనే కాంగ్రెస్ నాయకులు మాట్లాడాలని అన్నారు. రాజ్యాంగాన్ని మరియు రాజ్యాంగ నిర్మాత అంబేద్కర్ ను అవమానించినట్టుగా భావిస్తున్న కాంగ్రెస్ నాయకులు అంబేద్కర్ రాసిన రాజ్యాంగంలో 370 ఆర్టికల్ లేదని మైనార్టీ కమిషన్,వక్ఫ్ బోర్డ్ లేదని సోషలిజం సెక్యులరిజం అనే పదాలు లేవని భారత రాజ్యాంగాన్ని అత్యధిక సార్లు సవరించి అంబేద్కర్ ను అవమానించింది కాంగ్రెస్ పార్టీయేనని గుర్తెరగాలని అన్నారు. తెలంగాణ ఏర్పాటులో కాంగ్రెస్ పార్టీ బిఆర్ఎస్ పార్టీల పాత్ర శూన్యం అని లేకుంటే 2009 లోనే సోనియాగాంధీ జన్మదినం డిసెంబర్ 09 నాడు ప్రకటించిన తెలంగాణ ఎందుకు ఇవ్వలేదని ప్రశ్నించారు. అందువల్లనే 1200 మంది ప్రాణత్యాగం చేసుకున్నారని వాల్ల త్యాగాల పునాదులపై కాంగ్రెస్, బిఆరేస్ పార్టీలు సౌధాలు నిర్మించుకున్నారని ఎద్దేవాచేశారు. తెలంగాణ చిన్నమ్మ సుష్మా స్వరాజ్ అప్పటి యూపీఏ ప్రభుత్వంపై ఒత్తిడి తేవడం వల్లనే కాంగ్రెస్ పార్టీ బిల్లు ప్రవేశపెట్టిందని, బిజెపి మద్దతు వలన తెలంగాణ కల సాకారమైందని అన్నారు. తెలంగాణ బిల్లు పార్లమెంట్ లో ప్రవేశపెట్టిన రోజు బిఆర్ఎస్ పార్టీ ఎంపీల సంఖ్యాబలం ఎంతనో ఒక్కసారి గుర్తుకు తెచ్చుకోవాలని అన్నారు. ఆ సమయంలో బిఆర్ఎస్ సంఖ్యాబలం పార్లమెంట్లో కేవలం రెండు మాత్రమేనని అందులో విజయశాంతి మాత్రమే బిల్లుకు మద్దతుగా ఓటేశారని అందులో కేసీఆర్ బిల్లుకు మద్దతుగా ఓటేయకుండా తెలంగాణ ద్రోహిగా మిగిలిపోయారన్న విషయం తెలుసుకోవాలని అన్నారు. మిగులు బడ్జెట్ తో ఉన్న తెలంగాణను అప్పుల తెలంగాణగా చేసిన కాంగ్రెస్, బిఆర్ఎస్ పార్టీలకు బిజెపిని తేజస్వి సూర్యను విమర్శించే నైతిక హక్కు లేదన్నారు. వికసిత్ భారత్ లో భాగంగా దశాబ్దాలుగా పెండింగ్లో ఉన్న మహిళలకు 33 శాతం రిజర్వేషన్ల విషయంలో మరియు నియోజకవర్గాల పునర్విభజనతో భారత్ ముక్త్ కాంగ్రెస్ కాబోతుందని భయపడి హడావుడి చేస్తున్నారని అన్నారు. తెలంగాణ ఉద్యమకారులపై తుపాకీ ఎక్కుపెట్టి ఉద్యమకారులను అవమానించి సోనియా గాంధీని బలిదేవత అని మాట్లాడిన రేవంత్ రెడ్డిని ముఖ్యమంత్రిని చేసిన కాంగ్రెస్ నాయకులదే మిడి మిడి జ్ఞానం అని హేళన చేశారు. ఈ సమావేశంలో బీజేపీ మండల అధ్యక్షుడు పల్లె మోహన్ రెడ్డి, ప్రధాన కార్యదర్శులు షేర్ అంజన్న, తొడేటి గట్టయ్య, తడగొండ శ్రీనివాస్, పుసాల శ్రీనివాస్, శ్రీరామ్ చారి తదితరులు పాల్గొన్నారు.







# లవ్ జిహాద్' కు వ్యతిరేకంగా భజరంగ్ దళ్ నిరసన

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

గోదావరిఖని టౌన్, ఏప్రిల్ 17 : దేశంలో ముస్లిం యువకులు ప్రేమ పేరుతో హిందూ అమ్మాయిలను మోసం చేస్తూ, ఎదురుతిరిగితే హత్యలు చేస్తూ లవ్ జిహాద్ వాతావరణం సృష్టిస్తున్నారని విశ్వహిందూ పరిషత్ విభాగ్ కార్యదర్శి అయోధ్య రవీందర్ ఆరోపించారు. లవ్ జిహాద్ కు వ్యతిరేకంగా గోదావరిఖని లక్ష్మీ నగర్ నుండి ప్రధాన చౌరస్తా వరకు శుక్రవారం నిరసన ప్రదర్శన చేపట్టారు. ఈ కార్యక్రమంలో అయోధ్య రవీందర్ మాట్లాడుతూ ఐటీ క్యాంపస్ లలో, యూనివర్సిటీ, కాలేజ్ లలో అమాయక హిందూ అమ్మాయిలను ప్రేమ పేరుతో మతం మార్చుతూ లవ్ జిహాద్ చేస్తున్నారని, దీనిని మానివేయకపోతే భజరంగ్ దళ్ కార్యకర్తలు ఎదురు తిరుగుతారని హెచ్చరించారు. ఇంకా ఈ కార్యక్రమంలో నగర కార్యదర్శి మునిగాల సంపత్, అడిగొప్పుల రాజు, మేడగోని రవీందర్, ఆరెల్లి జలంధర్, కొండపర్తి లింగన్న, డా.రాజేష్, అనిరుధ్, దిగంబర్, అరవింద్, చందు, మహేందర్ గౌడ్, వెంకటేష్, తిరుపతి, రాజిరెడ్డి, మున్నా, రాజమౌళి, శివ, శ్రీను, తదితరులు పాల్గొన్నారు.




# వరి ధాన్యం కొనుగోళ్లకు ఏర్పాట్లు పూర్తి చేయాలి

**జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్**

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

నిర్మల్, ఏప్రిల్ 17 : నిర్మల్ జిల్లాలో వరి ధాన్యం కొనుగోళ్లను సజావుగా నిర్వహిం చేందుకు అవసరమైన అన్ని ఏర్పాట్లను త్వరితగతిన పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ అధికారులను ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో వరి ధాన్యం కొనుగోలు కేంద్రాల ఏర్పాటుపై సంబంధిత శాఖల అధికారులతో ఆమె సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, ప్రభుత్వ నిర్దేశిత గడువుల్లోనే కొనుగోలు ప్రక్రియను ప్రారంభించి, సమయానికి పూర్తి చేయాలని స్పష్టం చేశారు. ప్రతి కొనుగోలు కేంద్రం వద్ద రైతులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా సమగ్ర చర్యలు చేపట్టాలని సూచించారు. ప్రస్తుత అధిక ఉష్ణోగ్రతలను దృష్టిలో ఉంచుకొని రైతులకు ఇబ్బందులు కలుగకుండా కేంద్రాల వద్ద టెంట్లు, త్రాగునీరు, విశ్రాంతి సదుపాయాలు కల్పించాలని పేర్కొన్నారు. అలాగే, ధాన్యం కొనుగోలు ప్రక్రియలో ఎలాంటి అంతరాయాలు లేకుండా తగినన్ని గన్నీ సంచులు, తూకపు యంత్రాలు, తేమ కొలిచే పరికరాలు, టార్పాలిన్లు అందుబాటులో ఉంచాలని ఆదేశించారు. ప్రభుత్వం అందించిన చెక్‌లిస్ట్ ప్రకారం అన్ని సామాగ్రి సమగ్రంగా ఉందో లేదో పరిశీలించి, పరికరాలు సక్రమంగా పనిచేసేలా ముందస్తు తనిఖీలు చేయాలని సూచించారు. ప్రతి కొనుగోలు కేంద్రంలో నిబంధనలకు అనుగుణంగా రిజిస్టర్లను పకడ్బందీగా నిర్వహించాలని, ధాన్యం స్వీకరణలో పారదర్శకత పాటించాలని కలెక్టర్ స్పష్టం చేశారు. రైతులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని ఆదేశించారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ (రెవెన్యూ) కిషోర్ కుమార్, డీఆర్‌డీఓ విజయలక్ష్మి, వ్యవసాయ శాఖ అధికారి అంజిప్రసాద్, పౌర సరఫరాల శాఖ అధికారులు రాజేందర్, సుధాకర్, మార్క్‌ఫెడ్ ప్రతినిధులు మహేష్, మిలర్స్ అసోసియేషన్ సభ్యులు, అధికారులు పాల్గొన్నారు.



# విద్యుత్ ఆర్టిజన్ల సమస్యలు పరిష్కరించాలి

**మెదక్ నియోజకవర్గ ఇంచార్జీ కంటారెడ్డి తిరుపతి రెడ్డి**

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

మెదక్, ఏప్రిల్ 17 :విద్యుత్ సంస్థలో పనిచేస్తున్న ఆర్టిజన్ కార్మికుల సమస్యలను వెంటనే పరిష్కరించాలని కోరుతూ మెదక్ విద్యుత్ డివిజన్ కార్యాలయం ముందు 10వ రోజైన శుక్రవారం రోజు తెలంగాణ విద్యుత్ ఆర్టిజన్ ఎంప్లాయిస్ జాయింట్ యాక్షన్ కమిటీ (టివిఏఈ జెఏసి) పిలుపు మేరకు ఆర్టిజన్లు నిరవధిక సమ్మె నిర్వహించారు.ఆర్టిజన్ల సమ్మెకు మెదక్ నియోజకవర్గ బిఆర్ఎస్ ఇంచార్జీ కంటా రెడ్డి తిరుపతి రెడ్డి హాజరై సంఘీ భావం వ్యక్తం చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఆర్టిజన్ ల డిమాండ్లు న్యాయ పరమైనవేనని, డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క యూనియన్ నాయకులతో చర్చలు జరిపి మీకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు.లేని పక్షంలో తమ పార్టీ మీకు ఎప్పుడూ అండగా ఉంటుందని, ఆర్థికంగా సహాయ సహకారాలు అందిస్తానని హామీ ఇచ్చారు.ఎండనక, వాననక, రాత్రింబవళ్ళు కష్ట పడి పనిచేసేది మీరైతే, ఉన్నతాధికారులు ఏసిలలో పడుకుంటున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు.కేవలం రూ.30వేలతో బతుకులు నెట్టుకు రావటం చాలా చాలా బాధాకరమని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ఈకార్యక్రమంలో మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ మాణిక్ రెడ్డి,మెదక్ పట్టణ అధ్యక్షులు మామూళ్ల ఆంజనేయులు, కౌన్సిలర్ గౌస్ ఖురేషి,కల్వకుంట్ల సర్పంచ్ కొండలు రెడ్డి, మాజీ ఎంపీపీ అంజన్న,సతీష్ రావు, చందుగౌడ్, సాంగు స్వామీ, చిన్నశంకరంపేట మండల వైస్ ప్రెసిడెంట్ బాగా రెడ్డి, మెదక్ నియోజకవర్గ నాయకులు గంజి నవీన్,మండల ఎస్టీ సెల్ అధ్యక్షులు లాలు నాయక్,మందాపూర్ మాజీ సర్పంచ్ సుధాకర్,మాజీ కౌన్సిలర్ జయరాజు, గోపనీ సాయి,మహిళా ఆర్టిజన్లు సుమలత, జ్యోతి,ప్రణీత, నాగమణి,జెఏసి నాయకులు జంగం శరత్, పృథ్వీ గౌడ్, ప్రదీప్ గౌడ్, శ్రీశైలం, శ్రీనివాస్, బి.చంద్ర భానప్ప, బి.సంపత్ కుమార్, పాపయ్యోల రమేష్, వై.సంగమేశ్వరరెడ్డి, నాగరాజు, వెంకటచారీ,రాజుగౌడ్, మొగులయ్యా, బుస్ససత్యం గుప్తా, పోలశ్రీనివాస్, రమావత్ హరినాయక్, ఉపేందర్, రమావత్ గోపాల్ నాయక్, రమావత్ పూల్య నాయక్, వై.జైపాల్ రెడ్డి,యూసుఫ్, కిషన్, అశోక్, మోహన్, పరశురామ్, నర్సింలు, సుధాకర్, సాయిలు, యాదగిరి, సూర్య రమేష్,శ్రీనివాస్ రెడ్డి, ప్రభాకర్, గంగారం, ప్రవీణ్, మఠం సంగమేశ్వర తదితరులు పాల్గొన్నారు.నిరవధిక సమ్మెలో భాగంగా మెదక్ విద్యుత్ డివిజన్ కార్యాలయం ముందు కార్మికులు వంటా వార్పు కార్యక్రమం నిర్వహించి తమ తమ నిరసనను వ్యక్తం చేశారు.

ప్రజాలక్ష్యం
సంపాదకీయం

## ప్రజలకు మరింత భారం కానున్న సీట్ల పెంపు

మహిళా బిల్లు, డీలిమిటేషన్‌పై పార్లమెంటు సమావేశాలు వాడీవేడిగా సాగుతున్నాయి. ఈ సమావేశాలకు చాలా ప్రత్యేకత ఉంది. ఎందుకంటే ఎన్నో ఏళ్ల నుంచి ఎదురుచూస్తున్న, చట్టసభల్లో అమలుకు నోచుకుని మహిళలకు 33శాతం రిజర్వేషన్ చట్టం నారీ శక్తి వందన్ అధినియమ్ మోదీ ప్రభుత్వం అమలు చేసేందుకు పట్టుదలగా ఉంది. నిజానికి ఇది ఎన్నో ఏళ్ల కల. ఇప్పటికే చాలా ఆలస్యం అయ్యింది. ఈ క్రమంలో దేశంలో 50శాతం ఉన్న మహిళలకు రిజర్వేషన్ అన్నది హక్కుగా దక్కాల్సిందే. పురుషాధిక్యాన్ని ఎదుర్కొని నిలబడాలంటే వారికి రిజర్వేషన్లు ఉండాల్సిందే. అయితే ఈ విషయంలో ఇప్పటికే ఉన్న సీట్లకు అనుగుణంగా అమలు చేయకుండా లోక్‌సభ సీట్లను 816కి పెంచడం అన్నది చాలా దారుణం. ఎందుకంటే ఉన్న లోక్ సభ, అసెంబ్లీ సీట్లతోనే దేశం ఆర్థికంగా తీవ్రంగా నష్టపోతోంది. ప్రజాప్రతినిధులకు ఇచ్చే జీత భత్యాలు, పెన్షన్లు, క్వార్టర్లు, విమాన ఖర్చులు ఇలా చెప్పుకుంటూ పోతే తడిసి మోపెడవుతున్నాయి. ఈ ఖర్చులను తగ్గించి, జీతభత్యాల్లో కోత విధించి, పెన్షన్లు తగ్గించాల్సి ఉన్నా వాటిపై ఎవ్వరూ మాట్లాడడం లేదు. ఉద్యోగులకు లేని పెన్షన్లు వీరికెందుకన్నది చెప్పడం లేదు. ఒక్కొక్కరు రెండేసి పెన్షన్లు పొందుతున్నప్పటికీ ఘనత వహించిన మోదీ ప్రభుత్వం గుర్తించడం లేదు. దీనిగురించి చట్టసభల్లో అడిగేవారు లేరు. ఇప్పుడు ఎంపిలు, ఎమ్మెల్యేల ఖర్చులు వేల కోట్లల్లో ఉంటోంది. దీనిని మరింత తగా పెంచడం కన్నా తగ్గించాలి. ఒకవేళ సీట్లు పెంచాల్సి వస్తే ఓ 50 లేదా 60 వరకు పెంచి వుంటే బాగుండేది. కనీసం ఓ 600 వరకు పెంచి, అందులో 250 మహిళలకు కేటాయిస్తే మంచిది. ప్రజాప్రతినిధుల సంఖ్యను పెంచి జనం మీద బాదే బదులు తగ్గిస్తే మంచిది. సీట్లు పెంచడం లాభం కనుక పెంచుతున్నారన్న విమర్శలు కూడా ఉన్నాయి. కానీ మహిళా భివృద్ధి కోసం పాటుపడే లక్ష్యంలో మాత్రం అభినం దించాల్సిందే. మహిళల విద్యకు, ఆర్థికంగా ఎదిగేందుకు ఊతమివ్వాలి. విద్యారంగంలో మహిళలకు వడ్డీలేని రుణాలు ఇవ్వాలి. మహిళా పారిశ్రామికవేత్తలను ప్రోత్సహించాలి. ఉదారంగా వారికి రుణాలు ఇవ్వాలి. ఇవన్నీ చేస్తూనే కేంద్ర ప్రభుత్వం చట్టసభల్లో కూర్చోబెట్టడానికి అవకాశం కల్పిం చాలి. డీలిమిటేషన్‌ను వ్యతిరేకిస్తున్న పార్టీలు ఇవన్నీ చర్చించాలి. సీట్ల సంఖ్యను పరిమితం చేసి, జీతభత్యాలన ఎత్తేసి, పెన్షన్లను రద్దు చేసేలా చర్చ చేయాలి. కేవలం రాజ కీయ లబ్ధి కోసమే చేయడం అన్నది సరికాదు. బిజెపికి గత ఎన్నికల్లో కూడా మహిళా ఓటు బ్యాంకు చాలా కీలకంగా మారిందన్న గణాంకాలు ఉన్నాయి. 2014 నుంచి 2024 సార్వత్రిక ఎన్నికల్ని పరిశీలిస్తే.. మహిళల ఓట్ల వల్లే బిజెపి గెలిచిందనడంలో అతిశయోక్తి లేదు. 1998 ఎన్నికల్లో బిజెపి కి మహిళా ఓటింగ్ 33 శాతం. అప్పుడు అటల్ బిహారీ వాజ్‌పేయి అధికారంలోకి వచ్చింది. కాంగ్రెస్‌కి 30 శాతమే. ఆ తర్వాత మళ్లీ బిజెపికి మహిళా ఓటింగ్ తగ్గినా.. 2014 నుంచి క్రమేణా పెరుగుతోంది. 2024 ఎన్నికల్లో కాంగ్రెస్‌కి 22 శాతం అయితే.. బిజెపికి 36 శాతం మహిళా ఓటింగ్ నమోదైందని ఎన్ఇఎస్ గణాంకాలే వెల్లడించాయి. అంటే మహిళలు అండగా ఉన్నందున ప్రతి విషయంలోనూ బిజెపి వారికి అనుకూల నిర్ణయాలు తీసుకోవాలి. ఇబ్బడిముబ్బడిగా ఎంపి, ఎమ్మెల్యే సీట్లు పెంచి, మహిళల కోసమే అని చెప్పడం సరికాదు. సీట్ల సంఖ్యను పెంచకుండానే వారికి 33శాతం అమలు చేయవచ్చు. విశ్లేషకులు కూడా ఇదే కోరుతున్నారు. 2019లో 89.6 కోట్ల మంది ఓటర్లు తమ ఓటుహక్కును వినియోగించుకున్నారు. వీరిలో 46.5 కోట్ల మంది పురు షులు, 43.1 కోట్ల మంది మహిళలు తమ ఓటు హక్కును వినియోగించు కున్నారు. 2024కి 96.8 కోట్ల మంది తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. ఈ ఎన్నికల్లో మహిళా ఓటర్లు 47.1 కోట్లకి చేరారు. అంటే 2019కి కంటే 2024కి నాలుగు కోట్లమంది మహిళా ఓటర్లు పెరిగారు. ఇక ఈ ఎన్నికల్లో కొత్త ఓటర్లు 2.63 పెరగగా వారిలో 1.41 కోట్ల మంది మహిళలు, 1.22 మంది పురుషుల ఓటర్లు పెరిగారు. 2019లో 12 రాష్ట్రాల్లో రికార్డు స్థాయిలో మహిళా ఓటర్లు పెరిగారు. అయితే 2024లో 36 రాష్ట్రాలు కేంద్రపాలిత ప్రాంతాల్లో 19 రాష్ట్రాల్లో మహిళా ఓటింగ్ పెరిగింది. అందువల్ల న్యాయంగా వారికి దక్కాల్సిన సీట్లను ఇవ్వాల్సిందే. అయితే అందుకోసం ఉన్న పార్లమెంట్, అసెంబ్లీ సీట్లను భారీగా పెంచడం సరికాదు. ఇప్పుడున్న లోక్‌సభ సీట్లు 543 కాస్తా.. 816కి పెరుగుతాయని హోం మంత్రి అమిత్ షా ప్రకటించారు. ఈ సీట్ల కేటాయింపుల్లో కూడా ఉత్తరప్రదేశ్, బీహార్ రాష్ట్రాలకే ఎక్కువ సీట్లు వచ్చే అవకాశం ఉంది. లోక్‌సభ స్థానాల పరంగానూ, ఇటు రాష్ట్రాల పరంగానూ ఎంపి, ఎమ్మెల్యే సీట్లు పెరగడం ఓ రకంగా రాజకీయ పార్టీలకే తప్ప ప్రజలకు ఒనగూరే ప్రయోజనం ఉండదు. రాజకీయంగా మహిళలు ఎదగా లన్నది, పరిపాలనలో భాగస్వామ్యం కావాలన్న విషయంపై ఎవరికీ వ్యతిరేకత లేదు. రాజకీయాల్లో ధనబలం, కండబలం నిరోధించాలంటే మహిళలను రాజకీయాల్లోకి తీసుకుని రావాల్సిందే. ఆ విషయంలో మహిళకు ఆర్థిక స్వేచ్ఛను కూడా ఇవ్వాల్సిందే. ఆస్తిలో హక్కులు కల్పించాల్సిందే. ఒకవేళ గెలిచినా.. మహిళల్ని తమ ఆలోచనలకు తగ్గట్టుగా పనిచేయనివ్వాలి. సామాజిక, ఆర్థిక పరంగా మహిళలు చైతన్యవంతంగా ఉంటే మంచి సమాజం ఏర్పడుతుంది. సీట్ల పెంపు వల్ల పెద్దగా ప్రయోజనం లేదు. మహిళా కోటాను అమలు చేయడం కోసం సీట్లు పెంచాలనుకోవడం సరికాదు. అందువల్ల ఉన్న సీట్లలో 33శాతం అమలు చేయడమా లేదా, ఇపుడు 542ను 200కు పెంచడమా సబబుగా ఉంటుంది. ఏకంగా 816కు పెంచడం దేశంపై ముఖ్యంగా పన్నుల కట్టే ప్రజలపై భారం మోపడమే అవుతుంది.



# అంకెల మాయాజాలంలో సామాజిక న్యాయం...!?

## తెలంగాణ కులగణన నివేదికపై విశ్లేషణ

దశాబ్దాలుగా తెలంగాణ సామాజిక ముఖచిత్రంపై సాగుతున్న అస్తిత్వ పోరాటాల్లో 'కుల గణన' ఒక చారిత్రక సంధికాలం. అణగారిన వర్గాల ఆత్మగౌరవానికి, ఆర్థిక సమానత్వానికి ప్రాతిపదికగా నిలవాల్సిన ఈ నివేదిక, నేడు అనేక సందేహాల సుడిగుండంలో చిక్కుకుంది. కేవలం గణాంకాల సేకరణగా కాకుండా, తరతరాల సామాజిక వివక్షకు విరుగుడుగా, వనరుల పంపిణీలో సమన్యాయం చేకూర్చే 'సామాజిక ఎక్స్‌రే'గా ఈ సర్వే నిలుస్తుందని ఆశించిన కోట్లాది మంది సామాన్యులకు, ప్రస్తుత నివేదికలోని అస్పష్టతలు తీవ్ర నిరాశను మిగిలిస్తున్నాయి.

ప్రభుత్వ యంత్రాంగం ఆర్భాటంగా విడుదల చేసిన ఈ అంకెలు, క్షేత్రస్థాయి వాస్తవాలకు అద్దం పడుతు న్నాయా? లేక పాలకుల రాజకీయ అవసరాలకు అను గుణంగా వంచించబడ్డాయా? అనే ప్రశ్న ఇప్పుడు తెలం గాణ సమాజాన్ని వేధిస్తోంది. సంక్షేమ పథకాల రూప కల్పనలో శాస్త్రీయతను నింపాల్సిన ఈ డేటా, పారదర్శకత లోపించడం వల్ల సామాజిక న్యాయం అనే లక్ష్యాన్ని చేరుకోలేక ఒక 'మరీచిక'లా మిగిలిపోయే ప్రమాదం కనిపిస్తోంది. సమగ్ర కుటుంబ సర్వే అనుభవాల నుంచి పాఠాలు నేర్చుకోకుండా, లోపభూయిష్టమైన పద్ధతులతో జరిపిన ఈ గణన.. అట్టడుగు వర్గాల సాధికారతకు బాటలు వేస్తుందా? లేక ఎన్నికల వ్యూహాల్లో భాగంగా సామాజిక ముసుగులో జరుగుతున్న మరో రాజకీయ క్రీడ మాత్రమేనా? అన్న అంశంపై లోతైన విశ్లేషణ అత్యవసరం.

### జనాభా గణాంకాలపై అనుమానాలు:

నివేదిక ప్రకారం తెలంగాణ మొత్తం జనాభా 3.55 కోట్లుగా వెల్లడైంది. అయితే, 2011 జనాభా లెక్కల ప్రకారం తెలంగాణ జనాభా సుమారు 3.51 కోట్లు. పదేళ్ల వ్యవధిలో సాధారణంగా జనాభా వృద్ధిని బట్టి చూస్తే, 2024 నాటికి రాష్ట్ర జనాభా 4 కోట్లకు పైగా ఉండాలని నిపుణులు అంచనా వేస్తున్నారు. మరి ఈ సర్వేలో దాదాపు 45 లక్షల నుండి 50 లక్షల మంది జనాభా ఎక్కడ పోయారు? ఇది గణన శాస్త్రీయతపై తీవ్రమైన సందేహాలను లేవనెత్తుతోంది. ముఖ్యంగా గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో కేవలం 85–90% ఇళ్లను మాత్రమే కవర్ చేశారని, అపార్ట్మెంట్లలో నివసించే వారిని, వలస వెళ్లి తిరిగి రాని వారిని, ఇతర ప్రాంతాల నుండి వలస వచ్చిన వారిని సరిగ్గా లెక్కించలేదనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. జనాభా గణనలో ఇంతటి భారీ వ్యత్యాసం ఉన్నప్పుడు, దాని ఆధారంగా రూపొందించే ఏ విధాన నిర్ణయమైనా అసంపూర్ణంగానే ఉంటుందనడంలో సందేహం లేదు.

### వర్గాల వారీగా అంకెల్లో గందరగోళం బీసీలకు అన్యాయం?

సర్వే ప్రకారం బీసీలు 56.33% (2,00,85,767 మంది) గా చూపబడ్డారు. ఇంతకుముందు సమగ్ర కుటుంబ సర్వేలో బీసీ జనాభా 52%గా ఉండగా, ఇప్పుడు ముస్లింలను కలుపుకొని 56%గా చూపడంపై తీవ్ర అభ్యంతరాలు వ్యక్తమవుతున్నాయి. ముస్లింలలోని బీసీలను (10.08%) మినహా హిందూ బీసీలను (46.25%) కలిపి చెప్పడం ద్వారా హిందూ బీసీల సంఖ్యను తక్కువ చేసి చూపారనే వాదన బలంగా వినిపిస్తోంది. ఇది హిందూ బీసీల రాజకీయ ప్రాధాన్యతను తగ్గించడానికి ఉద్దేశపూర్వకంగా చేసిన ప్రయత్నమా అనే అనుమానాలు తలెత్తుతున్నాయి. నిజంగా బీసీల సంక్షేమం ప్రభుత్వ లక్ష్యమైతే, హిందూ బీసీల వాస్తవ జనాభాను స్పష్టంగా ఎందుకు వెల్లడించలేదు?


ఎస్సీలు 17.43% (61,84,319) గా ఉండగా, ఎస్సీ వర్గీకరణ నేపథ్యంలో మాదిగ/మాల ఉపకులాల మధ్య జనాభా నిష్పత్తిని స్పష్టంగా వెల్లడించకపోవడం మరో లోపం. ఇది దశాబ్దాలుగా వర్గీకరణ కోసం పోరాడుతున్న మాదిగ, మాల వర్గాల మధ్య తీవ్ర అసంతృప్తిని రేకెత్తించే అవకాశం ఉంది. ఎస్టీలు 10.45% (37,05,929) తో ఉండగా, గిరిజన ప్రాంతాల్లో పూర్తిస్థాయిలో గణన జరగలేదనే ఆరోపణ ఉంది. ఇక ఎస్టీలు 15.79% (56,01,539) గా చూపించడం కూడా అనేక అనుమానాలకు తావిస్తోంది. గతంలో 10% లోపు ఉన్న ఎస్టీ జనాభా ఇప్పుడు 15% పైగా పెరగడం వెనుక ఉన్న కారణాలు ఏమిటి? ఇది ఓటు బ్యాంకు రాజకీయాల్లో భాగంగా కొన్ని వర్గాలను సంతృప్తిపరచడానికా అనే ప్రశ్నలు తలెత్తుతున్నాయి.

### ఆర్థిక అసమానతలు - అగ్రవర్ణాల చేతుల్లోనే సంపద

సర్వే నివేదికలో వెల్లడైన ఆర్థిక, సామాజిక అసమానతలు రాష్ట్రంలోని వాస్తవ పరిస్థితికి అద్దం పడుతున్నాయి. రాష్ట్ర సగటు (CBI - Caste Backwardness Index) స్కోరు 81గా ఉండగా, రాష్ట్రంలోని 242 కులాల్లో 135 కులాలు (67% జనాభా) రాష్ట్ర సగటు కంటే ఎక్కువ వెనుకబడి ఉన్నాయని తేలింది. ఎస్టీ దక్కలి వర్గం 116 స్కోరుతో అత్యంత వెనుకబడిన కులంగా నమోదైంది.

ఆస్తుల కేంద్రీకరణ, ఉద్యోగ, విద్యా రంగాల్లోని వ్యత్యాసాలు తీవ్ర ఆందోళన కలిగిస్తున్నాయి. ప్రైవేట్ రంగ ఉద్యోగాల్లో 30% వాటా జనరల్ కేటగిరీకి ఉండగా, జనాభాలో దాదాపు సమానంగా ఉన్న ఎస్టీలకు కేవలం 5% మాత్రమే లభిస్తోంది. విద్యా రంగంలోనూ ఇదే పరిస్థితి. ప్రైవేట్ పాఠశాలల్లో ఆధిపత్యకులాల పిల్లలు 33% చదువుతుంటే, ఎస్సీ, ఎస్టీ పిల్లలు 10% కంటే తక్కువగా ఉన్నారు. ఇది ఆర్థికంగా బలమైన వర్గాలు మాత్రమే మెరుగైన విద్యను పొందగలుగుతున్నాయనే చేదు నిజాన్ని వెల్లడిస్తోంది. విద్య, ఉద్యోగ అవకాశాల్లో ఎస్సీ, ఎస్టీ, బీసీ వర్గాలు ఇంకా ఎంత వెనుకబడి ఉన్నాయో ఈ గణాంకాలు స్పష్టం చేస్తున్నాయి.

వార్షిక ఆదాయం విషయానికొస్తే, జనరల్ కేటగిరీ కుటుంబాల సగటు వార్షిక ఆదాయం రాష్ట్ర సగటు కంటే చాలా ఎక్కువగా ఉండగా, 80% పైగా ఎస్సీ, ఎస్టీ మరియు బీసీ (ముస్లిం లతో కలిపి) కుటుంబాలు రూ. 1.5 లక్షల కంటే తక్కువ వార్షిక ఆదాయంతో




ప్రభుత్వ యంత్రాంగం ఆర్భాటంగా విడుదల చేసిన ఈ అంకెలు, క్షేత్రస్థాయి వాస్తవాలకు అద్దం పడుతున్నాయా? లేక పాలకుల రాజకీయ అవసరాలకు అనుగుణంగా వంచించబడ్డాయా? అనే ప్రశ్న ఇప్పుడు తెలంగాణ సమా జాన్ని వేధిస్తోంది. సంక్షేమ పథకాల రూప కల్పనలో శాస్త్రీ యతను నింపాల్సిన ఈ డేటా, పారదర్శకత లోపించడం వల్ల సామాజిక న్యాయం అనే లక్ష్యాన్ని చేరుకోలేక ఒక 'మరీచిక'లా మిగిలిపోయే ప్రమాదం కనిపిస్తోంది. సమగ్ర కుటుంబ సర్వే అనుభవాల నుంచి పాఠాలు నేర్చుకోకుండా, లోపభూయిష్టమైన పద్ధతులతో జరిపిన ఈ గణన.. అట్ట డుగు వర్గాల సాధికారతకు బాటలు వేస్తుందా? లేక ఎన్నికల వ్యూహాల్లో భాగంగా సామాజిక ముసుగులో జరుగుతున్న మరో రాజకీయ క్రీడ మాత్రమేనా? అన్న అంశంపై లోతైన విశ్లేషణ అత్యవసరం.

జీవిస్తున్నాయి. రాష్ట్రంలోని టాప్ 5% అత్యంత సంపన్న కుటుంబాలలో 70% కంటే ఎక్కువ మంది అగ్రవర్ణాలకు చెందిన వారే ఉన్నారు. నిరుద్యోగితా రేటు బీసీ (ముస్లిం) మరియు ఎస్సీ వర్గాల్లో ఎక్కువగా ఉండగా, వీరిలో దాదాపు 40% మంది అసంఘటిత రంగంలో కూలీలుగా పనిచేస్తున్నారు. ఈ గణాంకాలు రాష్ట్రంలో ఆదాయ అసమానతలు ఏ స్థాయిలో ఉన్నాయో స్పష్టం చేస్తున్నాయి.

### భూ సంస్కరణలకు తెలంగాణలో పాతర!

భూ యాజమాన్య గణాంకాలు మరింత దిగ్భ్రాంతికరమైన వాస్తవాలను బయటపెడుతున్నాయి. జనాభాలో కేవలం 15-16% ఉన్న అగ్రవర్ణాల చేతుల్లో రాష్ట్రంలోని దాదాపు మూడో వంతు (33%) భూమి ఉంది. మరోవైపు, 56% ఉన్న బీసీలకు 45-48% భూమి, 17% ఉన్న ఎస్సీలకు 11-12% భూమి, మరియు 10% ఉన్న ఎస్టీలకు కేవలం 8-9% భూమి మాత్రమే ఉంది. ఇది 'భూమి ఉన్నవాడిదే అధికారం' అనే సూత్రం ఇంకా అమల్లో ఉందని నిరూపిస్తోంది. రాజకీయ, ఆర్థిక అధికారం ఇంకా కొన్ని వర్గాల చేతుల్లోనే కేంద్రీకృతమై ఉందనే వాదనకు ఈ గణాంకాలు బలం చేకూరుస్తున్నాయి.

అంతేకాదు, బీసీ, ఎస్సీ వర్గాలకు ఉన్న భూమిలో అత్యధిక శాతం 1 ఎకరం లోపు ఉన్న సన్నకారు రైతులే. రైతుబంధు, రైతు భరోసా వంటి పథకాల ద్వారా వచ్చే నిధులలో దాదాపు 60% ఎక్కువ భూమి ఉన్న అగ్రవర్ణాలకే చేరుతోందని సర్వే తేలింది. భూమి లేని బీసీ, ఎస్సీ వర్గాల్లో అత్యధికులు కౌలు రైతులుగా మారుతున్నారు. వీరికి ఎటువంటి ప్రభుత్వ భరోసా అందడం లేదు. దళిత కుటుంబాలలో దాదాపు 60% నుండి 70% మందికి సెంటు భూమి కూడా లేకపోవడం గతంలో ఇచ్చిన 'మూడు ఎకరాల భూమి' హామీ అమలు కాకపోవడం వల్లనే అనే విమర్శ బలంగా వినిపిస్తోంది. ఎస్టీల భూ యాజమాన్యం తక్కువగా ఉండటం, వేల ఎకరాల పోడు భూములకు పట్టాలు ఇవ్వకుండా ప్రభుత్వం చేస్తున్న కాలయాపన గిరిజన హక్కులను కాలరాస్తున్నట్లే.

### బడ్జెట్ కేటాయింపుల్లో వ్యత్యాసాలు:

ప్రభుత్వ బడ్జెట్ కేటాయింపులు జనాభా నిష్పత్తికి అనుగుణంగా లేవనేది ఈ నివేదిక బట్టబయలు చేసింది. 56% జనాభా కలిగిన బీసీ వర్గాలకు బడ్జెట్లో కేవలం సుమారు 15-20% నిధులు మాత్రమే కేటాయిస్తున్నారు, అందులోనూ 60% కూడా ఖర్చు కావడం లేదు. ఇది రాజకీయ టోకెనిజం కాక మరేమిటి? ఎస్సీ, ఎస్టీ సబ్ ప్లాన్ నిధులను ప్రభుత్వం ఇతర సాధారణ పథకాలకు (ఉదాహరణకు రోడ్ల నిర్మాణం, విద్యుత్ బకాయిలు) మళ్లించడం వల్ల ఆయా సామాజిక వర్గాల వ్యక్తిగత ఆర్థికాభివృద్ధి కుంటుపడు తోంది. కేటాయింపులు భారీగా చూపించి, చివరకు నిధులను 'నిరుపయోగం' చేయడం లేదా దారి మళ్లించడం దళితులను, వెనుకబడిన వర్గాలను మోసం చేయడమే. తెలంగాణ సమగ్ర సర్వే ఫలితాల నేపథ్యంలో ఉత్పన్నమవుతున్న ప్రధాన అభ్యంతరా లను, సందేహాలను మరింత లోతుగా, విశ్లేషణాత్మక వాక్య రూపంలో ఇక్కడ పొందుపరిచాను:

### విధానపరమైన లోపాలు - సామాజిక అసమానతలు:

రాష్ట్రవ్యాప్తంగా జరిగిన ఈ సర్వేలో సుమారు 45 లక్షల మంది జనాభా వివరాలు నమోదు కాకపోవడం గణాంక శాస్త్రపరంగా తీవ్రమైన లోపంగా కనిపిస్తోంది. ముఖ్యంగా పట్టణ ప్రాంతాల్లో గణన ప్రక్రియ పూర్తిస్థాయిలో సాగలేదని, దీనివల్ల రాష్ట్ర అసలు జనాభా సంఖ్యపై తప్పుడు సంకేతాలు వెళ్లే ప్రమాదం ఉందని నిపుణులు భావిస్తున్నారు. ఈ భారీ వ్యత్యాసం ప్రణాళికా రచనపై ఎలాంటి ప్రభావం చూపుతుందో ప్రభుత్వం వివరణ చాల్సిన అవసరం ఉంది.

వెనుకబడిన తరగతుల లెక్కలను ప్రకటించేటప్పుడు ముస్లిం బీసీలను, హిందూ బీసీలతో కలిపి ఒకే కేటగిరీగా చూపడం వల్ల గణాంకపరమైన అస్పష్టత నెలకొంది. దీనివల్ల హిందూ బీసీల వాస్తవ జనాభా నిష్పత్తి తగ్గిపోయే అవకాశం ఉందని, ఇది భవిష్యత్తులో వారి రాజకీయ, విద్యా అవకాశా లను దెబ్బతీస్తుందనే సందేహాలు వ్యక్తమవుతున్నాయి. కావున, మతపరమైన విభజనతో కూడిన స్పష్టమైన బీసీ గణాంకాలను వెల్లడించాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉంది.

రాష్ట్రంలో భూమి కేంద్రీకరణ కొన్ని వర్గాల చేతుల్లోనే ఉందనే విషయం సర్వే ద్వారా స్పష్టమవుతున్నా, ప్రభుత్వం భూ సంస్కరణలపై మౌనం వహించడం గమనార్హం. 'భూ గరిష్ట పరిమితి చట్టాన్ని' ప్రస్తుత పరిస్థితులకు అనుగుణంగా కఠినంగా అమలు చేసి, భూమి లేని పేదలకు భూ పంపిణీ చేసే విషయంలో ప్రభుత్వ కార్యాచరణ ఏమిటో స్పష్టం చేయాల్సి ఉంది.

ప్రస్తుత రైతు భరోసా నిధులు సాగులో లేని భూములకు, సంపన్న వర్గాలకు కూడా అందుతున్నాయనే విమర్శలు ఉన్నాయి. ప్రభుత్వం తాజాగా అందుబాటులోకి తెచ్చిన కులపరమైన జనాభా లెక్కలు కూడా ఇదే విషయాన్ని స్పష్టం చేస్తున్నాయి. ఈ నేపథ్యంలో, భూమి ఎక్కువగా ఉన్న భూస్వాములకు కాకుండా, కేవలం సన్నకారు, చిన్నకారు రైతులకు మాత్రమే అదనపు ప్రోత్సాహకాలు అందేలా నిబంధనలను సవరించడంలో జరుగుతున్న ఆలస్యంపై రైతు వర్గాల్లో అసంతృప్తి నెలకొంది.

వ్యవసాయ రంగంలో కీలకపాత్ర పోషిస్తున్న కౌలు రైతులను గుర్తించి, వారికి ప్రభుత్వ ఫలాలను అందించే వ్యవస్థ ఇంకా రూపుదాల్చలేదు. అదేవిధంగా, దశాబ్దాలుగా నలుగుతున్న పోడు భూముల సమస్యకు శాశ్వత పరిష్కారం చూపి, గిరిజనులకు పూర్తిస్థాయిలో హక్కులు కల్పించే విషయంలో ప్రభుత్వం స్పష్టమైన కాలపరిమితిని ప్రకటించకపోవడం గమనార్హం.

రాష్ట్ర జనాభాలో 56 శాతంగా ఉన్న బీసీలకు బడ్జెట్లో అదే నిష్పత్తిలో నిధులు కేటాయించకపోవడం ఆర్థిక వివక్షగా పరిగణించవచ్చు. బీసీల అభివృద్ధికి 'జనాభా ప్రాతిపదికన బడ్జెట్' కేటాయించడంతో పాటు, ఎస్సీ, ఎస్టీ సబ్ ప్లాన్ నిధులను ఇతర అవసరాలకు మళ్లించకుండా కఠినమైన చట్టపరమైన నిబంధనలను తీసుకురావాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

### సామాజిక న్యాయానికి అసలైన పరీక్ష

సర్వేలో సుమారు 14 లక్షల మంది తమకు కులం లేదని పేర్కొనడం విశేషం. అయితే, వీరిని అభివృద్ధి చెందిన వర్గంగా పరిగణించి, భవిష్యత్తులో వీరికి అందే సంక్షేమ పథకాల్లో కోత విధించేందుకు ప్రభుత్వం ఈ గణాంకాలను సాకుగా వాడుకునే అవకాశం ఉందనే భయాందోళనలు ప్రజల్లో వ్యక్తమవుతున్నాయి. దీనిపై ప్రభుత్వం ఒక స్పష్టమైన విధాన ప్రకటన చేయాల్సి ఉంది. కుల గణన అనేది కేవలం ఒక ఎన్నికల వాగ్దానాన్ని నెరవేర్చుకునే యాంత్రిక ప్రక్రియ కాకూడదు; అది తరతరాల సామాజిక అన్యాయాన్ని సరిదిద్దే ఒక చారిత్రక పరిహారం కావాలి. కేవలం 'అంకెలను' అచ్చు వేయడం వల్ల ఆకలి తీరదు, అసమానతలు తొలగిపోవు. సమాజంలోని నిమ్న వర్గాల ఆర్థిక స్థితిగతులను ప్రపంచానికి చాటినప్పుడు, ఆ గణాంకాలకు తగినట్లుగా వనరుల పునఃపంపిణీ జరగడమే నిజమైన ప్రజాస్వామ్య లక్షణం. "ఎవరి వాటా వారికే" అన్న నినాదం కాగితాలకే పరిమితం కాకుండా, బడ్జెట్ కేటాయింపుల్లో 'బి.సి. సబ్-ప్లాన్' వంటి చట్టబద్ధమైన యంత్రాంగాల ద్వారా ప్రతి రూపాయి ఆయా వర్గాల అభివృద్ధికి ప్రతిబింబంగా మారాలి.

ముఖ్యంగా, తెలంగాణలో సామాజిక గౌరవానికి మూలమైన 'భూమి' పంపిణీలో నెలకొన్న భారీ వ్యత్యాసాలను ప్రభుత్వం సాహసోపేతంగా అధిగమించాలి. భూమి లేని నిరుపేదలకు భూమిని పంచే రాజకీయ సంకల్పం చూపాలి లేదా కనీసం వారి బ్రతుకులకు భరోసానిచ్చే ప్రత్యామ్నాయ పారిశ్రామిక, ఉపాధి మార్గాలను శాశ్వత ప్రాతిపదికన నిర్మించాలి. అభివృద్ధి అంటే కొన్ని వర్గాల ఎదుగుదల కాదు, అట్టడుగున ఉన్న ఆఖరి వ్యక్తికి కూడా రాజ్యాంగ ఫలాలు అందడం.

### ప్రభుత్వం గుర్తుంచుకోవాల్సిన విషయం ఒక్కటే:

ఈ గణన నివేదిక ఒక ముగింపు కాదు, ఇది సామాజిక పునర్నిర్మాణానికి ఒక ఆరంభం మాత్రమే. ఈ సమాచారాన్ని సాకుగా చూపి సంక్షేమ పథకాలకు కోతలు విధిస్తే అది ప్రజాస్వామ్య వంచన అవుతుంది. అలా కాకుండా, అట్టడుగు వర్గాల సాధికారతకు ఒక 'రోడ్ మ్యాప్'ను సిద్ధం చేసి, కార్యాచరణకు పూనుకున్నప్పుడే ఈ సర్వేకు సార్థకత చేకూరుతుంది. లేనిపక్షంలో, ఈ భారీ కసరత్తు చరిత్రలో మరో విఫల ప్రయోగంగా, సామాజిక న్యాయం అనేది ఒక నిరర్థక నినాదంగా మిగిలిపోయే ప్రమాదం ఉంది. పాలకుల చిత్తశుద్ధికి, వారి సామాజిక నిబద్ధతకు ఈ సర్వే ఫలితాల అమలు ఇప్పుడు ఒక గీటురాయి.

–పిట్టల రవీందర్




# ప్రజావాణి దరఖాస్తులపై నిర్లక్ష్యం వద్దు

## కలెక్టర్ చిత్ర మిశ్రా

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

కరీంనగర్, ఏప్రిల్ 17 : ప్రజావాణిలో స్వీకరించిన దరఖాస్తుల స్థితిపై కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాల్లో శుక్రవారం కలెక్టర్ చిత్రమిశ్రా, స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ అశ్విని తానాజీ వాకడే, ఆయా శాఖల అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మున్సిపాలిటీ, రెవెన్యూ, సంక్షేమ శాఖ, నీటిపారుదల శాఖ, విద్యుత్, వెటర్నరీ, పంచాయతీ తదితర శాఖల వద్ద పెండింగ్ లో ఉన్న దరఖాస్తుల వివరాలను అడిగి తెలుసుకున్నారు. పెండింగ్ దరఖాస్తులపై నిర్లక్ష్యం వహించొద్దని సూచించారు. సెక్షన్ల వారీగా దరఖాస్తులను విభజించి పరిష్కరించాలని పేర్కొన్నారు. తరచుగా ఫిర్యాదులు వచ్చే సమస్యలపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. అవసరమైతే క్షేత్రస్థాయి తనిఖీ చేసి సమస్య పరిష్కారానికి కృషి చేయాలని అధికారులను ఆదేశించారు. ఎప్పటికప్పుడు పరిష్కరించిన దరఖాస్తుల వివరాలను ఆన్ లైన్లో అప్లోడ్ చేయాలని పేర్కొన్నారు. ఈ సమావేశంలో జిల్లా పంచాయతీ అధికారి జగదీశ్వర్, జిల్లా సంక్షేమ అధికారి సరస్వతి, జెడ్పి సీఈఓ శ్రీనివాస్, విద్యుత్, నీటిపారుదల శాఖ, మున్సిపల్, విద్యుత్ తదితర శాఖల అధికారులు పాల్గొన్నారు



# రోడ్డు భద్రతపై అవగాహన కార్యక్రమం

## హెల్త్ క్యాంప్ పరిశీలన

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

కరీంనగర్, ఏప్రిల్ 17 : ప్రజా పాలన–ప్రగతి ప్రణాళికలో భాగంగా స్థానిక పరేడ్ గ్రౌండ్లో నిర్వహించిన రోడ్డు భద్రత అవగాహన కార్యక్రమాన్ని డిజిపి శివధర్ రెడ్డి, కలెక్టర్ చిత్రా మిశ్రా, కరీంనగర్ పోలీస్ కమీషనర్ గౌస్ ఆలం, అడిషనల్ కలెక్టర్ అశ్విని తానాజీ వాకడే, జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ వెంకటరమణ, తదితర ఉన్నతాధికారులు సందర్శించారు. ఈ సందర్భంగా అక్కడ ఏర్పాటు చేసిన హెల్త్ క్యాంపును పరిశీలించి, ప్రజలకు అందిస్తున్న వైద్య సేవలపై సమీక్ష నిర్వహించారు. క్యాంపులో సాధారణ ఆరోగ్య పరీక్షలతో పాటు రక్తపోటు, షుగర్ పరీక్షలు నిర్వహిస్తూ, ప్రజలకు ఆరోగ్య పరిరక్షణపై అవసరమైన సూచనలు అందించారు. ముఖ్యంగా రోడ్డు ప్రమాదాల నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ప్రజల్లో అవగాహన పెంచాల్సిన అవసరాన్ని స్పష్టం చేశారు. ట్రాఫిక్ నియమాలను పాటించడం ద్వారా ప్రమాదాలను గణనీయంగా తగ్గించ వచ్చని తెలిపారు. ఈ సందర్భంగా డాక్టర్ వెంకటరమణ మాట్లాడుతూ రోడ్డు భద్రత ప్రతి ఒక్కరి బాధ్యతని, ట్రాఫిక్ నిబంధనలు కచ్చితంగా పాటిస్తే ప్రమాదాలను నివారించ వచ్చన్నారు. అలాగే ప్రమాదాల సమయంలో ప్రథమ చికిత్సపై ప్రజలకు అవగాహన ఉండటం అత్యంత అవసరమని పేర్కొన్నారు. ఇంకా ఈ కార్యక్రమంలో డిప్యూటీ డిఎంహెచ్ఓ డాక్టర్ రాజగోపాల్, వైద్య సిబ్బంది, ఆరోగ్య శాఖ అధికారులు పాల్గొని ప్రజలకు వైద్య సేవలు అందించారు.



# కేసీఆర్ బహిరంగ సభ స్టేజి ఏర్పాట్లను పరిశీలించిన బిఆర్ఎస్ నేతలు

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

జగిత్యాల, ఏప్రిల్ 17 : జగిత్యాల మినీ స్టేడియంలో ఈ నెల 20వ తేదీన నిర్వహించనున్న మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ బహిరంగ సభ స్టేజి ఏర్పాట్లను బీఆర్ఎస్ పార్టీ నేతలు శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా సభ ప్రాంగణంలో జరుగుతున్న ఏర్పాట్లు, వేదిక నిర్మాణం, పార్కింగ్, భద్రతా చర్యలు, ప్రజలకు అవసరమైన సౌకర్యాలపై సమీక్ష నిర్వహించారు. ఈ పరిశీలనలో జగిత్యాల జిల్లా బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు కల్వకుంట్ల విద్యాసాగర్ రావు, మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్, బాల్కొండ ఎమ్మెల్యే వేముల ప్రశాంత్ రెడ్డి, జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్ రెడ్డి, ఎంఎల్సీ రమణ, మాజీ మార్కెట్ చైర్మన్ లోక బాబు రెడ్డి, దావ వసంత సురేష్ తదితరులు పాల్గొన్నారు. సభను అత్యంత విజయవంతంగా నిర్వహించేందుకు ప్రతి ఒక్కరూ సమన్వయంతో పనిచేయాలని నాయకులు పిలుపునిచ్చారు. అలాగే భారీగా ప్రజలు హాజరుకానున్న నేపథ్యంలో ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అన్ని విభాగాలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. సభ విజయానికి కార్యకర్తలు కృషి చేయాలని కోరారు.

# జిడికె ఓసిపీ 5 లో అరైవ్ -అలైవ్ సదస్సు

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)



కోల్ సిటి (గోదావరిఖని), ఏప్రిల్ 17 : రోడ్డు భద్రతా వారోత్సవాలలో భాగంగా రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల ప్రకారం నిర్వహిస్తున్న అరైవ్ – అలైవ్ అవగాహన సదస్సులో భాగంగా శుక్రవారం ఉదయం 8.00 గంటలకు ఓసిపి–5 గని ప్రాజెక్ట్ ఆఫీసర్ డి.రమేష్ జెండా ఊపి బైక్ ర్యాలీ ప్రారంభించారు. కార్మికులందరూ హెల్మెట్లు ధరించి ద్విచక్ర వాహనాలపై ర్యాలీగా వెళ్లి రోడ్డు భద్రతలో హెల్మెట్ ప్రాముఖ్యతను వివరించారు .ఆ తర్వాత ఉదయం 10 గంటలకు పీసీ పటేల్ ఓబి రిమూవల్ కాంట్రాక్ట్ క్యాంప్ ఆఫీసులో కాంట్రాక్ట్ డ్రైవర్లు అందరికీ కూడా రామగుండం మోటార్ వెహికల్ ఇన్స్ పెక్టర్ సంతోష్ రెడ్డి ఆధ్వర్యంలో కంటి పరీక్షలు ప్రారంభించడం జరిగింది. ఈ సందర్భంగా మోటార్ వెహికల్ ఇన్స్ పెక్టర్ సంతోష్ రెడ్డి మాట్లాడుతూ భారీ యంత్రాలు నడిపే ఆపరేటర్లకు డ్రైవర్లకు కంటి చూపు సరిగ్గా ఉండటం వల్ల ప్రమాదాలను చాలా వరకు నివారించవచ్చు అని పేర్కొన్నారు. డ్రైవర్లకు రహదారి భద్రత, కంటి చూపు ప్రాముఖ్యతను వివరించారు. ఈ సందర్భంగా ఐ రిఫ్రాక్షన్ స్పెషలిస్ట్ కె.విజయ కుమారి షావల్, గ్రేడర్, డోజర్, లోడర్, వాల్వో ఆపరేటర్లకు మోటార్ వెహికల్ డ్రైవర్లకు క్షుణ్ణంగా కంటి పరీక్షలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సాయి ప్రసాద్ ఏరియా సేఫ్టీ ఆఫీసర్, పొనుగోటి శ్రీనివాస్ ఓసి–5 సేఫ్టీ ఆఫీసర్, వీరారెడ్డి ఏరియా సెక్యూరిటీ ఆఫీసర్, దాసరి నాగరాజు సంక్షేమ అధికారి, గౌరవ్ పటేల్ పి.సి. పటేల్ మేనేజర్, పెద్దపల్లి రవి, చంద శ్రీనివాస్ జూనియర్ ఇన్స్ పెక్టర్ పి.సి.పటేల్ డ్రైవర్స్ తదితరులు పాల్గొన్నారు.





# రోడ్డు భద్రత-సామాజిక బాధ్యత



### - ప్రతి ప్రాణం విలువైందే - 'అరైవ్-అలైవ్' లక్ష్యంగా ముందుకు సాగాలి

### - తెలంగాణ రాష్ట్ర డీజీపీ శివధర్ రెడ్డి

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

కరీంనగర్, ఏప్రిల్ 17 : వాహనంపై ప్రయాణించే ప్రతి ఒక్కరూ క్షేమంగా తమ ఇళ్లకు చేరుకోవాలనే ప్రధాన ఉద్దేశంతో రాష్ట్ర ప్రభుత్వం, పోలీస్, రవాణా శాఖల సమన్వయంతో 'అరైవ్–అలైవ్' కార్యక్రమాన్ని ఒక సామాజిక ఉద్యమంగా చేపట్టిందని తెలంగాణ రాష్ట్ర డీజీపీ బి.శివధర్ రెడ్డి తెలిపారు. రాష్ట్రంలో శాంతిభద్రతల సమస్య కంటే రోడ్డు ప్రమాదాలే అతిపెద్ద సవాలుగా మారాయని ఆవేదన వ్యక్తం చేశారు. గత ఏడాది రాష్ట్రంలో హత్యల వల్ల 800 మంది ప్రాణాలు కోల్పోగా, రోడ్డు ప్రమాదాల వల్ల ఏకంగా 7500 మంది మృతి చెందడం పరిస్థితి తీవ్రతకు అద్దం పడుతోందని పేర్కొన్నారు. ఈ సందర్భంగా డీజీపీ ప్రసంగిస్తూ రోడ్డు భద్రత అనేది కేవలం పోలీస్, రవాణా శాఖల బాధ్యత మాత్రమే కాదని, వార్డు మెంబర్ నుండి ముఖ్యమంత్రి వరకు అందరూ ఇందులో భాగస్వాములు కావాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆదేశించారని తెలిపారు. అందుకే మొదటిసారిగా పోలీస్ శాఖ కార్యక్రమాన్ని 'ప్రజాపాలన–ప్రగతి ప్రణాళిక'లో చేర్చడం జరిగిందన్నారు. జిల్లాలో జరుగుతున్న ప్రమాదాల్లో 70 శాతం మరణాలు ద్విచక్ర వాహనదారులవే ఉంటున్నాయన్నారు. బైక్ నడిపే వారితో పాటు వెనుక కూర్చున్న వారు కూడా నాణ్యమైన హెల్మెట్ ధరించాలని, తప్పనిసరిగా రేత్తీఖు పెట్టుకోవాలని సూచించారు. స్ట్రాప్ లేకపోతే ప్రమాద సమయంలో హెల్మెట్ ఎగిరిపోయి ప్రాణాపాయం సంభవిస్తుందని హెచ్చరించారు. హెల్మెట్ పెట్టుకుంటే వెంట్రుకలు ఊడిపోతాయనేది కేవలం అపోహ మాత్రమేనని, జుట్టు ఊడిపోవడానికి హెల్మెట్కు సంబంధం లేదని, తన వ్యక్తిగత ఉదాహరణతో వివరిస్తూ నవ్వులు పూయించారు. హెల్మెట్ ధరించడం అనేది ప్యాంటుకు బెల్టు పెట్టుకున్నంత సహజంగా అలవరచుకోవాలని కోరారు. ఫోర్ వీలర్ వాహనాల్లో ప్రయాణించే అందరూ సీట్ బెల్ట్ ధరించాలన్నారు. సీట్ బెల్ట్ పెట్టుకుంటేనే ప్రమాద సమయంలో ఎయిర్ బ్యాగులు తెరుచుకుంటాయని, ప్రయాణీకులు వాహనం వెలుపల పడకుండా రక్షణ లభిస్తుందని వివరించారు. మద్యం సేవించి వాహనం నడపడం, రాంగ్ రూట్లో ప్రయాణించడం, ఓవర్ కాన్ఫిడెన్స్తో డ్రైవింగ్ చేయడం వంటి కారణాల వల్ల ఎన్నో కుటుంబాలు పెద్ద దిక్కును కోల్పోయి వీధినపడుతున్నాయని ఉదాహరణలతో వివరించారు. వాహనదారులు ఎల్లప్పుడూ పరిసరాలను గమనిస్తూ 'డిఫెన్సివ్ డ్రైవింగ్' చేయాలని, ముఖ్యంగా స్కూళ్లు, గ్రామాల జంక్షన్ల వద్ద వేగాన్ని తగ్గించాలని సూచించారు. పాదచారులకు ప్రథమ ప్రాధాన్యత ఇవ్వాలని, వారు ఎల్లప్పుడూ వాహనాలు వచ్చే ఎదురు దిశలో నడవాలని తెలిపారు. చివరగా మైనర్లకు వాహనాలు ఇచ్చి వారి ప్రాణాలతో చెలగాటం ఆడవద్దని తల్లిదండ్రులకు విజ్ఞప్తి చేశారు. లైసెన్స్ వచ్చిన తర్వాతే పిల్లలకు వాహనాలు ఇవ్వాలని, విద్యార్థులు కూడా బైకుల కోసం తల్లిదండ్రులపై ఒత్తిడి తేవద్దని కోరారు. 'అరైవ్–అలైవ్' సందేశాన్ని గ్రామ గ్రామానికి తీసుకువెళ్లి రోడ్డు ప్రమాద రహిత తెలంగాణను నిర్మిద్దామని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో అరైవ్ – అలైవ్ కి సంబందించిన స్కై బెలూన్, పోస్టర్, అరైవ్ – అలైవ్ పాట సీడీని డీజీపీ ఆవిష్కరించారు. హెల్మెట్లు పంపిణి చేసారు. కరీంనగర్ పోలీసుల తరుపున ఏర్పాటు చేసిన వివిధ స్టాళ్లను సందర్శించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న వారందరితో రోడ్డు భద్రత ప్రతిజ్ఞ చేయించారు. జిల్లా కలెక్టర్ చిత్రా మిశ్రా మాట్లాడుతూ 99 రోజుల ప్రజా పాలనా – ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో అరైవ్ – అలైవ్ కార్యక్రమం రాష్ట్ర వ్యాప్తంగా చాలా విజయ వంతంగా కొనసాగుతుందన్నారు. ప్రభుత్వం అందిస్తున్న రహవీర్, రోడ్డు ప్రమాద బాధితులకు ఉచిత వైద్యం, హిట్ అండ్ రన్ కేసుల్లో ఆర్థిక సహాయం అందించే కార్యక్రమాలు ప్రజల్లో అవగాహనా కల్పించే అవసరముందన్నారు. అందుకుగాను మండల స్థాయిల్లో మరింత బలోపేతంగా ఈ కార్యక్రమాన్ని ముందుకు తీసుకెళ్తామన్నారు. కరీంనగర్ సీపీ గౌస్ ఆలం మాట్లాడుతూ అరైవ్ – అలైవ్ కార్యక్రమం అనేది తెలంగాణ రాష్ట్ర డీజీపీ బి.శివధర్ రెడ్డి మానసపుత్రిక అన్నారు. గత డిసెంబర్ నెలలో ప్రారంభమైన ఈ కార్యక్రమం జనవరి, ఫిబ్రవరి, మార్చి నెలలో మూడు దశల్లో విజయవంతంగా అవగాహనా కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. కేవలం కరీంనగర్ లో ఇప్పటివరకు 600 వరకు అవగాహనా కార్యక్రమాలు నిర్వహించామన్నారు. అన్ని రకాల వాహన డ్రైవర్లకు ఉచిత కంటి పరీక్షలు, సీపీఆర్, ఫస్ట్ ఎయిడ్ డ్రిల్ పై శిక్షణ అందించామన్నారు. అధికంగా రోడ్డు ప్రమాదాలు జరిగే ప్రాంతాలను హాట్ స్పాట్ లుగా గుర్తించి ఇతర శాఖల సమన్వయంతో ముందస్తు నివారణ చర్యలు చేపట్టామన్నారు. గత సంవత్సరంతో పోలిస్తే ఈ మూడు నెలల్లో 16 శాతం రోడ్డు ప్రమాద మరణాలు తగ్గించగలిగామన్నారు. మరింత శ్రమించి ప్రజల్లో చైతన్యం కలిగేలా కృషి చేస్తామన్నారు. ఇంకా ఈ కార్యక్రమంలో అడిషనల్ కలెక్టర్ అశ్విని తానాజీ వాకడే, డిఎంహెచ్ఓ వెంకటరమణ, ఎంవిఐ చక్రవర్తి, ట్రైనీ ఐపీఎస్ సోహం సునీల్, అడిషనల్ డీసీపీ వెంకటరమణతో పాటు ఇతర అధికారులు, విద్యార్థులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

# హిందూ సమ్మేళనం సభను విజయవంతం చేద్దాం

## ఏర్పాట్లు పూర్తి చేసిన ఉత్సవ సమితి

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

ములుగు ఏప్రిల్ 17 : ములుగులో హిందూ సమ్మేళనం సభ విజయవంతం చేద్దామని, సభ ఏర్పాట్లు పూర్తి చేసినట్లు ఉత్సవ సమితి అధ్యక్షుడు గంద్రకోట కుమార్ తెలిపారు. సభ్యులతో కలిసి ఈనెల 18న ములుగులోని మంజునాథ పురం (రావణవధ ఉత్సవ స్థలం) ఆవరణలో జరుగనున్న సభా ప్రాంగణాన్ని శుక్రవారం సాయంత్రం పరిశీలించారు. ఈ సందర్భంగా కుమార్ మాట్లాడుతూ ములుగులో జరిగే హిందూ సమ్మేళన కార్యక్రమానికి శ్రీ భువనేశ్వరి దేవి పీఠాధిపతులు శ్రీశ్రీశ్రీ కమలానంద భారతి స్వామీజీ,ధర్మజాగరణ అఖిల భారత సహ సంయోజక్ ఏలె శ్యాంకుమార్ జీ హాజరుకానున్నట్లు పేర్కొన్నారు. ఇప్పటికే ములుగు మున్సిపాలిటీ పరిధిలోని 20 వార్డులు, మండలంలోని వివిధ గ్రామాల్లో జాగరణ చేపట్టామని వెల్లడించారు. వేలాది సంఖ్యలో సభకు తరలిరానున్నారని అన్నారు. కుటుంబ సభ్యులతో కలిసి పాల్గొనాలని, ఇంటింటికీ పంపిణీ చేసిన నవధాన్యాలను తీసుకువచ్చి యాగంలో సమర్పించాలని సూచించారు. సమ్మేళనానికి హాజరయ్యే ప్రజలకు వివిధ గ్రామాల నుంచి ప్రత్యేక వాహనాలు ఏర్పాటు చేసినట్లు వెల్లడించారు. బిట్స్ స్కూల్ గ్రౌండ్లో బైక్లకు సాధన స్కూల్ వెనుక భాగంలో పార్కింగ్ సౌకర్యం ఏర్పాటు చేశామని, సుమారు పది వేల మందికి సరిపడే విధంగా సభాప్రాంగణంలో అన్ని వసతులు కల్పించామని తెలిపారు. సాయంత్రం



4గంటలకు ప్రారంభమయ్యే హిందూ సమ్మేళనం కార్యక్రమంలో భాగస్వాములై సభను విజయవంతం చేసేందుకు అధిక సంఖ్యలో తరలిరావాలని కుమార్ పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఉత్సవ కమిటీ సభ్యులు కర్ర రాజేందర్ రెడ్డి, వాంకుడోతు జ్యోతి,దిడ్డి రాజ్ కుమార్, చింతలపూడి భాస్కర్ రెడ్డి, సిరికొండ బలరాం,దొంతి రెడ్డి వాసుదేవ రెడ్డి, బాణాల సుధాకర్, ఇమ్మడి రాకేష్ యాదవ్, ప్రకాష్, కొత్తపల్లి బాబురావు,గొల్ల కుమార్ కొత్తపల్లి పోషన్న,కంది జీవన్ రెడ్డి, సభావట్ రమేష్, డాక్టర్ సకినాల జీవన్ చంద్రం,మేకుల సంపత్,గొర్రెకుంట అయిలు మల్లు,దాసు రాములు, గొల్ల కుమార్, వేములపల్లి రాజు, పాలకుర్తి తిరుపతి, పులి ప్రకాష్, జక్కుల వేణు, మేడుదుల మమన్?, జక్కుల వేణు తొడుపునూరి కిషోర్, తదితరులు పాల్గొన్నారు.




# రబి-యాసంగి ధాన్యం కొనుగోలు ప్రక్రియను సజావుగా నిర్వహించాలి

## అదనపు కలెక్టర్ మాధురి

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

సంగారెడ్డి, ఏప్రిల్ 17 : జిల్లాలో రబి–యాసంగి సీజన్ ధాన్యం కొనుగోలు ప్రక్రియను ఎటువంటి ఆటంకాలు లేకుండా సజావుగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేయాలని అదనపు కలెక్టర్ (రెవెన్యూ) మాధురి అధికారులను ఆదేశించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో 2025–26 రబీ సీజన్లో మొత్తం 2.20 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం మార్కెట్కు వచ్చే అవకాశం ఉందని అంచనా వేసినట్లు తెలిపారు. ఇందులో దొడ్డురకం ధాన్యం 2 లక్షల మెట్రిక్ టన్నులు, సన్నరకం ధాన్యం 20 వేల మెట్రిక్ టన్నులు ఉండనున్నాయని వివరించారు. రైతులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా ముందస్తు ఏర్పాట్లు పూర్తి చేయాలని సూచించారు. ప్రభుత్వం ప్రకటించిన కనీస మద్దతు ధర ప్రకారం గ్రేడ్–ఏ రకం ధాన్యానికి క్వింటాల్కు రూ.2,389, కామన్ రకానికి రూ.2,369 నిర్ణయించినట్లు తెలిపారు. సన్నరకం ధాన్యానికి క్వింటాల్కు రూ.2,389, అదనంగా రూ.500 బోనస్తో రూ.2,889లు, అందించనున్నట్లు తెలిపారు. రైతులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని సూచించారు. జిల్లాలో ధాన్యం కొనుగోళ్ల కోసం మొత్తం 226 కొనుగోలు కేంద్రాలు ప్రతిపాదించినట్లు వెల్లడించారు. వీటిలో ఐకేపీ ఆధ్వర్యంలో 97, ప్యాక్స్ ఆధ్వర్యంలో 97, డీసీఎంఎస్ ఆధ్వర్యంలో 31, ఎఫ్పీవో ఆధ్వర్యంలో ఒక కేంద్రం ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. ప్రతి కేంద్రంలో తార్పాలిన్లు, ఎలక్ట్రానిక్ తూకపు యంత్రాలు, తేమ కొలిచే మీటర్లు వంటి మౌలిక సదుపాయాలు సరిపడా ఉండేలా చూడాలని అధికారు ఆదేశించారు. సెంటర్ నిర్వాహకులు ప్రతిపాదించిన రైస్ మిల్లర్లకు మాత్రమే ధాన్యాన్ని లారీల ద్వారా తరలించాలని, సొంత రవాణా వాహనాలు ఉపయోగించరాదని స్పష్టం చేశారు. గతంలో తలెత్తిన లోటుపాట్లను సరిచేసుకుని ఈసారి పారదర్శకంగా కొనుగోళ్లు నిర్వహించాలని అన్నారు.

కొనుగోలు చేసిన ధాన్యాన్ని వెంటనే మిల్లర్లతో సమన్వయం చేసుకుని మిల్లులకు తరలించేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. వేసవికాలాన్ని దృష్టిలో ఉంచుకుని కొనుగోలు కేంద్రాల్లో రైతులకు తాగునీరు, నీడ సౌకర్యాలు, తేమ పరీక్షలు, గన్ని బ్యాగుల సరఫరా వంటి అన్ని సౌకర్యాలు కల్పించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో పౌరసరఫరాల శాఖ జిల్లా మేనేజర్ అంబాదాస్ రాజేశ్వర్, జిల్లా వ్యవసాయ శాఖ అధికారి శివప్రసాద్, పిడి డిఆర్డిఏ జ్యోతి, జిల్లా సహకార శాఖ కిరణ్ కుమార్, ఏసిఎస్ఓ రాజేశ్వర్, డిపిఎంలు, ఏపీఎంలు, ప్యాక్స్ సెక్రటరీ లు ,వ్యవసాయ అధికారులు, సంబంధిత అధికారులు పాల్గొన్నారు...

# క్యాత్ ల్యాబ్ పురోగతిని పరిశీలించిన.. సిఎంవో డాక్టర్ కిరణ్ రాజ్



(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

కోల్ సిటి (గోదావరిఖని), ఏప్రిల్ 17: అర్జీవన్ జి.ఎం లలిత్ కుమార్ ఆధ్వర్యంలో సీఎంఓ డాక్టర్ కిరణ్ సారథ్యంలో సింగరేణి ఆసుపత్రి క్యాథలాబ్ పురోగతిని శుక్రవారం పర్యవేక్షించారు. ఈ సందర్భంగా ఆయన క్యాథలాబ్ ను అతి త్వరగా పూర్తిచేసి రామగుండం ప్రాంత వాసులకు కార్మికులకు మెరుగైన చికిత్స అందించాలనిసూచించారు . క్యాథ్లాబ్ వల్ల కలిగే ప్రయోజనాలను వివరించారు. క్యాథ్లాబ్ అనేది గుండె సంబంధిత వ్యాధులను నిర్ధారించడానికి, చికిత్స చేయడానికి ఉపయోగించే ఒక అధునాతన విభాగం అని అన్నారు . దీని ద్వారా ప్రధానంగా యాంజియోగ్రామ్ గుండె రక్తనాళాల్లో పూడికలు ఎక్కడ ఉన్నాయో గుర్తించడం., యాంజియోప్లాస్టీ రక్తనాళాల్లోని బ్లాక్స్ తొలగించి స్టెంట్ వేయడం ద్వారా గుండెపోటు ప్రమాదాన్ని తప్పించడం., పేస్మేకర్ గుండె లయ తప్పినప్పుడు పరికరాలను అమర్చడం. తదితర రామగుండం ఏరియా హాస్పిటల్లో దీని ప్రాముఖ్యత ను వివరించారు. గతంలో గుండెపోటు లేదా తీవ్రమైన గుండె సమస్యలు వస్తే, కార్మికులు, స్థానికులు హైదరాబాద్ లేదా ఇతర నగరాలకు వెళ్లాల్సి వచ్చేదన్నారు. ఈ క్రమంలో 'గోల్డెన్ అవర్' (ప్రమాదం జరిగిన మొదటి గంట) వృథా అయ్యేది. ఇప్పుడు స్థానికంగానే చికిత్స అందడం వల్ల ప్రాణాపాయం తగ్గుతుంది. సింగరేణి కార్మికులకు వారిపై ఆధారపడిన వారికి పైసా ఖర్చు లేకుండా కార్పొరేట్ స్థాయి వైద్యం అందుతుంది. అధునాతన యంత్రాలు: ఈ ల్యాబ్లో అత్యుత్తమ నాణ్యత కలిగిన ఇమేజింగ్ మిషన్లను ఏర్పాటు చేస్తున్నారు, తద్వారా ఖచ్చితమైన రిపోర్టులు వస్తాయి. సివిల్ పనులు మరియు మెషినరీ ఇన్స్టాలేషన్ వేగంగా జరుగుతున్నాయి. ఆలాగే నిపుణులైన వైద్యులు: క్యాథ్లాబ్తో పాటు కార్డియాలజిస్టులు (గుండె వైద్య నిపుణులు) మరియు ప్రత్యేక శిక్షణ పొందిన నర్సింగ్ స్టాఫ్ అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకుంటున్నారు. ఈ క్యాథ్లాబ్ అందుబాటులోకి రావడం వల్ల రామగుండం ఏరియా హాస్పిటల్ కేవలం సాధారణ వైద్యానికే కాకుండా, సూపర్ స్పెషాలిటీ సేవల కేంద్రంగా కూడా మారుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎస్ ఓ టు జిఎం చంద్రశేఖర్ డిజిఎం సివిల్ వరప్రసాద్ వర్క్ షాప్ ఇంజనీర్ చంద్రశేఖర్ హాస్పటల్ ఏసీఎంఓ డాక్టర్ బి అంబికా, సీనియర్ సెక్యూరిటీ ఆఫీసర్ వీరారెడ్డి డాక్టర్ రమేష్ రెనీ హాస్పిటల్ చైర్మన్ డాక్టర్ బంగారు స్వామి డైరెక్టర్లు అరవింద్ వైద్య సిబ్బంది క్యాథ్లాబ్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ప్రజాలక్ష్యం




## పీఎం శ్రీ పాఠశాలల పనితీరు మెరుగుపడాలి

### - జిల్లా కలెక్టర్ హరిత

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

ఆసిఫాబాద్, ఏప్రిల్ 17 : జిల్లాలో పీ.ఎం శ్రీ పాఠశాలలో విద్యా బోధన మౌలిక వసతులు విద్యార్థుల సంఖ్య నమోదులో పురోగతి సాధించాలని కలెక్టర్ హరిత అన్నారు. శుక్రవారం సమీకృత కలెక్టరేట్ భవన సముదాయంలోని సమావేశ మందిరంలో పీ.ఎం శ్రీ పాఠశాల మండల విద్యాశాఖ అధికారులు, పాఠశాలల, ప్రధానోపాధ్యాయులతో నిర్వహించిన సమీక్ష సమావేశానికి జిల్లా విద్యాశాఖ అధికారి ఎల్ లలిత తో కలిసి కలెక్టర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వశ్రీ జిల్లాలోని 18 పాఠశాలలను పీఎం శ్రీ కింద ఎంపిక చేసి పాఠశాలలో మౌలిక వసతుల కల్పన విద్యార్థులకు పలు కార్యక్రమాలు నిర్వహించడం విద్యార్థుల నమోదు సంఖ్యను పెంచడం, నాణ్యమైన బోధన అందించడం,పాఠశాలల పని తీరు మెరుగు పరచడం కొరకు నిధులు మంజూరు చేస్తుంద న్నారు. వాటిని సక్రమంగా వినియోగించి పాఠశాలల పనితీరును, విద్యా బోధన, ఉ త్తీర్ణత శాతం, విద్యార్థుల నమోదులో పురోగతి సాధించాలన్నారు. కొన్ని పాఠశాలలలో క్రమంగా విద్యార్థుల సంఖ్య తగ్గిపోవడానికి గల కారణాలపై, , ప్రధానోపాధ్యాయులతో మండల విద్య శాఖ అధికారులను అడిగి తెలుసుకున్నారు.మండల విద్యా శాఖ అధికారులు పిఎం శ్రీ పాటశాలల పని తీరు పై పర్యవేక్షించా లన్నారు. గత రెండు సంవత్సరాల నిధులు, ఖర్చు పెట్టిన వివరా లను రేపటి లోగ అందించాలన్నారు. ఉపాధ్యాయులు సమయపా లన పాటించి పీఎం శ్రీ పాఠశాలల పనితీరులో పురోగతి సాధించాల న్నారు ఈ సమీక్ష సమావేశంలో మండల విద్యాశాఖ అధికారులు, పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, తదితరులు పాల్గొన్నారు.

## పురపాలక సంఘం ఆధ్వర్యంలో చలివేంద్రాలు

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)



మహబూబాబాద్ టౌన్, ఏప్రిల్ 17 : వేసవి కాలం దృష్ట్యా మహబూబాబాద్ పురపాలక సంఘం ఆధ్వర్యంలో పట్టణంలో 4 చోట్ల చలివేంద్రాలను ఏర్పాటు చేయడం జరుగుతుందని, శనివారం ఉదయం 10 గంటలకు ఫారెస్ట్ ఆఫీస్ సెంటర్, కూర గాయల మార్కెట్ (గాంధీపార్కు) వద్ద చలివేంద్రాలను మున్సిపల్ చైర్ పర్సన్, వైస్ చైర్మన్, స్థానిక వార్డు కౌన్సిలర్‌చే ప్రారంభ కార్యక్రమం కలదు,మున్సిపల్ వార్డు కౌన్సిలర్లు అందరు సకాలంలో ఈ కార్యక్రమానికి హాజరు కావాలని కమీషనర్ పురపాలక సంఘం, మహబూబాబాద్ శుక్రవారం సాయంత్రం ఒక ప్రకటన లో కోరారు.



## సిపిఎస్ విధానాన్ని రద్దు చేయాలని తహసిల్దార్‌కు వినతిపత్రం అందజేత

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

టేక్మాల్ ఏప్రిల్ 17 : కాంట్రిబ్యూటరీ పెన్షన్ విధానాన్ని వెంటనే రద్దు చేసి పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించాలని టేక్మాల్ మండల( టీజీఈ జేఏసీ) నేతలు నల్ల బ్యాడ్జీలు ధరించి శుక్రవారం టేక్మాల్ తహసిల్దార్ తులసిరామ్‌కు వినతి పత్రం అందజేశా రు. ఈ సందర్భంగా మండల శాఖ సభ్యులు మాట్లాడుతూ... ఒక ఉద్యోగి 30 సంవత్సరాలు తన జీవన పర్యంతం ప్రభుత్వానికి సేవలు చేసి వృద్ధాప్య దశలో పెన్షన్ లేకపోతే వారి చరమాంకం జీవన్మరణ సమస్యగా మారుతోందని ఆవేదన వ్యక్తం చేశారు.. ఈ సీపీఎస్ పెన్షన్ విధానంలో ఉద్యోగ ఉపాధ్యాయులకు లాభాల కంటే నష్టాలే ఎక్కువగా ఉన్నాయని వాపోయారు. కార్యక్ర మంలో టేక్మాల్ టీజీఈ జేఏసీ మండల శాఖ ఉపాధ్యాయిని, ఉపాధ్యాయులు ఉన్నారు.



## పాఠశాల బస్సు డ్రైవర్లకు సి.పి.ఆర్ పై శిక్షణ

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

మహబూబాబాద్ టౌన్, ఏప్రిల్ 17 : తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక -- 99 రోజుల కార్యక్రమం సందర్భంగా, అరైవ్ అలైవ్ --2026 లో భాగంగా మహబూబాబాద్ జిల్లా కేంద్రంలోని వి ఆర్ ఎన్ గార్డెన్స్‌లో డి.టి.ఓ. జైపాల్ రెడ్డి ఆధ్వర్యంలో జిల్లా పరిధిలోని పాఠశాల బస్సు డ్రైవర్లకు సీపీఆర్ శిక్షణ,కంటి వైద్య శిబిరన్ని శు క్రవారం నిర్వహించరు. ఈ కార్యక్రమానికి మహబూబా బాద్ డి ఎస్ పి తిరుపతి రావు ముఖ్య అతిథిగా హాజరయ్యారు డిఫెన్స్ డ్రైవింగ్ పద్ధతులు, డ్రైవర్ అప్రమత్తత,మొబైల్ ఫోన్ తో డ్రైవింగ్ లో జరిగే ప్రమాదం గురించి అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో 150 మంది పాఠశాల డ్రైవర్లు, సాయిచరణ్ వెంకట్ రెడ్డి,మోటారు వాహన తనిఖీ అధికారులు, పాఠశాల బస్సుల సంఘం అధ్యక్షుడు యకంబ్రం సమన్వయకర్త మల్లారెడ్డి పాల్గొన్నారు.



## తహసిల్దార్ కార్యాలయం ఎదుట ఉద్యోగ సంఘాల నిరసన

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

ఖానాపూర్ ఏప్రిల్ 17 : పెండింగ్‌లో ఉన్న ప్రధాన సమస్య లను వెంటనే పరిష్కరించాలని కోరుతూ భోజన విరమణ సమయం లో ఉ ద్యోగ సంఘాల నాయకులు జేఏసీ ఆధ్వర్యంలో తహసిల్దార్ కార్యాలయం ముందు నిరసన కార్యక్రమం చేపట్టినారు. పిఆర్‌సి కమిషన్ నివేదికను తెప్పించి జూన్ 2లోగా అమలు చేయాలని, పెండింగ్ బిల్లులను వెంటనే విడుదల చేయాలని, ఉద్యోగులకు, పెన్షనర్లకు ఆరోగ్య కార్డులు మంజూరు చేయాలని, కంట్రిబ్యూటరీ పెన్షన్ విధానాన్ని రద్దుచేసి పాత పెన్షన్ విధానమును పునరుద్ధరిం చాలని డిమాండ్ చేసినారు.

## ప్రమాదాల సమయంలో గోల్డెన్ అవర్ కీలకం..

### డి.ఎస్.పి ఈ.కిషోర్ కుమార్



(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

ములుగు ఏప్రిల్ 17 : ప్రమాదం జరిగిన మొదటి గంటలో సరైన వైద్యం అందితే ప్రాణాలను కాపాడవచ్చని ములుగు డిఎస్పి ఈ.కిషోర్ కుమార్ అన్నారు.రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న 99 రోజుల ప్రజా పాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా రోడ్డు ప్రమాదాలను నియంత్రించడం, ప్రజల్లో ట్రాఫిక్ నియమాల పట్ల బాధ్యతాభావం పెంపొందించడం లక్ష్యంగా అరైవ్ - అలైవ్ కార్యక్రమంలో భాగంగా శుక్రవారం ములుగు పోలీస్ స్టేషన్లో రెస్పాండర్స్‌కు సిపిఆర్, ప్రథమ చికిత్స శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ములుగు డీఎస్పీ ఈ.కిషోర్ కుమార్ మాట్లాడుతూ ప్రస్తుత కాలంలో ప్రమాదాలు జరిగినప్పుడు సమయానికి ప్రథమ చికిత్స అందక చాలా మంది ప్రాణాలు కోల్పోతున్నారని తెలిపారు. ప్రమాదం జరిగిన తర్వాత మొదటి గంటను"గోల్డెన్ అవర్"గా పరిగణిస్తారని,ఈ సమయంలో సరైన చికిత్స అందిస్తే అనేక ప్రాణాలను రక్షించవచ్చని చెప్పారు.ప్రమాద బాధితులకు తక్షణ సహాయం అందించి ఆసుపత్రికి తరలించడం అత్యంత ముఖ్యమని సూచించారు.రోడ్డు ప్రమాదాల్లో గాయపడిన వారికి తక్షణ సహాయం అందించి వారి ప్రాణాలను కాపాడే బాధ్యతగల పౌరులను ప్రోత్సహించేందుకు కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న "రహ్ వీర్" పథకం ద్వారా రూ.25,000 నగదు పారితోషికంతో పాటు ప్రశంసా పత్రం అందజేయబడుతుందని, తెలిపారు.ప్రమాదం జరిగిన తొలి గంట"గోల్డెన్ అవర్"లో బాధితులకు సమయానికి వైద్య సహాయం అందితే ప్రాణాలను రక్షించవచ్చని అన్నారు. ఈ కార్యక్రమంలో ములుగు సర్కిల్ ఇన్స్పెక్టర్ దారం సురేష్, ములుగు ఎస్సైలు యు. ఉపేందర్,చంద్రశేఖర్,మెడికల్ ఆఫీసర్ అనిష్కుమార్,108 జిల్లా మేనేజర్ రాజకుమార్, తదితరులు పాల్గొన్నారు.

## కొండగట్టు అంజన్న హుండీ ఆదాయం రూ.75 లక్షలు

### అంజన్న భక్తుల ఫిర్యాదు లేఖల కలకలం..

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)



జగిత్యాల, ఏప్రిల్ 17 : జగిత్యాల జిల్లా మల్యాల మండలంలోనిప్రసిద్ధ కొండగట్టు దేవస్థానం శ్రీ ఆంజనేయ స్వామి ఆలయంలో హుండీ లెక్కింపు శుక్రవారం నిర్వహించారు. లలితా సేవ ట్రస్ట్ ఆధ్వర్యంలో జరిగిన ఈ లెక్కింపులో గత 17 రోజుల్లో మొత్తం రూ.75,02,126 నగదు సమకూరినట్లు ఆలయ ఈవో అంజనారెడ్డి తెలిపారు. హుండీ లెక్కింపు సందర్భంగా అనూహ్య పరిణామం చోటుచేసుకుంది. భక్తులు నగదు, కానుకలతో పాటు తమ సమస్యలను వివరించిన ఫిర్యాదు లేఖలను కూడా హుండీలో వేయడం అధికారులను ఆశ్చర్యానికి గురిచేసింది. ఈ లేఖల్లో ఆలయ పరిసరాల్లో ప్రాథమిక సదుపాయాల లేమిపై భక్తులు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు.ముఖ్యంగా కోనేరులో నీరు అపరిశుభ్రంగా ఉందని, టాయిలెట్ల పరిస్థితి దారుణంగా ఉందని, త్రాగునీటి సదుపాయం సరిగా లేదని పేర్కొన్నారు. భక్తులకు అవసరమైన మౌలిక వసతులు తగిన స్థాయిలో లేవని వాపోయారు. సమస్యలను తక్షణమే పరిష్కరించి సదుపాయాలను మెరుగుపరచాలని, లేనిపక్షంలో భవిష్యత్తులో హుండీలో విరాళాలు ఇవ్వబోమని హెచ్చరించారు. స్థానిక ఆలయాల అభివృద్ధికే తమ సహకారం పరిమితం చేస్తామని లేఖల్లో స్పష్టం చేశారు. హుండీ లెక్కింపు కార్యక్రమంలో దేవదాయ శాఖ జగిత్యాల డివిజన్ పరిశీలకులు రాజామౌళి, ఆలయ ఈవో అంజనారెడ్డి, ఏఈవో హరిహరనాథ్, ప్రధాన అర్చకులు రామకృష్ణ, కపిందర్, ఏఎస్ఐ శ్రీనివాస్, ఆలయ సిబ్బంది, హోంగార్డులు పాల్గొన్నారు.

## ఫైర్‌పై మాత శిశు సంక్షేమ హాస్పిటల్ లోఅవగాహన కార్యక్రమం

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)



మెదక్, ఏప్రిల్ 17 : ప్రజల్లో అగ్ని ప్రమాదాలపై అవగాహన పెంపొందించేందుకు స్థానిక అగ్నిమాపక శాఖ ఆధ్వర్యంలో శుక్రవారం ప్రత్యేక అవగాహన కార్యక్రమం నిర్వహించామని జిల్లా ఫైర్ అధికారి వేణు తెలిపారు. ఈకార్యక్రమంలో అధికారులు అగ్ని ప్రమాదాలు ఎలా సంభవిస్తాయో,వాటి నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలు ఏమిటో వివరించారు.ఇంటి వద్ద గ్యాస్ సిలిండర్ల విని యోగంలో జాగ్రత్తలు పాటించడం, విద్యుత్ పరికరాలను సరిగా ఉపయోగించడం,అగ్ని ప్రమాదం సంభవించినప్పుడు వెంటనే అగ్నిమాపక సిబ్బందికి సమాచారం అందించడం వంటి అంశాలపై ప్రజలకు సూచనలు ఇచ్చారు. అదనంగా,అగ్ని ప్రమాద సమయంలో తక్షణ చర్యలు ఎలా తీసుకోవాలో ప్రదర్శన ద్వారా వివరించారు. స్థానిక నివాసులు ఈ కార్యక్రమంలో వైద్యులు నర్సులు వార్డు బాయ్స్ సెక్యూరిటి సిబ్బంది పాల్గొన్నారు.జిల్లా ఫైర్ అధికారి పాల్గొని ఆసక్తి కనబరిచారు. అగ్నిమాపక అధికారులు ఇలాంటి కార్యక్రమాలు తరచూ నిర్వహించడం ద్వారా ప్రజల్లో అవగాహన పెంపొందుతుందని తెలిపారు. ఈ కార్యక్రమం ప్రజల్లో భద్రతపై చైతన్యం కలిగిం చడంలో కీలక పాత్ర పోషించిందని పాల్గొన్నవారు అభిప్రాయపడ్డారు.ఈ కార్యక్రమం స్టేషన్ అగ్నిమాపక అధికారి ఆధ్వర్యంలో జరిగింది.

## ఇంటర్ ఫలితాలలో వనపర్తి త్రివేణి జూనియర్ కళాశాల విద్యార్థుల ప్రభంజనం



(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

వనపర్తి, ఏప్రిల్ 17 : ఇటీవల ప్రకటించిన ఇంటర్మీడియట్ పరీక్షా ఫలితాలలో శ్రీ త్రివేణి విద్యార్థుల ప్రభంజనం సృష్టించారు. ఫలితాల్లో రాష్ట్ర స్థాయి మార్కులను సాధించి త్రివేణి కళాశాల విద్యార్థుల గొప్ప విజయం సాధించారు. ఈ సందర్భంగా కళాశాల యాజమాన్యం ఆధ్వర్యంలో అభినందన సభ ఏర్పాటు చేయడం జరిగింది. ఈ సమావేశం లో కళాశాల ప్రిన్సిపాల్ కే.రవీందర్ గౌడ్ విద్యార్థులు సాధించిన ఫలితాలను తెలియజేయడం జరిగింది. ద్వితీయ సంవత్సరం ఎంపీసీలో రిబికా (వనపర్తి) 980, మమత (గంగారం) 974, పూజ (వంగూర్) బైపిసి ఇందుమతి (రాజాపేట) 963, పూజ (వంగూరు) 962, ఎంఈసిలో ఆంజనేయులు నాయక్ (సింగయపాల్లి తండా) 905, సోమశేఖర్ (బిరల్లి) 900, సిఈసి విభాగంలో వేదశ్రీ (చెలిమిళ్ల) 901, అలాగే ప్రథమ సంవత్సరం, బైపిసిలో అమూల్య (కుమారలింగంపల్లి) 430, యామిని, (నాగిరెడ్డిపల్లి) 426, ఎంపిసిలో రాజశేఖర్ (పెద్ద కార్బముల) 459, బాబు, (శాఖపురం) 459, సిఈసిలో ధనుంజయ (పెద్దదగడ) 460, శిరీష (బాలకిష్టపురం) 456, రాష్ట్రస్థాయి మార్కులు సాధించిన విద్యార్థినీ, విద్యార్థులకు, వారి తల్లిదండ్రులకు ప్రిన్సిపాల్ పి.మధుసుధన్ చారి, పి.ప్రవీణ్ గౌడ్, వి.రాము పాల్గొని ఈ ఫలితాలను సాధించడంలో సహకరించిన అధ్యాపక అభినందించారు.

## వైద్య సిబ్బంది సమయ పాలన పాటించి రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించాలి : జిల్లా కలెక్టర్ హరిత

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)




ఆసిఫాబాద్, ఏప్రిల్ 17: వైద్య సిబ్బంది సమయ పాలన పాటించి వైద్యం కోసం ప్రభుత్వ ఆసుపత్రులకు వచ్చే వారికి మెరుగైన వైద్య సేవలు అందించాలని కలెక్టర్ హరిత అన్నారు. శుక్రవారం ఆసిఫాబాద్ మండలంలో అడ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ నిర్వహించారు. సిబ్బంది హాజరు రిజిస్టరును పరిశీలించి ఆరోగ్య కార్యకర్తలు, గ్రామాలను సందర్శించి వడ గాలుల పట్ల జాగ్రత్తలు తీసుకోవాలని ప్రజలకు వివరించారు. మందుల నిల్వల గదిని పరిశీలించారు. సరిపడా మందుల నిల్వలు ఉంచుకోవాలన్నారు. ముఖ్యంగా ఓ.ఆర్.ఎస్ ప్యాకెట్లు, ఆరోగ్య కార్యకర్తలు, ఆశాలు, అంగన్వాడి కార్యకర్తల వద్ద వుండేలా చర్యలు తీసుకోవాలన్నారు. సూపర్ వైజర్లు ఆరోగ్య కార్యకర్తల, ఆశాల, పని తీరుపై పర్యవేక్షించాలన్నారు. ఆసుపత్రికి చికిత్స కోసం వచ్చిన వారితో కలెక్టర్ ముచ్చటించారు. వడ దెబ్బ తగిలిన వారికి తక్షణ చికిత్సలు అందించేందుకు ఆసుపత్రిలో అవసరమైన మౌలిక వసతులు,మందులు సిద్ధం చేసుకోవాలన్నారు. ఆసుపత్రికి వైద్యం కోసం వచ్చే వారితో స్నేహ బావంతో వ్యవహరించాలన్నారు. ఈ కార్యక్రమములో వైద్య సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

## సీఐటీయూ చొరవ కార్మికుల ఐక్యతతో మెరుగైన వేతనం

### సీఐటీయూ జిల్లా కార్యదర్శి ఏ.మల్లేశం

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)



మెదక్, ఏప్రిల్ 17 : మెదక్ జిల్లా చేగుంట మండలం చిన్న శివనూరు శివారులోని నియాపోలి పరిశ్రమ కార్మికుల వేతన ఒప్పందంపై డిప్యూటీ కమిషనర్ ఆఫ్ లేబర్ సంగారెడ్డి వద్ద శుక్రవారం రోజు సంతకాలు పూర్తి చేసినట్లు సీఐటీయూ జిల్లా కార్యదర్శి ఏ.మల్లేశం అన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కార్మికుల వేతన ఒప్పందం గడువు 2026 మార్చి 31తో పూర్తి కాగా, ఏప్రిల్ నెలలో యాజమాన్యం తో ఏప్రిల్ 12వ తేదీన వేతన ఒప్పందం పై చర్చలు జరిగినాయన్నారు. ఆ ఒప్పందం ప్రకారం కార్మికులకు నెలకు గరిష్టంగా 7080 రూపాయలు, కనిష్టంగా 6000 రూపాయల వేతనం పెంపుదల, నెలకు 30000 రూపాయల సర్వీస్ వెయిటేజ్, 1982 సిరీస్ ప్రకారం విడిఏ 7 రూపాయల నుండి 8 రూపాయలకు పెంపుదల, ముగ్గురు క్యాజువల్ కార్మికులను పెర్మనెంట్ చేయడం కోసం ఒప్పందం కుదిరిందన్నారు. జిల్లాలో చాలా పరిశ్రమల్లో నెలల తరబడి చర్చలు జరిగే సాంప్రదాయం ఉం డగా సీఐటీయూ ఒకే దఫా చర్చలు చేసి ఒప్పందం చేయడం జిల్లాలోనే రికార్డు అన్నారు. ఇది కేవలం సీఐటీయూ నిజాయితీ, కార్మికుల ఐక్యమత్యం తోనే సాధ్యం అయిందన్నారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల కార్పొరేట్ అనుకూల విధానాల వల్ల ఒక వైపు 12 గం.ల పని విధానం,ఉన్న కార్మికుల్నే కాంట్రాక్ట్ కార్మికులుగా మారుస్తుంటే ఉన్న క్యాజువల్ కార్మికులను పర్మినెంట్ చేసే చరిత్ర సీఐటీయూదే నని ఏ.మల్లేశం అన్నారు. జిల్లాలో అనేక పరిశ్రమల్లో ఎప్పుడో నిర్ణయించిన కనీస వేతనాలు అమలు చేయకపోవడం, ఇ.ఎస్.ఐ,పి.ఎఫ్,బోనస్ లాంటి సౌకర్యాలు కల్పించడం లేదన్నారు. కేంద్రం ప్రభుత్వం పాత చట్టాలను రద్దు చేసి లేబర్ కోడ్స్ తీసుకురావడం ద్వారా ప్రైవేట్ యాజమాన్యాలు మరింత రెచ్చి పోయి కార్మికుల శ్రమను దోచుకుంటున్నారని తీవ్రంగా దుయ్యబట్టారు. హక్కుల కోసం యూనియన్స్ ఏర్పాటు చేసుకుని పోరాడటమే అంతిమ పరిష్కారం అని అన్నారు. పోరాడే కార్మికులకు సీఐటీయూ పూర్తి అండగా నిలుస్తుందన్నారు. వేతన ఒప్పందంపై యజమ్యం తరపున పరిశ్రమ పార్టనర్ దక్షిత్ మోర్,ప్రతినిధి ఆదర్శ్, నియాపోలి ఇండస్ట్రీస్ ఎంప్లాయీస్ యూనియన్ అధ్యక్షులు ఏ.మల్లేశం,ప్రధాన కార్యదర్శి కె.నవీన్, ఉపాధ్యక్షులు మురళి గౌడ్,సహాయ కార్యదర్శి మహేష్,కోశాధికారి శేఖర్, కార్మిక శాఖ తరపున డిప్యూటీ కమిషనర్ ఆఫ్ లేబర్ రవీందర్ రెడ్డి సంతకాలు చేశారు. ఐ.డి యాక్ట్ 12(3)ప్రకారం ఈ వేతన ఒప్పందం కాల పరిమితి 2026 ఏప్రిల్ 1 నుండి 2029 మార్చి 31 వరకు ఉంటుందన్నారు.

## మరో మూడు అదనపు ఐకెపి సెంటర్ల ఏర్పాటు

### - వ్యవసాయ శాఖ మంత్రికి ధన్యవాదలు తెలిపిన ఎమ్మెల్యే మురళి నాయక్

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)



మహబూబాబాద్ టౌన్, ఏప్రిల్ 17: రాష్ట్ర సచివాలయంలో వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ను శుక్రవారం నాడు మహబూబాబాద్ శాసనసభ్యులు డాక్టర్ భూక్య మురళి నాయక్ కలిసి,నియోజకవర్గం లో మొక్కజొన్న కొనుగోలు సెంటర్, ఇతర వ్యవసాయ సంబందించిన విషయాల గురించి చర్చించారు. అనంతరం ఎమ్మెల్యే మురళి నాయక్ మాట్లాడుతూ మహబూబాబాద్ నియోజకవర్గంలో రైతులు భారీ మొత్తంలో మొక్కజొన్న సాగు చేశారని,అసలే వేసవికాలం అని రైతులకు ఎలాంటి ఇబ్బంది కలగకుండా మొక్కజొన్న కొనుగోలు సెంటర్ల సంఖ్య పెంచలని వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు కి తెలిపిన వెంటనే కేసముద్రం, నెల్లికుదురు, గూడూరు, మండల కేంద్రాలకు గాను నూతన ఐకేపి సెంటర్ల ఏర్పాటుకు అనుమతి ఇచ్చారాని వారికి నియోజకవర్గ రైతుల తరుపున ధన్యవాదలు తెలిపారు.



## ఉపాధ్యాయ ఉద్యోగపెన్సర్ల పెండింగ్ సమస్యలు పరిష్కరించాలి


(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

రామగుండం, ఏప్రిల్ 17 : అంతర్గాం తహశీల్ కార్యాలయం ముందు టిజిఈ జెఏసి పిలుపు మేరకు మండలంలోని ఉపాధ్యాయ ఉద్యోగులు పెన్షనర్లకి సంబంధించిన దీర్ఘకాలికంగా పెండింగులో ఉన్న సమస్యలను పరిష్కరించాలని కోరుతూ శుక్రవారం శాంతి యుత ఆందోళన చేపట్టారు. అనంతరం అంతర్గాం మండల తాసిల్దార్ పెద్దపల్లి జిల్లా గెజిటెడ్ అధికారుల సంఘం జిల్లా అధ్యక్షు లు తెలంగాణ ఉద్యోగుల జాయింట్ యాక్షన్ కమిటీ జిల్లా సెక్రెటరీ కి ఆందోళనకారులు పత్రం సమర్పించారు. ఈ నిరసన కార్యక్రమం లో గ్రామ పరిపాలన అధికారి జిల్లా అధ్యక్షులు, శంకరస్వామి టీచర్స్ అసోసియేషన్ మండల అధ్యక్షులు సంతోష్ టీచర్ ఎం రామస్వామి, నయాబ్, తాసిల్దార్ మల్యాల తిరుపతి, సీనియర్ అసిస్టెంట్ త్రివేణి, గిర్దావర్ రమేష్, మండల సర్వేయర్ లలిత, జూనియర్ అసిస్టెంట్ శ్రీనివాస్, జిపిఓల మండల కమిటీ అధ్యక్షులు పి.రాజ్ కుమార్, ఎన్.వినోద, బి.పుష్పలత, సుమలత, శ్రీనివాస్, అటెండర్ సిహెచ్ఓఎల్, కంప్యూటర్ ఆపరేటర్ సతీష్, వేణు, సిబ్బంది పాల్గొన్నారు.

## ఆరోగ్యశాఖలోని వాహనాలకు వేలం

### డా.రవి రాథోడ్

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)



మహబూబాబాద్ టౌన్, ఏప్రిల్ 17: మహబూబాబాద్ జిల్లా వైద్య ఆరోగ్యశాఖలో గల 104 ఫిక్స్ డే హెల్త్ సర్వీసెస్ 5 వాహనాలకు వేలం నిర్వహిస్తున్నట్లు జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డా.బి.రవి రాథోడ్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. స్వరాజ్ మజ్దా కంపెనీకి చెందిన 5 వాహనాలకు ఈ నెల 23న జిల్లా కేంద్రంలోని ఆర్టిఓ కార్యాలయం ప్రక్కన గల స్థలములో వేలం నిర్వహన ఉ ంటుందని, ఆసక్తి గల వారు 1000 (నాన్ రిఫండ్) జిల్లా వైద్య, ఆరోగ్య శాఖాధికారి,మహబూబాబాద్ పేరు మీద డి.డి.తీసి వేలం లో పాల్గొనాలని తెలిపారు. మరిన్ని వివరాల కోసం జిల్లా వైద్యాధికారి కార్యాలయం లో ఈ నెల 18వ తేది నుండి 22వ తేది వరకు ఉ దయం 11 గంటల నుండి 4 వరకు సెల్ నెం.7659882067 లో సంప్రదించాలని ఆన్నారు.



## నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసన చేపట్టిన ఉపాధ్యాయులు

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

ఆసిఫాబాద్, ఏప్రిల్ 17: తెలంగాణా రాష్ట్ర ఉద్యోగ ఉపాధ్యాయ సంఘాల ఐక్య కార్యాచరణ కమిటీ టిజెఏసి పిలుపు మేరకు శు క్రవారం తెలంగాణా రాష్ట్ర గిరిజన సంక్షేమ ఉపాధ్యాయుల సంఘం టీఎస్టీడబ్ల్యూటియు ఆధ్వర్యంలో కుమరం భీమ్ ఆసిఫాబాద్ జిల్లా తీర్యాని మండలం గిన్నెధరి ఆశ్రమ పాఠశాలలో ఉపాధ్యాయు లు నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా టిఎస్టిడబ్ల్యూటియు పిజి హెడ్ మాస్టర్ అసోసియేషన్ జిల్లా అధ్య క్షులు పూర్కా ఉద్దవ్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం వెంటనే 51% ఫిట్మెంట్ ఇచ్చి పిఆర్‌సి ప్రకటించాలి అని, పాత పెన్షన్ విధానం ప్రకటించాలి, సీఆర్టీ ఉపాధ్యాయులకు మినిమమ్ టైం స్కేల్ చేయాలి,పెండింగ్ బిల్లులు అన్నీ విడుదల చేయడంతో పాటు ఉ పాధ్యాయులకు పెండింగ్ లో ఉన్న డి ఏ లను తక్షణమే మంజూరు చేయాలనీ కాంట్రాక్ట్ ఔట్ సోర్సింగ్ ఉద్యోగులకు కనీస వేతనం పెంచాలని ఉద్యోగ ఉపాధ్యాయుల అపరిష్కృత సమస్యలు పరిష్కరిం చాలని టిజెఏసి ఇచ్చిన పిలుపు మేరకు దశల వారీగా ఉద్యమం చేపట్టడం అందులో భాగంగానే మధ్యాహ్నం భోజనం విరామం సమయంలో ఉపాధ్యాయులు నల్లభ్యాడ్జి లు ధరించి నిరసన వ్యక్తం చేశారు. ప్రభుత్వం సకాలంలో స్పందించకుంటే భవిష్యత్తు లో జెఏసి ఆధ్వర్యంలో పేద్ద ఎత్తున నిరసన కార్యక్రమాలు చేపట్టడం జరుగుతుందని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఆ సంఘం పి జి హెడ్ మాస్టర్ అసోసియేషన్ జిల్లా ప్రధాన కార్యదర్శులు, నైతం కృష్ణ రావ్, టిఎస్టిడబ్ల్యూటియు జిల్లా అధ్యక్షులు రాథోడ్ రవీందర్, ప్రధాన కార్యదర్శి మాడావి గోపాల్, అసోసియేషన్ అధ్యక్షులు వెడ్మ యస్వంత్ రావ్, కోశాధికారి కూడ్మేత అనంత్, జిల్లా కార్యవర్గం సభ్యులు అడా వెంకటేష్, పెందూర్ గంగారాం, జాదవ్ ప్రఫుల్, నైతం లచ్చు, అవినాష్, శ్రీనివాస్, మహిళా కార్యదర్శులు కోవా తార, మాడావి సావిత్రి, తదితరులు పాల్గొన్నారు.

# ఆరోగ్యం

## షాపులో కొన్న నెయ్యి ఒరిజనలా లేదా కల్తీదా? ఇలా చేస్తే ఈజీగా తెలిసిపోతుంది



మన భారతీయుల వంటగదుల్లో ఉండే అతిముఖ్యమైన పదార్థాలలో నెయ్యి ఒకటి. స్వచ్ఛత, సాంప్రదాయినికి చిహ్నంగా నెయ్యిని భావిస్తుంటారు. వంటల్లో మాత్రమే కాకుండా ఆధ్యాత్మిక సంప్రదాయాలలో,పూజలు వంటి వాటికి నెయ్యిని వాడుతుంటారు. నెయ్యి చర్మ సౌందర్యానికి కూడా ఉపయోగించబడుతుంది. ఇక నెయ్యిని ఆహారంలో తీసుకోవడం వల్ల అనేక రకాలుగా మేలు జరుగుతుంది. అనేక ప్రమాదకరమైన వ్యాధుల నుంచి కూడా నెయ్యి మనల్ని కాపాడుతుంది. ఆయుర్వేదంలో కూడా నెయ్యికి ఓ ప్రత్యేక స్థానం ఉంటది. నీటితో కలపండి మీరు కొన్న నెయ్యి నిజంగా స్వచ్ఛమైనదేనా అని అనుమానంగా ఉంటే.. చిన్న గిన్నెలో కొద్దిగా షాపు నుంచి కొన్న నెయ్యి వేయండి. అందులోనే రెండు మూడు చుక్కల నీళ్లు వేయండి. కాసేపు తర్వాత ఆ నెయ్యి నీటిలో వెంటనే కలిసిపోకుండా విడిపోయినట్లుగా అనిపించినా లేదా నీటి చుక్కలు నెయ్యి పైన తేలుతూ ఉన్నట్లు కనిపించినా అది కల్తీ నెయ్యి అని అర్థం చేసుకోవచ్చు. ఇలా జరిగిందంటే ఆ నెయ్యిలో ఖచ్చితంగా ఇతర పదార్థాలు అంటే ఆయిల్ లేదా జంతువుల కొవ్వులు కలిపి ఉండవచ్చు. అదే స్వచ్ఛమైన నెయ్యి అయి ఉంటే అందులో నీరు కలిపినప్పుడు అది వేరుగా కాకుండా,నీటితో కలిసి ఒక మృదువైన మిశ్రమంగా తయారవుతుంది. అది నీటిలో కలిసినా కూడా తన సహజమైన రూపాన్ని నిలుపుకుంటుంది. ఈ చిన్న పరీక్షతో నెయ్యి నాణ్యతను నిర్ధారించుకోవచ్చు.

రంగు మంచి స్వచ్ఛమైన నెయ్యి ఎప్పుడూ లేత బంగారు పసుపు రంగులో ఉంటుంది. ఈ రంగు చూడటానికి చాలా ఆకర్షణీయంగా,ఫ్రెష్ గా అనిపిస్తుంది. ఒకవేళ మీరు కొన్న నెయ్యి సాధారణం కంటే ఎక్కువగా తెల్లగా ఉంటే అది స్వచ్ఛమైనది కాకపోవచ్చు. అలా ఉంటే అందులో పిండి పదార్థాలు,హానికరమైన రసాయనాలు లేదా జంతువుల కొవ్వులు కలిపి ఉండవచ్చు. నకిలీ నెయ్యికి.. అసలైన,మంచి నెయ్యికి ఉండే సహజమైన బంగారు రంగు ఉండదు. కాబట్టి నెయ్యి కొనేటప్పుడు దాని రంగును జాగ్రత్తగా పరిశీలించడం చాలా చాలా ముఖ్యం. రంగును బట్టి అది స్వచ్ఛమైనదా కాదా అని కొంతవరకు గుర్తించవచ్చు.

ఫ్రిడ్జ్ లో పెట్టండి మీరు కొన్న నెయ్యి స్వచ్ఛమైనదా కాదా అని మరొక టెస్ట్ ద్వారా కూడా తెలుసుకోవచ్చు. ఒక చిన్న గిన్నెలో కొద్దిగా నెయ్యి తీసుకొని దానిని కొన్ని గంటలపాటు మీ ఫ్రిజ్‌లో పెట్టేయండి. కాసేపయ్యాక చూడండి. స్వచ్ఛమైన నెయ్యి అయితే అది గట్టిగా మారిపోతుంది. అంతేకాదు మీరు దానిని తాకితే జిడ్డుగా అనిపించకుండా ఒక గట్టి వెన్నలా ఉంటుంది. ఎలాంటి జిడ్డు మరకలు కూడా ఉండవు. స్వచ్ఛమైన నెయ్యి తన సహజమైన రూపాన్ని నిలుపుకుంటుంది. ఒకవేళ ఆ నెయ్యి ఫ్రిజ్‌లో పెట్టిన తర్వాత కూడా పూర్తిగా గట్టిపడకుండా ద్రవంగానే ఉండినా, లేదా దాని చుట్టూ జిడ్డు జిడ్డుగా అనిపించినా అది కల్తీ నెయ్యి అయ్యే అవకాశం ఉంది. అలా ఉంటే, అందులో జంతువుల కొవ్వులు లేదా తక్కువ నాణ్యత కలిగిన చౌకైన ఆయిల్స్ వంటివి కలిపి ఉండవచ్చు. ఇటువంటి పదార్థాలు నెయ్యి సహజమైన గట్టిపడే స్వభావాన్ని మార్చేస్తాయి. కాబట్టి ఇకపై మీరు నెయ్యి కొన్నప్పుడు దాని స్వచ్ఛతను పరీక్షించడానికి ఈ ఫ్రిజ్ ట్రిక్‌ను తప్పకుండా ప్రయత్నించండి.

వాసన స్వచ్ఛమైన నెయ్యిని ప్యాకెట్ ఓపెన్ లేదా బాక్స్ మూత తీసినా మీ ముక్కుపుటాలను తాకే ఆ సువాసన అద్భుతంగా ఉంటుంది. అది పాల నుండి వచ్చిన సహజమైన కొవ్వుల ప్రత్యేకమైన వాసన. ఆ సువాసనలోనే నెయ్యి స్వచ్ఛత దాగి ఉంటుంది. ఒకవేళ మీరు కొన్న నెయ్యికి ఆ మధురమైన వాసన లేకపోతే లేదా అది పుల్లగా అనిపించినా లేదా మీకు ఏదో అసహ్యకరమైన వాసన వస్తున్నట్లు అనిపించినా జాగ్రత్త వహించండి. అలా ఉంటే ఆ నెయ్యిలో వేరే నూనెలు, హానికరమైన రసాయనాలులేదా దానిని ఎక్కువ కాలం నిల్వ ఉంచడానికి వాడే ప్రిజర్వేటివ్స్ కలిపి ఉండవచ్చు. ఇటువంటి కల్తీలు నెయ్యి సహజమైన సువాసనను పూర్తిగా మార్చివేస్తాయి. కాబట్టి నెయ్యి కొనేటప్పుడు దాని సువాసనను తప్పకుండా పరిశీలించండి.

## కోటీశ్వరులు కూడా కక్కుర్తి పడి తినే రెసిపి ఇదే..ఎలా చేయాలంటే

సీ ఫుడ్ ని ఇష్టపడేవాళ్లలో చాలామంది ఇష్టపడే వంటకం పీతల ఇగురు. దీని రుచి అమోఘం,అద్భుతం. మాటల్లో వర్ణించలేని టేస్ట్ దీనిది. పీత మాంసం తియ్యని రుచి, సుగంధ ద్రవ్యాల ఘాటు, చిక్కటి గ్రేవీ ఈ వంటకాన్ని ప్రత్యేకంగా నిలబెడతాయి. అన్నం, చపాతీతో ఇది తింటే చాలా బాగుంటుంది. కోటీశ్వరులు కూడా కక్కుర్తిపడి మరీ తినే పీతల ఇగురు ఇంట్లోనే ఎలా తయారుచేసుకోవాలి, దీని తయారీకి కావలసిన పదార్థాలు ఏంటో ఇక్కడ చూడండి.

పీతల ఇగురు తయారీకి కావలసిన పదార్థాలు పీతలు - 1 కేజీ చింతపండు రసం - 1/2 కప్పు నూనె - 4-5 టేబుల్ స్పూన్లు ఉప్పు - రుచికి తగినంత పసుపు - 1/2 టీ స్పూన్ కారం - 2-3 టీ స్పూన్లు ఉల్లిపాయలు - 2 పెద్దవి పచ్చిమిర్చి - 3-4 కొత్తిమీర - కొద్దిగా కరివేపాకు - కొద్దిగా అల్లం వెల్లుల్లి పేస్ట్ - 2 టేబుల్ స్పూన్లు గరం మసాలా - 1 టీ స్పూన్ టమోటాలు - 2 మీడియం సైజు ధనియాల పొడి - 2 టీ స్పూన్లు జీలకర్ర పొడి - 1 టీ స్పూన్

పీతల ఇగురు తయారీ విధానం -ముందుగా ముందుగా పీతలను శుభ్రంగా కడిగి వాటి కాళ్లు, పెంకులను వేరు చేయండి. పెద్ద పీతలైతే వాటిని రెండు లేదా మూడు ముక్కలుగా కట్ చేసుకోండి.

-తర్వాత స్టవ్ మీద బాండీ పెట్టి ఆయిల్ వేడి చెయ్యాలి. నూనె వేడెక్కిన తర్వాత కరివేపాకు, పచ్చిమిర్చి,తరగిన ఉల్లిపాయలు వేసి అవి బంగారు రంగు వచ్చే వరకు వేయించాలి. -తర్వాత అల్లం వెల్లుల్లి పేస్ట్ వేసి పచ్చి వాసన పోయే వరకు ఒక నిమిషం పాటు వేయించాక తరిగిన టమోటాలు వేసి మెత్తగా అయ్యే వరకు ఉడికించాలి. -ఇప్పుడు పసుపు, కారం, ధనియాల పొడి, జీలకర్ర పొడి వేసి బాగా కలపండి. మసాలాలు నూనెలో కొద్దిసేపు వేగనివ్వండి. -ఇప్పుడు అందులో శుభ్రం చేసుకున్న పీతల ముక్కలు వేసి మసాలాలు



బాగా పట్టేలా కలపాలి. -ఇందులో రుచికి తగినంత ఉప్పు వేసి ఒకసారి కలపండి.

-తర్వాత చింతపండు రసం పోసి బాగా కలిపి మూత పెట్టేయాలి. 10-15 నిమిషాలు లేదా పీతలు పూర్తిగా ఉడికే వరకు మీడియం మంటమీద ఉడికించాలి. మధ్య మధ్యలో కలుపుతూ ఉండాలి. అవసరమైతే కొద్దిగా నీరు చేర్చవచ్చు. -గ్రేవీ చిక్కబడిన తర్వాత గరం మసాలా, తరిగిన కొత్తిమీర వేసి కలిపి ఒక నిమిషం ఉంచి స్టవ్ ఆఫ్ చేయండి. అంతే పీతల ఇగురు రెడీ. -వేడి వేడి పీతల ఇగురు అన్నం, రొట్టె లేదా చపాతీతో వడ్డించండి.

ఆరోగ్య ప్రయోజనాలు పీతలు రుచికరమైనవే కాకుండా అనేక పోషక విలువలను కలిగి ఉంటాయి.




పీతలు అధిక మొత్తంలో ప్రోటీన్‌ను కలిగి ఉంటాయి. ఇది కండరాల నిర్మాణం, మరమ్మత్తుకు చాలా అవసరం. ఒక కప్పు ఉడికించిన పీత మాంసంలో దాదాపు 24 గ్రాముల ప్రోటీన్ ఉంటుంది. పీతలలో కొవ్వు శాతం చాలా తక్కువగా ఉంటుంది. ముఖ్యంగా సంతృప్త కొవ్వు తక్కువగా ఉండటం వల్ల ఇది గుండె ఆరోగ్యానికి మంచిది. పీతలలో ఒమేగా-3 ఫ్యాటీ యాసిడ్స్ ఉంటాయి. ఇవి గుండె ఆరోగ్యాన్ని మెరుగుపరచడానికి, రక్తపోటును తగ్గించడానికి, శరీరంలో మంటను తగ్గించడానికి సహాయపడతాయి.

## ఈ బోండా ముందు మైసూర్ బోండా ఏమాత్రం పని చేయదు..

### - నోట్లో వేస్తే బ్లాస్టే,ఎలా చేసుకోవాలో తెలుసా?



ఈ ఎండాకాలంలో పిల్లలకు స్కూల్స్ లేకపోవడం వలన వారు ఎప్పుడూ ఏదో ఒక స్నాక్ తినడానికి అడుగుతూనే ఉంటారు. లేకపోతే ఏదైనా చాకోలెట్, ఐస్ క్రీం వంటివి కోరుకుంటుంటారు. ఇవి ఆరోగ్యానికి హాని చేయడంతో పాటు ఎక్కువ డబ్బు కూడా ఖర్చు చేయిస్తాయి. అందుకే తల్లిదండ్రులు వారికి స్నాక్స్ చేసి ఇవ్వడానికి ప్రయత్నిస్తుంటారు. అయితే ఇలాంటి సమయాల్లో రవ్వ బోండా ఒక అద్భుతమైన వంటకంగా చెప్పుకోవచ్చు. ఇది చాలా రుచికరంగా ఉంటుంది. టీ లేదా కాఫీతో కూడా ఈ బొండాను అద్దుకొని తినొచ్చు. ఈ బొండాను తయారు చేయడం కూడా చాలా సులభం. చిన్న చిన్న టిప్స్‌తో మరింత రుచికరంగా ఈ బొండాను మార్చుకోవచ్చు. ఈ స్టోరీలో ఈ రవ్వ బోండా ఎలా చేయాలి? దానికి కావాల్సిన పదార్థాలు ఏంటి? అనేది తెలుసుకుందాం రండి.

రవ్వ బొండా తయారీకి కావాల్సిన పదార్థాలు: ఉప్పు - రుచికి సరిపడా ఉప్మా రవ్వ - 2 కప్పులు మైదా - ½ కప్పు బేకింగ్ సోడా - ½ టీస్పూన్ ఉల్లిపాయలు - 2 పచ్చిమిరపకాయలు - 3 అల్లం - 1 చిన్న ముక్క కరివేపాకు - కొద్దిగా కొత్తిమీర తరుగు - 2 టీస్పూన్లు నీరు - తగినంత నూనె - వేయించడానికి బియ్యంపిండి - 2 స్పూన్లు పెరుగు - 1 కప్పు.

రవ్వ బొండా తయారీ విధానం: ఒక గిన్నెలో 2 కప్పులు ఉప్మా రవ్వ, 2 స్పూన్లు బియ్యంపిండి, ½ కప్పు మైదా వేసి బాగా కలపండి. ఇందులో రుచికి సరిపడా ఉప్పు కూడా చేర్చండి. ఇప్పుడు ఆ పిండిని మొత్తాన్ని బాగా కలిపి పక్కన పెట్టుకోండి. ఇప్పుడు ఈ మిశ్రమంలో ఉల్లిపాయ తరుగు, పచ్చిమిరపకాయలు, అల్లం తరుగు, కరివేపాకు, కొత్తిమీర తరుగు జోడించండి. ఆ తరువాత వాటన్నిటినీ ఓసారి బాగా కలుపుకోండి. వీటిని వల్ల రవ్వ బొండా మరింత రుచికరంగా మారుతుంది.

ఇప్పుడు ఈ మిశ్రమంలో ½ టీస్పూన్ బేకింగ్ సోడా వేసి బాగా కలపండి. ఇది బొండా బాగా ఉబ్బడానికి, పొరలు పొరలుగా రావడానికి సహాయపడుతుంది. అనంతరం ఈ మిశ్రమంలో 1 కప్పు పెరుగు, తగినంత నీరు వేసి బాగా కలిపి ఒక పేస్టు తయారుచేయండి. నీరులా కారకుండా కొంచెం గట్టిగా ఉండే విధంగా ఉండాలి. ఇప్పుడు స్టవ్‌పై ఒక గిన్నె పెట్టి, బోండాలు వేయించడానికి తగినంత నూనె వేడి చేయండి. నూనె క్రమంగా వేడి అయ్యాక, రవ్వ మిశ్రమాన్ని చిన్న బోండాలుగా బాగా చేసి, వేడి నూనెలో వేయించండి. బొండాలు బంగారు రంగులోకి మారినపుడు, వాటిని తీసుకుని ఒక పట్టికపై లేదా పేపర్ టవల్‌పై ఉంచాలి.

## సమ్మర్‌లో ఈ అట్లే తినాలి



మజ్జిగ చుక్క అట్లు తయారీకి కావలసిన పదార్థాలు -బియ్యం పిండి - 1 కప్పు -పుల్లటి మజ్జిగ - 1 1/2 కప్పులు -ఉల్లిపాయ - 1 చిన్నది -పచ్చిమిర్చి - 2-3 -అల్లం - 1/2 అంగుళం ముక్క -కొత్తిమీర - 2 టేబుల్ స్పూన్లు -జీలకర్ర - 1/2 టీస్పూన్ -ఉప్పు - రుచికి సరిపడా -నూనె లేదా నెయ్యి - అట్లు వేయించడానికి తగినంత.

మజ్జిగ చుక్క అట్లు తయారీ విధానం -ఒక పెద్ద గిన్నెలో బియ్యం పిండి వేయాలి. అందులో పుల్లటి మజ్జిగను కొద్ది కొద్దిగా వేస్తూ ఉండలు లేకుండా బాగా కలపాలి. పిండి మజ్జిగలో పూర్తిగా కలిసిపోయి దోస పిండి కంటే కొంచెం పలుచగా ఉండేలా చూసుకోవాలి. -ఇప్పుడు సన్నగా తరిగిన ఉల్లిపాయ, పచ్చిమిర్చి, తురిమిన అల్లం, తరిగిన కొత్తిమీర, జీలకర్ర వేసి బాగా కలపాలి. -రుచికి సరిపడా ఉప్పు వేసి మరొకసారి బాగా కలపాలి. పిండిని కనీసం 15-20 నిమిషాల పాటు నాననివ్వాలి. ఇలా నానబెట్టడం వల్ల అట్లు మరింత మెత్తగా వస్తాయి. -స్టవ్ మీద ఒక నాన్-స్టిక్ పెనం లేదా సాధారణ పెనం ఉంచి వేడి చేయాలి. పెనం వేడెక్కిన తర్వాత కొద్దిగా నూనె లేదా నెయ్యి వేసి పెనం అంతా స్ప్రెడ్ చేయాలి. -ఒక గరిటెడు పిండిని తీసుకొని వేడెక్కిన పెనం మీద గుండ్రంగా పలుచగా పోయాలి. -అట్టు అంచులు కొంచెం ఎండినట్లుగా కనిపించినప్పుడు దానిపై కొద్దిగా నూనె లేదా నెయ్యి వేయాలి. -అట్టు ఒకవైపు బంగారు రంగులోకి వచ్చాక దానిని జాగ్రత్తగా తిప్పి రెండోవైపు కూడా కాల్చాలి. రెండు వైపులా బాగా కాలి బంగారు రంగులోకి వచ్చాక పెనం నుండి తీసి ప్లేట్‌లో పెట్టుకోవాలి. -ఇలాగే మిగిలిన పిండితో కూడా అట్లను వేసుకొని వేడి వేడిగా చట్నీ లేదా సాంబార్‌తో సర్వ్ చేయాలి. కొబ్బరి చట్నీ, టమాటో చట్నీ లేదా అల్లం చట్నీతో ఈ అట్లు చాలా రుచిగా ఉంటాయి.


# సినిమా న్యూస్



కొంత మంది ఎక్కడ పోగొట్టుకున్నారో అక్కడే రాబట్టుకుంటారు.. అదే డెస్టినీ అంటే. ఇలాంటి సంఘటనలు చాలా అరుదుగా జరుగుతుంటాయి. అలాంటి అరుదైన సంఘటనే హీరో, టాలెంటెడ్ యాక్టర్ సత్యదేవ్ విషయంలోనూ జరిగిందట. అదే విషయాన్ని ఈ సందర్భంగా వెల్లడించి అందరిని షాక్‌కు గురి చేశాడు. సత్యదేవ్ కథానాయకుడిగా నటిస్తున్న మూవీ -రావ్ బహదూర్-. వెంకటేష్ మహా దర్శకుడు. జీఎంబీ ఎంటర్‌టైన్‌మెంట్ బ్యానర్‌పై హీరో మహేష్ బాబు, నమ్రత శిరోద్కర్ సమర్పిస్తున్నారు. త్వరలో ప్రేక్షకుల ముందుకు రానుంది. దీపా థామస్ హీరోయిన్‌గా నటిస్తోంది. స్మరణ్ సాయి సంగీతం అందిస్తున్న ఈ మూవీ ఫస్ట్ సింగిల్‌ని ఇటీవల విడుదల చేశారు. సినిమా రిలీజ్ దగ్గరపడుతున్న నేపథ్యంలో తాజా నిర్వహించిన ప్రమోషనల్ ఈవెంట్‌లో హీరో సత్యదేవ్ ఓ ఆసక్తికరమైన విషయాన్ని వెల్లడించి ఆశ్చర్యపరిచారు. అంతే కాకుండా మహేష్ బాబుపై తనకున్న అభిమానానని ఈ సందర్భంగా చాటుకున్నాడు. ఓ అరుదైన సంఘటనని ఈ సందర్‌బంగా వెల్లడించారు. హైదరాబాద్‌లోని ఎస్.ఆర్. నగర్ ఎక్కువగా కాలేజీలు ఉండే ఏరియాలో ఓ సినిమా షూటింగ్ కోసం ఓ సన్నివేశాన్ని చిత్రీకరిస్తున్నాం. ఆ సన్నివేశాన్ని మహేష్ బాబు, నేను పాల్గొనగా చిత్రీరిస్తున్నారు. దీంతో చుట్టు పక్కల ట్రాఫిక్ జామ్ అయింది. స్టూడెంట్స్ ఎగ్జామ్స్ జరుగుతున్నా ఎగ్జామ్స్‌కు వెళ్లడం లేదు. అక్కడే ఉండి షూటింగ్ చూస్తున్నారు. కొంత మంది కిటికీల్లోంచి చూస్తూ కేకలు వేస్తున్నారు.

## డెస్టినీ అంటే ఇదే.. సత్యదేవ్ గ్రేట్ అచీవ్‌మెంట్!


ఆ సమయంలో మహేష్ నా భుజంపై చేయి వేసి డైలాగ్‌లు చెబుతున్నారు. ఇంతలో మా షూటింగ్ కారణంగా ట్రాఫిక్ జామ్ అయిందని తెలిసి ఓ పోలీస్ ఆయన వచ్చి షూటింగ్‌ని వాయిదా వేసుకోమన్నాడు. దాంతో నాకు సంబంధించిన వెర్షన్ పూర్తి కాకుండానే షూటింగ్ ఆగిపోయింది. దాంతో నా సీన్‌ని సినిమాలోంచి లేపేశారు. అప్పటికే ఊళ్లో వాళ్లందరికి నేను మహేష్ బాబుతో కలిసి నటించానని చెప్పుకున్నాను. సినిమాలో లేకపోయే సరికి ఫీలయ్యాను. అయితే అలా మిస్సయిన అవకాశం మళ్లీ ఈ సినిమాతో నన్ను వెతుక్కుంటూ రావడం డెస్టినీ అన్నారు సత్యదేవ్. మహేష్‌తో నటించిన సీన్ కట్ అయినా ఆయనే నా సినిమాకు సమర్పకులుగా వ్యవహరించడంతో నా డ్రీమ్ ఫుల్ ఫిల్ అయిందన్నారు. ఈ విషయం పక్కన పెడితే ప్రస్తుతం మహేష్ బాబు అత్యంత భారీ స్థాయిలో రూపొందుతున్న -వారణాసి-లో నటిస్తున్నారు. జక్కన్న అత్యంత ప్రతిష్టాత్మకంగా తెరకెక్కిస్తున్న గ్లోబల్ మూవీగా అత్యంత భారీ స్థాయిలో ప్రేక్షకుల ముందుకు రానుంది. ఇరాన్ – ఇజ్రాయెల్ వార్ కారణంగా ఈ సినిమా షూటింగ్ ఆలస్యం అవుతూ వస్తోంది. సౌదీ, దుబాయ్‌లలో కీలక సన్నివేశాలని షూట్ చేయాలని ప్లాన్ చేశారట. అయితే తాజా పరిణామాల నేపథ్యంలో ఆ షెడ్యూల్‌ని ఇండియాలోనే భారీ సెట్‌లలో పూర్తి చేయాలని ప్లాన్ చేస్తున్నట్టుగా వార్తలు వినిపిస్తున్నాయి.



## సమంత కెరీర్ గ్రాఫ్.. గ్యాప్!



ఏ మాయ చేసావే అంటూ అడుగుపెట్టిన సమంత అనతి కాలంలోనే అగ్ర హీరోయిన్‌గా ఎదిగారు. కెరీర్ ఆరంభంలో అమ్మడి ప్రయాణం ఒక ప్రభంజనంలా సాగింది. మహేష్ , పవన్ కళ్యాణ్, ఎన్టీఆర్ వంటి అగ్ర హీరోలందరి సరసన నటించి గోల్డెన్ లెగ్ గా పేరు తెచ్చుకున్నారు. తెలుగుతో పాటు తమిళంలోనూ వరుస విజయాలు సాధిస్తూ సౌత్ ఇండియాలోనే అత్యధిక పారితోషికం తీసుకునే కథానాయికలలో ఒకరిగా సత్తా చాటారు. ఆ సమయంలో ఆమె కెరీర్ గ్రాఫ్ నిరంతరం ఎదుగుతూనే ఉంది. అయితే వ్యక్తిగత జీవితంలో చోటుచేసుకున్న పరిణామాలు సమంత వృత్తిపరమైన వేగాన్ని ప్రభావితం చేసాయి అన్నది కాదనలేని నిజం. వివాహం తర్వాత కూడా ఆమె-రంగస్థలం-, మజిలీ, ఓ బేబీ వంటి చిత్రాలతో నటనలోని వైవిధ్యాన్ని నిరూపించుకున్నారు. కానీ వైవాహిక జీవితంలో విడిపోవడం, ఆ తర్వాతి కాలంలో ఎదురైన ఆరోగ్య సమస్యలు ఆమెను సినిమాలకు కొంతకాలం దూరం చేశాయి. మయోసైటిస్ వ్యాధి వల్ల శారీరకంగా, మానసిక సిద్ధంగా బలపడటానికి ఆమె కావాలనే సినిమాలకు సుదీర్ఘ విరామం ప్రకటించిన సంగతి తెలిసిందే. అయితే సెకెండ్ ఇన్నింగ్స్ ప్రారంభించిన తర్వాత సమంత కేవలం వెండితెరకే పరిమితం కాకుండా డిజిటల్ మాధ్యమంపై దృష్టి సారించారు. ది ఫ్యామిలీ మ్యాన్ 2 సిరీస్‌తో జాతీయ స్థాయిలో ప్రశంసలు అందుకున్న అమ్మడు అటుపై తన కెరీర్ పంథాను మార్చుకున్నారు. కేవలం గ్లామర్ పాత్రలకే పరిమితం కాకుండా, కథా బలమున్న లేడీ ఓరియెంటెడ్ చిత్రాలను ఎంచుకోవడం మొదలుపెట్టారు. యశోద, శాకుంతలం వంటి ప్రయత్నాలు ఆ కోవలోకి చెందినవే అయినా అవి ఆశించిన స్థాయిలో బాక్సాఫీస్ వద్ద విజయం సాధించలేకపోయాయి. గత మూడేళ్ల కాలంలో సమంత కెరీర్ గ్రాఫ్‌లో స్పష్టమైన గ్యాప్ కనిపిస్తోంది. ఆమె తన సొంత నిర్మాణ సంస్థ ట్రాలాల మూవింగ్ పిక్చర్స్ ప్రారంభించి 'మా ఇంటి బంగారం' వంటి సినిమా ఇంకా షూటింగ్ దశలోనే ఉంది. ప్రస్తుతం సమంత ఎంపిక చేసిన ప్రాజెక్టులకే మొగ్గు చూపుతున్నారు. సమంత తన వ్యక్తిగత జీవితానికి, వృత్తికి మధ్య సమతుల్యత సాధించే క్రమంలోనే ఈ స్థాయిలో గ్యాప్ తీసుకున్నట్లు స్పష్టమవుతోంది. రాజ్ నిడిమోరుతో వివాహం తర్వాత ఆమె వ్యక్తిగత జీవితం మళ్లీ స్థిరపడినట్లు కనిపిస్తున్నా? సినీ కెరీర్ విషయంలో మాత్రం ఆమె ఇంకా పాత వైభవం కోసం వేచి చూడాల్సి వస్తోంది. ఒకప్పుడు ఏడాదికి మూడు నాలుగు సినిమాలు చేసే స్థాయి నుండి ఇప్పుడు ఒక్క సినిమా విడుదల కోసం అభిమానులు ఏళ్ల తరబడి నిరీక్షించాల్సిన పరిస్థితి ఏర్పడింది. ప్రస్తుతం సమంత సెకండ్ ఇన్నింగ్స్‌లో క్వాంటిటీ కంటే క్వాలిటీకే ప్రాధాన్యత ఇస్తున్నట్లు ఆమె నిర్ణయాలు చెబుతున్నాయి. సామా ఆరంభంలో కమర్షియల్ స్టార్‌గా వెలిగిపోయారు. కానీ నేడు ఒక పరిణతి చెందిన నటిగా, నిర్మాతగా తనకంటూ ఒక ప్రత్యేక మార్గాన్ని నిర్మించుకునే ప్రయత్నంలో ఉన్నారు. ఈ గ్యాప్ తర్వాత ఆమె చేసే సినిమాలు పూర్వ వైభవాన్ని తెచ్చిపెడతాయా ? లేదా? అన్నది ఆసక్తికరంగా మారింది. కెరీర్ సెకండ్ హాఫ్‌లో ఆమె తీసుకోబోయే నిర్ణయాలే భవిష్యత్తులో ఆమె స్థానాన్ని డిసైడ్ చేస్తాయన్నది కాదనలేని నిజం.




## 'పెద్ది' వల్ల ఇంకా ఎన్ని ఎఫెక్ట్ కావాలి?

రామ్ చరణ్ హీరోగా జాన్వీ కపూర్ హీరోయిన్‌గా రూపొందుతున్న 'పెద్ది' సినిమాపై అంచనాలు భారీగా పెరుగుతూనే ఉన్నాయి. సాధారణంగా సినిమా ఆలస్యం అవుతున్న కొద్ది అంచనాలు తగ్గుతాయి అంటారు. కానీ పెద్ది విషయంలో అది రివర్స్‌లో ఉంది. దర్శకుడు బుచ్చిబాబు ఈ సినిమా ప్రీ ప్రొడక్షన్ వర్క్ కోసం, స్క్రిప్ట్ వర్క్ కోసం దాదాపుగా ఏడాది టైం తీసుకున్నాడు. అయినా కూడా షూటింగ్ ఆలస్యం అయింది. పైగా రామ్ చరణ్‌కి గాయం, ఇతర వ్యక్తిగత విషయాల కారణంగా సినిమా ఆలస్యం అవుతూ వచ్చింది. షూటింగ్ దాదాపుగా పూర్తి అయినప్పటికీ వీఎఫ్ఎక్స్ వర్క్ విషయంలో దర్శకుడు, యూనిట్ సభ్యులు ఎక్కడా రాజీ పడటం లేదట. అందుకే సినిమా విడుదల వాయిదా పడ్డా పర్వాలేదు కానీ క్వాలిటీ బెస్ట్‌గా ఉండాలని, ప్రేక్షకులకు అద్భుతమైన విజువల్ వండర్‌ను ఇవ్వాలనే పట్టుదలతో దర్శకుడు బుచ్చిబాబు ఉన్నాడని ఆయన సన్నిహితులు అంటున్నారు. ఈ ఏడాది మార్చిలో విడుదల చేయాలని భావించిన పెద్ది సినిమాను మొదటి సారి వాయిదా వేశారు. ఆ సమయంలో పవన్ కళ్యాణ్ సినిమాను విడుదల చేయడం జరిగింది. మార్చి చివరి వారంలో విడుదల కావాలి అనుకున్న సినిమాలు పెద్ది కారణంగా వాయిదా పడ్డాయి. కానీ పెద్ది వాయిదా పడ్డా కూడా ఆ సినిమాలను విడుదల చేయలేక పోయారు. మీడియం రేంజ్ హీరోల సినిమాలు కొన్ని పెద్ది సినిమాకు రెండు వారాల ముందు కానీ, రెండు వారాల తర్వాత కానీ రావాలి అనుకోవడంతో చాలా సినిమాలను వాయిదా వేయాల్సి వచ్చింది. ఇప్పుడు పెద్ది సినిమాను మరోసారి వాయిదా వేయడం జరిగింది. ఈసారి రెండు నెలల గ్యాప్ తీసుకోవాలని దర్శకుడు ప్లాన్ చేశాడు. దాంతో ఏప్రిల్ చివర్లో రావాలి అనుకున్న సినిమాలన్నీ పెద్ది కారణంగా వాయిదా పడ్డాయి. వాటి వర్క్‌ను మెల్లగా నడిపిస్తున్నారు. ఇప్పుడు పెద్ది వాయిదా పడ్డ అవి వచ్చే పరిస్థితి లేదు. పెద్ది సినిమాను ఈనెల 30న విడుదల చేయాలని నిర్ణయించారు. కానీ పరిస్థితులు అనుకూలించని కారణంగా వాయిదా వేస్తున్నట్లు తెలుస్తోంది. అయితే కొత్త తేదీని దర్శకుడు, నిర్మాతలు ప్రకటించలేదు.

## రేణూ బ్రెయిన్‌లో లాంగ్వేజ్ మిక్సీ



రేణూ బ్రెయిన్‌లో లాంగ్వేజ్ మిక్సీతెలుగు సినీ పరిశ్రమలో తనదైన గుర్తింపును సంపాదించుకున్న రేణు దేశాయ్ మరోసారి వార్తల్లో నిలిచారు. తాజాగా ఇచ్చిన ఓ ఇంటర్వ్యూలో ఆమె తన వ్యక్తిగత జీవితం, ముఖ్యంగా భాషల మేళవింపుతో కూడిన తన పెరుగుదల గురించి ఆసక్తికర విషయాలు వెల్లడించారు. ఆమె తల్లి రాజస్థానీ, తండ్రి గుజరాతీ కావడంతో కుటుంబంలో భిన్న సంస్కృతుల సమ్మేళనం కనిపించేదని తెలిపారు. అయితే, ఇద్దరికీ ఒకరి భాష మరొకరికి రాకపోవడంతో వారు హిందీలో సంభాషించుకునేవారని చెప్పారు. అదే సమయంలో ఇంట్లో పిల్లలతో మాట్లాడేటప్పుడు మాత్రం మరాఠీనే ఉపయోగించేవారని ఆమె గుర్తుచేసుకున్నారు. పూణేలో పుట్టి పెరిగిన రేణు దేశాయ్, తనను తాను మహారాష్ట్ర అమ్మాయిగా భావిస్తానని చెప్పడం గమనార్హం. ఈ బహుభాషా వాతావరణం తన వ్యక్తిత్వాన్ని ఎంతగానో ప్రభావితం చేసిందని, తన ఆలోచనల్లోనే భాషల మిక్సింగ్ సహజంగా జరుగుతుందని ఆమె వివరించారు. ఈ భాషా మేళవింపే తనకు ఒక ప్రత్యేకతగా మారిందని రేణు అభిప్రాయపడ్డారు. ఇంగ్లీష్, హిందీ, తెలుగు, మరాఠీ, మార్వాడీ.. ఈ ఐదు భాషల్లో తాను సులభంగా మాట్లాడగలగడం తనకు ఒక అదనపు బలం అని పేర్కొన్నారు. అయితే, ఏ సందర్భంలో ఏ భాష మాట్లాడాలో నిర్ణయించుకోవడం కొన్నిసార్లు తనకు సవాలుగా మారుతుందని ఆమె సరదాగా చెప్పారు. ఈ అనుభవం తన వ్యక్తిగత జీవితంతో పాటు తన నటనా ప్రయాణంలో కూడా ప్రభావం చూపిందని చెప్పవచ్చు. ముఖ్యంగా భిన్న ప్రాంతాల ప్రేక్షకులతో కనెక్ట్ కావడంలో ఈ బహుభాషా పరిజ్ఞానం తనకు ఉపయోగపడిందని పరిశ్రమ వర్గాలు విశ్లేషిస్తున్నాయి. భాషలు మాత్రమే కాదు, వివిధ సంస్కృతులపై అవగాహన కూడా ఆమె వ్యక్తిత్వాన్ని మరింత సమృద్ధిగా మలిచిందని చెప్పాలి. ఇక ఆమె సినీ ప్రయాణం విషయానికి వస్తే, హీరోయిన్‌గా ఒక దశలో మంచి గుర్తింపు పొందిన రేణు దేశాయ్ పెళ్లి తర్వాత సినిమాలకు దూరమయ్యారు.



# ట్రాఫిక్ పోలీసులకు చలువ అద్దాలు అందచేసిన జిల్లా ఎస్పీ

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

జయశంకర్-భూపాలపల్లి, ఏప్రిల్ 17 : వేసవి తీవ్రతను దృష్టిలో ఉంచుకుని ట్రాఫిక్ పోలీసుల ఆరోగ్య రక్షణ కోసం జయశంకర్జి-భూపాలపల్లి జిల్లా ఎస్పీ సిరిశెట్టి సంకీర్త్ ట్రాఫిక్ సిబ్బందికి చలువ కళ్లద్దాలు శుక్రవారం అందజేశారు. ఈ సందర్భంగా ఎండలో విధులు నిర్వహిస్తున్న సిబ్బంది తగిన జాగ్రత్తలు పాటిస్తూ, తరచూ నీరు తీసుకోవాలని సూచించారు. ప్రజల భద్రత కోసం నిరంతరం సేవలందిస్తున్న ట్రాఫిక్ సిబ్బందికి అవసరమైన సౌకర్యాలు కల్పించేందుకు పోలీస్ శాఖ ఎల్లప్పుడూ కట్టుబడి ఉందని తెలిపారు.

# పెన్షనర్ల సమస్యలపై గళమెత్తిన ఉద్యోగ, గెజిటెడ్ అధికారులు

**- జయశంకర్-భూపాలపల్లి జిల్లాలో టిజిఈజేఏసీ ఆధ్వర్యంలో నిరసన ప్రదర్శన.**



(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

జయశంకర్-భూపాలపల్లి, ఏప్రిల్ 17:తెలంగాణ రాష్ట్ర ఉద్యోగ, ఉపాధ్యాయ, కార్మిక, పెన్షనర్ల జాయింట్ యాక్షన్ కమిటీ పిలుపు మేరకు భూపాలపల్లి జిల్లా కలెక్టర్ కార్యాలయం ఐడీఓసీ ప్రాంగణంలో శుక్రవారం నిరసన ప్రదర్శన నిర్వహించారు. ఉదయం నుంచే నల్ల బ్యాడ్జీలు ధరించి విధులకు హాజరైన ఉద్యోగులు, మధ్యాహ్న భోజన విరామ సమయంలో కార్యాలయ ప్రాంగణంలో ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా జేఏసీ జిల్లా చైర్మన్ బూరుగు రవికుమార్ మాట్లాడుతూ, 30 నెలలు దాటినా పీఆర్సీ అమలు చేయకపోవడం దురదృష్టకరమని విమర్శించారు. ఉద్యోగులకు ఎంప్లాయీస్ హెల్త్ స్కీమ్‌ను వెంటనే అమలు చేయాలని, ప్రతి నెలా రూ.1500 కోట్లు విడుదల చేసి పెండింగ్ బకాయిలను చెల్లించాలని డిమాండ్ చేశారు. జేఏసీ కన్వీనర్ విజయలక్ష్మి మాట్లాడుతూ, కాంట్రిబ్యూటరీ పెన్షన్ స్కీమ్ (సీపీఎస్) స్థానంలో పాత పెన్షన్ విధానం (ఓపీఎస్)ను పునరుద్ధరించాలని కోరారు. ఉపాధ్యాయ సంఘాల నాయకులు మాట్లాడుతూ, ఉపాధ్యాయులకు రావలసిన ఆర్థిక ప్రయోజనాలు ఎన్నాళ్లుగానో పెండింగ్‌లో ఉన్నాయని, వెంటనే వాటిని చెల్లించాలని డిమాండ్ చేశారు. పీఆర్టీయూ జిల్లా అధ్యక్షుడు ఆర్. శుభాకర్ రెడ్డి, డీటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి మాట్లాడుతూ పీఆర్సీ నివేదికలను వెంటనే విడుదల చేసి జూన్ 2 నుంచి అమలు చేయాలని ప్రభుత్వాన్ని కోరారు. సీపీఎస్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు దిల్షాద్ మాట్లాడుతూ సీపీఎస్ రద్దు చేసి పాత పెన్షన్ విధానం అమలు చేయాలని డిమాండ్ చేశారు. జిల్లా రెవెన్యూ ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు రామ్మోహన్ మాట్లాడుతూ పెండింగ్‌లో ఉన్న ఐదు డీఏలను వెంటనే విడుదల చేయాలని కోరగా, పెన్షనర్ల సంఘ నాయకులు ఐలయ్య పెన్షనర్లకు సంబంధించిన బెనిఫిట్స్ తక్షణమే చెల్లించాలని డిమాండ్ చేశారు. హెల్త్ కార్డులను వెంటనేఅమలు చేయాలని ఉద్యోగ, ఉపాధ్యాయ నాయకులు మధుసూదన్, శ్రీనివాస్ సూచించారు. ఉద్యోగుల పీఎఫ్ నిధులను విడుదల చేయడంలో జరుగుతున్న ఆలస్యం అన్యాయమని, రాష్ట్ర ఖజానాలో దాదాపు రూ.10 వేల కోట్లకు పైగా పెండింగ్ బిల్లులను ఒకేసారి చెల్లించాలని టీఎన్జీఓస్ నాయకులు డిమాండ్ చేశారు. కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులకు ప్రతి నెల మొదటి తేదీన వేతనాలు చెల్లించేలా చర్యలు తీసుకోవాలని కోరారు. అదేవిధంగా, ప్రభుత్వానికి సమర్పించిన 64 డిమాండ్లను వెంటనే పరిష్కరించాలని జేఏసీ నాయకులు స్పష్టం చేశారు. ఈ నిరసన కార్యక్రమంలో వివిధ సంఘాల నాయకులు, ఉద్యోగులు, ఉపాధ్యాయులు, పెన్షనర్లు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# మీడియా అకాడమీ చైర్మన్ కే.శ్రీనివాస్ రెడ్డికి ఘన సన్మానం

**- రెండవసారి భాధ్యతలు చేపట్టినందుకు సన్మానించిన ఐజేయూ భూపాలపల్లి జిల్లా కమిటీ**



(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

జయశంకర్ భూపాలపల్లి, ఏప్రిల్ 17:తెలంగాణ యూనియన్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్ట్స్ (ఐజేయూ) జయశంకర్ భూపాలపల్లి జిల్లా కమిటీ ఆధ్వర్యంలో తెలంగాణ మీడియా అకాడమీ చైర్మన్ కే. శ్రీనివాస్ రెడ్డిని ఘనంగా సన్మానించారు. ఈ సన్మాన కార్యక్రమం హైదరాబాద్‌లో గురువారం నిర్వహించిన ఐజేయూ రాష్ట్ర స్థాయి ఎగ్జిక్యూటివ్ సమావేశంలో జరిగింది. జయశంకర్-భూపాలపల్లి జిల్లా ఐజేయూ అధ్యక్షుడు క్యాతం సతీష్ కుమార్, ప్రధాన కార్యదర్శి సామంతు శ్యామ్ నేతృత్వంలో జరిగిన ఈ సన్మాన కార్యక్రమంలో, రాష్ట్ర అధ్యక్షుడు విరహత్ అలీ ఆధ్వర్యంలో కే.శ్రీనివాస్ రెడ్డికి పుష్పగుచ్ఛం అందజేసి శాలువాతో సత్కరించారు. ఆయన రెండోసారి తెలంగాణ మీడియా అకాడమీ చైర్మన్‌గా బాధ్యతలు స్వీకరించిన సందర్భంగా ఈ సన్మానం నిర్వహించారు. ఈ సందర్భంగా కే.శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ, జర్నలిస్టుల అక్రిడిటేషన్ ప్రక్రియను వేగవంతం చేయడానికి చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. వర్కింగ్ జర్నలిస్టులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా ప్రభుత్వం కట్టుబడి పనిచేస్తోందని, జర్నలిస్టులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని స్పష్టం చేశారు. గతంతో పోలిస్తే ప్రస్తుతం ఎక్కువ సంఖ్యలో అక్రిడిటేషన్లు మంజూరు చేస్తున్నామని వివరించారు. జిల్లా అధ్యక్షుడు క్యాతం సతీష్ కుమార్ మాట్లాడుతూ, జర్నలిస్టుల సంక్షేమం, మీడియా రంగ అభివృద్ధి కోసం కే. శ్రీనివాస్ రెడ్డి చేస్తున్న కృషి ప్రశంసనీయమని పేర్కొన్నారు. భవిష్యత్తులో కూడా జర్నలిస్టుల హక్కుల పరిరక్షణ, సంక్షేమం కోసం మరింత కృషి చేయాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో జిల్లాకు చెందిన పలువురు జర్నలిస్టులు, ప్రతినిధులు, నాయకులు పాల్గొన్నారు.

# ముఖ్యమంత్రి పర్యటన నేపథ్యంలో పకడ్బంది ఏర్పాటు చేయాలి

**- రెండో విడత రైతు భరోసా నిధులు జిల్లా నుంచే ప్రారంభం - జయశంకర్-భూపాలపల్లి జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ**



(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

జయశంకర్-భూపాలపల్లి, ఏప్రిల్ 17:జిల్లాలో ఈ నెల 20వ తేదీన రాష్ట్ర ముఖ్యమంత్రి పర్యటన నేపథ్యంలో అన్ని ఏర్పాట్లు పకడ్బందీగా చేయాలని జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ అధికారులను ఆదేశించారు. శుక్రవారం ఐడిఓసి కార్యాలయంలో నిర్వహించిన సమీక్షా సమావేశంలో కలెక్టర్ మాట్లాడుతూ, రాష్ట్రవ్యాప్తంగా రెండో విడత రైతు భరోసా నిధుల మంజూరు కార్యక్రమాన్ని మన జిల్లా నుంచే ప్రారంభించనున్నందున అన్ని శాఖలు సమన్వయంతో పని చేయాలని తెలిపారు. మేడిగడ్డ, కాళేశ్వరం దేవస్థాన ఆలయ పునరుద్ధరణ పనులకు శంకుస్థాపనతో పాటు, కాటారం మండలం నస్తూర్‌పల్లిలో నిర్వహించనున్న బహిరంగ సభలో ముఖ్యమంత్రి పాల్గొననున్నారని పేర్కొన్నారు. ఈ సందర్భంగా సభా ప్రాంగణం, భద్రతా ఏర్పాట్లు, ట్రాఫిక్ నియంత్రణ, పార్కింగ్, తాగునీరు, విద్యుత్, వైద్య సదుపాయాలు తదితర అంశాలపై సంబంధిత శాఖలు ముందస్తు చర్యలు తీసుకోవాలని సూచించారు. అలాగే రైతు భరోసా నిధుల మంజూరు కార్యక్రమం సజావుగా జరిగేలా అవసరమైన ఏర్పాట్లు పూర్తి చేయాలని, ప్రజలకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ఈ సమావేశంలో కాటారం సబ్ కలెక్టర్ మయాంక్ సింగ్, అదనపు కలెక్టర్లు అశోక్ కుమార్, విజయలక్ష్మి, వ్యవసాయ అధికారి బాబూరావు, డిఆర్డీఓ బాలకృష్ణ వివిధ శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# అరైవ్-అలైవ్ కార్యక్రమంలో రోడ్డు భద్రతపై విస్తృత అవగాహన

**- ఉచిత కంటి పరీక్షలు, హెల్మెట్ల పంపిణీ**

**- పాల్గొన్న మల్టీ జోన్--1 ఐజీపీ ఎస్. చంద్రశేఖర్ రెడ్డి, జిల్లా కలెక్టర్, ఎస్పీ**





(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

భద్రాద్రి-కొత్తగూడెం, ఏప్రిల్ 17:తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన ప్రజాపాలన--ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణలో భాగంగా నిర్వహిస్తున్న "అరైవ్--అలైవ్" కార్యక్రమం కింద దమ్మపేట మండలంలోని వినాయక ఫంక్షన్ హాల్‌లో శుక్రవారం రోడ్డు భద్రతపై అవగాహన కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి మల్టీ జోన్--1 ఐజీపీ ఎస్.చంద్రశేఖర్ రెడ్డి (ఐపీఎస్), జిల్లా కలెక్టర్ అంకిత్, జిల్లా ఎస్పీ రోహిత్ రాజు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో భాగంగా ఆటో, లారీ డ్రైవర్లు మరియు ఇతర వాహనదారుల కోసం ఉచిత కంటి పరీక్షల శిబిరం నిర్వహించారు. అవసరమైన వారికి కళ్లజోళ్లు పంపిణీ చేశారు. రోడ్డు భద్రత, హెల్మెట్ వినియోగంపై విద్యార్థులకు అవగాహన కల్పిస్తూ పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు. అదేవిధంగా డ్రైవింగ్ లైసెన్స్ లేని వారికి దమ్మపేట పోలీసులు, మోటార్ వెహికల్ ఇన్స్పెక్టర్ సహకారంతో 10 మందికి లైసెన్సులు మంజూరు చేయించారు. గిరిజన గ్రామమైన పూసుకుంట (కొండరెడ్లు నివసించే గ్రామం)కు చెందిన 20 మంది యువకులకు ఐజీపీ, కలెక్టర్, ఎస్పీలు హెల్మెట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఐజీపీ చంద్రశేఖర్ రెడ్డి మాట్లాడుతూ, ప్రతి ఒక్కరూ రోడ్డు భద్రతా నియమాలను కచ్చితంగా పాటిస్తూ బాధ్యత గల పౌరులుగా మెలగాలని సూచించారు. రోడ్డు ప్రమాదాలు జరిగినప్పుడు గోల్డెన్ అవర్‌లో వెంటనే సహాయం అందిస్తే ప్రాణాలు కాపాడవచ్చని తెలిపారు. డిఫెన్సివ్ డ్రైవింగ్ పద్ధతులు పాటించడం ద్వారా ప్రమాదాలను గణనీయంగా తగ్గించవచ్చని చెప్పారు. ఈ కార్యక్రమంలో పాల్వంచ డీఎస్పీ సతీష్ కుమార్, అశ్వారావుపేట సీఐ నాగరాజు రెడ్డి, దమ్మపేట ఎస్సై కిషోర్ రెడ్డి, పోలీసు సిబ్బంది, వివిధ గ్రామాల సర్పంచులు, పంచాయతీ కార్యదర్శులు, అంగన్వాడీ టీచర్లు, ఆశా కార్యకర్తలు, విలేజ్ రోడ్ సేఫ్టీ కమిటీ సభ్యులు, ప్రజా ప్రతినిధులు, రాజకీయ నాయకులు, స్థానిక ప్రముఖులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# బాల్యవివాహాలను అంతం చేద్దాం - ఆడపిల్లలకు బంగారు భవిష్యత్తును అందిద్దాం

**- జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారిని విద్యా చందన - బాల్య వివాహాలకు వ్యతిరేకంగా గోడ పత్రిక ఆవిష్కరణ**



(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

భద్రాద్రి-కొత్తగూడెం, ఏప్రిల్ 17: 'బాల్యవివాహాలను అంతం చేద్దాం - ఆడపిల్లలకు బంగారు భవిష్యత్తును అందిద్దాం' అని భద్రాద్రి జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారిని విద్యా చందన పిలుపునిచ్చారు. ఎయిడ్ సంస్థ వారి ఆధ్వర్యంలో జస్ట్ రైట్స్ ఫర్ చిల్డ్రన్ వారి సౌజన్యంతో బాల్య వివాహాల నిర్మూలనకై శుక్రవారం గోడ పత్రికను ఆవిష్కరించారు. బాల్య వివాహాల నిర్మూలనకై అందరూ నడుం బిగించాలని బాలల యొక్క భవిష్యత్తుకు ఎంతో కీలకంగా అని, బాల్య వివాహాలు అనేవి ఒక సామాజిక దురాచారం, అనదిగా కొనసాగుతున్నటువంటి ఈ సాంఘిక దురాచారాన్ని అందరం కలిసి సమూలంగా నిర్మూలించాలని బాల్య వివాహం అనేదే లేని భద్రాద్రి కొత్తగూడెం జిల్లాకై నిరంతరం శ్రమించాలని విద్యాచందన పిలుపునిచ్చారు. ఈనెల 19న అక్షయ తృతీయ సందర్భంగా యాక్షన్ ఫర్ ఇంటిగ్రేటెడ్ డెవలప్మెంట్ (ఎయిడ్) సంస్థ ఆధ్వర్యంలో రూపొందించిన గోడ పత్రికను ఆమె భద్రాద్రి జిల్లా కలెక్టరేట్ లోని తన చాంబర్లో ఆవిష్కరించారు. జిల్లా యంత్రాంగం ఆధ్వర్యంలో అనునిత్యం గ్రామస్థాయిలో అవగాహన కార్యక్రమాలను ఏర్పాటు చేస్తున్నామని బాలల పరిరక్షణ విభాగం ద్వారా బాలలకు సేవలను అందిస్తున్నట్లు తెలిపారు . చిన్న వయసులోనే వివాహం చేయడం వల్ల బాలికలకు శారీరక మానసిక ఆరోగ్య రుగ్మతలు వస్తాయని సరైన పరిపక్వత లేక పుట్టే పిల్లలు కూడా అనేక రకాల లోపాలతో పుట్టడం వల్ల జీవితాంతం ఆ మనోవేదన అనుభవించాల్సి వస్తుందని కొన్ని సందర్భాలలో మాత శిశు మరణాలు కూడా జరుగుతాయని ఈ నష్టాల వలన స్త్రీ పురుష నిష్పత్తి కూడా గణనీయంగా పడిపోతుందని జిల్లా సంక్షేమ అధికారిని ఆఫీసర్ స్వర్ణలత లెనినా తెలిపారు. ఈ కార్యక్రమంలో డి.సమ్మక్క డిపిఎం, నర్మద డీపీఎం, అనురాధ ఏపిఎం, ఎయిడ్ సంస్థ జిల్లా కోఆర్డినేటర్ వి.రాజేష్ కమ్యూనిటీ సోషల్ మొబిలైజర్స్ మోహన్, మాన్సింగ్, జ్యోతి, మౌనిక, తదితరులు పాల్గొన్నారు.

# ఆరోగ్య సూత్రాలు పాటిస్తేనే ఆరోగ్యవంతమైన జీవితం

**- డీఎంహెచ్ఓ డా.తుకారాం రాథోడ్**



(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

భద్రాద్రి-కొత్తగూడెం, ఏప్రిల్ 17: గ్రామీణ ప్రాంతాల్లో ఆరోగ్య అవగాహన పెంపు, సమతుల ఆహారం, శారీరక శ్రమ, యోగాభ్యాసం వంటి ఆరోగ్య సూత్రాలు పాటించడం ద్వారా వ్యాధులను దూరం చేసుకోవచ్చని భద్రాద్రి కొత్తగూడెం జిల్లా డీఎంహెచ్ఓ డా.తుకారాం రాథోడ్ సూచించారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా వైద్య ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో శుక్రవారం కొత్తగూడెం డివిజన్ సూపర్వైజర్లు, ఎంఎల్హెచ్‌పీల నెలవారీ సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా డీఎంహెచ్ఓ డా. తుకారాం రాథోడ్ మాట్లాడుతూ మారుమూల గ్రామాల్లో ఆయుష్మాన్ ఆరోగ్య మందిర్ సేవలను పటిష్టంగా అమలు చేయాలని సూచించారు. గ్రామీణ ప్రజల్లో ఆరోగ్యంపై అవగాహన పెంపొందించడం ద్వారా అనారోగ్య సమస్యలను తగ్గించవచ్చున్నారు. సమతుల ఆహారం తీసుకోవడం, ఆకుకూరలు, పండ్లు, కూరగాయలు, తృణధాన్యాలు, వృక్షాధారిత ప్రోటీన్లను ఆహారంలో భాగం చేసుకోవాలని సూచించారు. జీవనశైలి మార్పులతో బీపీ, షుగర్ వంటి వ్యాధులను నియంత్రించవచ్చని తెలిపారు. ప్రతి నెల ఆయుష్మాన్ ఆరోగ్య మందిరాల్లో 12 రకాల ఆరోగ్య కార్యకలాపాలు నిర్వహించి ప్రజలకు ఆరోగ్య విద్య బోధించాలని ఆదేశించారు. యోగాసనాలు, నడక, సైక్లింగ్, ప్రాణాయామం వంటి వ్యాయామాలు చేయడం ద్వారా ఆరోగ్యం మెరుగుపడుతుందని, గర్భిణీలకు సాధారణ ప్రసవాలు జరిగే అవకాశాలు పెరుగుతాయని చెప్పారు. పెయిన్ కిల్లర్ మందుల వినియోగాన్ని తగ్గించి ఫిజియోథెరపీ ద్వారా నొప్పులను నియంత్రించుకోవాలని సూచించారు. కొత్తగూడెం ప్రభుత్వ సర్వజన ఆసుపత్రిలో పాలియేటివ్ కేర్ సేవలు అందుబాటులో ఉన్నాయని, దీర్ఘకాలిక రోగులు, ప్రమాద బాధితులు ఈ సేవలను వినియోగించుకోవాలని కోరారు. ఎండాకాలం నేపథ్యంలో ఉదయం 11 గంటల లోపు పనులు ముగించుకోవాలని, మధ్యాహ్న సమయంలో ఎండకు వెళ్లకుండా జాగ్రత్తలు తీసుకోవాలని, తగినంత నీరు, ఓఆర్ఎస్ తీసుకోవాలని సూచించారు. మారుమూల ప్రాంతాల్లో గర్భిణీలకు ముందస్తు బర్త్ ప్లాన్ చేయాలని తెలిపారు. అదేవిధంగా, ఆరోగ్య సిబ్బంది కంప్యూటర్ పరిజ్ఞానం పెంపొందించుకొని ఆన్‌లైన్ డేటా నమోదు, జాతీయ ఆరోగ్య కార్యక్రమాలపై పూర్తి అవగాహన కలిగి ఉండాలని సూచించారు. విద్యాసంస్థల్లో విద్యార్థులకు ఆరోగ్య విద్య, వ్యక్తిగత పరిశుభ్రతపై అవగాహన కల్పించాలని తెలిపారు. గర్భాశయ క్యాన్సర్ నివారణకు 14--15 సంవత్సరాల మధ్య బాలికలకు హెచ్‌పీవీ వ్యాక్సిన్ తప్పనిసరిగా వేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ సాయి కళ్యాణ్, డిప్యూటీ డీఎంహెచ్ఓ డాక్టర్ ప్రసాద్, డాక్టర్ ప్రతాప్, డాక్టర్ రామదాసు, డాక్టర్ దినేష్, డాక్టర్ రాకేష్, డాక్టర్ హరీష్ తదితరులు పాల్గొని ఆరోగ్య కార్యక్రమాలపై సమీక్ష నిర్వహించారు. జూలూరుపాడు ఆరోగ్య కేంద్రాన్ని సందర్శించి హెచ్‌పీవీ వ్యాక్సిన్‌పై అవగాహన కల్పించారు.

# తెలంగాణ ఏర్పాటుపై తేజస్వి సూర్య వ్యాఖ్యలను వెనక్కు తీసుకోవాలి : ఎంపీ వద్దిరాజు రవిచంద్ర

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

ఖమ్మం, ఏప్రిల్ 17: తెలంగాణ రాష్ట్ర ఏర్పాటును దేశ విభజనతో పోల్చుతూ బీజేపీ ఎంపీ తేజస్వి సూర్య చేసిన వ్యాఖ్యలు తీవ్రంగా అభ్యంతరకరమని, వెంటనే వాటిని వెనక్కి తీసుకుని తెలంగాణ ప్రజలకు క్షమాపణలు చెప్పాలని బీఆర్ఎస్ రాజ్యసభ సభ్యుడు వద్దిరాజు రవిచంద్ర డిమాండ్ చేశారు. తెలంగాణ రాష్ట్ర ఏర్పాటుపై కర్నాటకకు చెందిన బీజేపీ ఎంపీ తేజస్వి సూర్య చేసిన వ్యాఖ్యలను బీఆర్ఎస్ పార్లమెంటరీ పార్టీ డిప్యూటీ లీడర్, రాజ్యసభ సభ్యుడు వద్దిరాజు రవిచంద్ర తీవ్రంగా ఖండించారు. శుక్రవారం ఢిల్లీలో విలేఖరులతో మాట్లాడుతూ ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. మహానేత కల్వకుంట్ల చంద్రశేఖర రావు 14 సంవత్సరాల పాటు నిరంతర ఉద్యమాన్ని నడిపి దేశంలోని రాజకీయ పార్టీలన్నింటినీ ఒప్పించి ప్రత్యేక తెలంగాణ రాష్ట్రాన్ని సాధించారని తెలిపారు. ఇది ప్రజల చిరకాల ఆకాంక్ష నెరవేర్చిన చారిత్రక ఘట్టమని పేర్కొన్నారు. తెలంగాణ ఏర్పాటును బ్రిటీష్ కాలంలో జరిగిన దేశ విభజన, పాకిస్తాన్ ఏర్పాటుతో పోల్చడం పూర్తిగా అనుచితమని విమర్శించారు. గతంలో ఆంధ్రప్రదేశ్ విభజనను 'బ్లాక్ డే'గా పేర్కొన్న వ్యాఖ్యలపై తెలంగాణ ప్రజలు తీవ్రంగా స్పందించిన విషయాన్ని గుర్తు చేశారు. తేజస్వి సూర్య చేసిన అభ్యంతరకర వ్యాఖ్యలను వెంటనే వెనక్కి తీసుకుని తెలంగాణ ప్రజలకు క్షమాపణలు చెప్పాలని ఎంపీ రవిచంద్ర డిమాండ్ చేశారు. మహిళా రిజర్వేషన్ బిల్లు ఇప్పటికే 2023లో పార్లమెంట్ ఆమోదం పొందిందని, దాన్ని 2024 ఎన్నికల్లోనే అమలు చేసి ఉంటే మంచిదని అభిప్రాయపడ్డారు. కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన సవరణ బిల్లుకు బీఆర్ఎస్ సంపూర్ణ మద్దతు ఇస్తుందని తెలిపారు. డీలిమిటేషన్ బిల్లుపై లోకసభలో జరిగే చర్చకు అనుగుణంగా పార్టీ తన అభిప్రాయం వెల్లడిస్తుందని చెప్పారు.

# 19న జెవివి ఆధ్వర్యంలో విద్యా సదస్సు

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

ఖమ్మం, ఏప్రిల్ 17:ఈ నెల 19న ఆదివారం ఖమ్మంలోని డిపిఆర్‌సి భవన్ (ఎసి)లో విద్యాసదస్సు నిర్వహిస్తున్నట్లు జనవిజ్ఞాన వేదిక రాష్ట్ర ఉపాధ్యక్షులు అలవాల నాగేశ్వరరావు, జిల్లా అధ్యక్ష కార్యదర్శులు వి.మోహన్, కె.రామారావు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 9.30 గంటలకు సదస్సు ప్రారంభమై మధ్యాహ్నం 1.00 గంటకు ముగుస్తుందన్నారు. ఎన్ఈపి-2020- ఉన్నత విద్య-తీరుతెన్నులు అంశంపై ప్రముఖ విశ్లేషకులు డాక్టర్ అందె సత్యం, ఎన్‌సిఎఫ్-2023-పాఠ్యాంశాల్లో మార్పులు అంశంపై విశ్రాంత ఆచార్యులు కోయ కోటేశ్వరరావు, తెలంగాణ పాఠశాల విద్య-సవాళ్లు అనే అంశంపై సొసైటీ ఫర్ ఛేంజ్ ఇన్ ఎడ్యుకేషన్, తెలంగాణ ప్రధాన కార్యదర్శి ఎడమ శ్రీనివాసరెడ్డి ప్రసంగిస్తారని తెలిపారు. ఈ విద్యా సదస్సుకు జనవిజ్ఞాన వేదిక రాష్ట్ర అధ్యక్షులు చెలిమల రాజేశ్వర్, ప్రధాన కార్యదర్శి శ్రీరాజా రాజా హాజరవుతారని తెలిపారు. విద్యాభిమానులు, విద్యావేత్తలు ఈ సదస్సుకు హాజరై జయప్రదం చేయాలని కోరారు.

# ఈనెల 26న కొత్తగూడెంలో "హిందూ సమ్మేళనం"

## పోలీసు అధికారులను ఆహ్వానించిన కమిటీ

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

భద్రాద్రి-కొత్తగూడెం, ఏప్రిల్17:భద్రాద్రి జిల్లా కొత్తగూడెం పట్టణంలోని సింగరేణి ప్రకాశం స్టేడియంలో ఈనెల 26 న నిర్వహించనున్న "హిందూ సమ్మేళనం" కార్యక్రమానికి సంబంధించి, సమ్మేళనం కమిటీ సభ్యులు మరింత కార్యాచరణను వేగవంతం చేస్తున్నారు. ఈ సందర్భంగా హిందూ సమ్మేళనం కమిటీ సభ్యులు శుక్రవారం కొత్తగూడెం డి.ఎస్.పి ని మర్యాదపూర్వకంగా కలిసి, సమ్మేళనం కార్యక్రమానికి ఆహ్వానం అందజేశారు. కార్యక్రమం యొక్క లక్ష్యాలు, ఏర్పాట్లు మరియు ప్రజల పాల్గొనిక గురించి వివరించారు. కమిటీ ప్రతినిధులు మాట్లాడుతూ, హిందూ సమాజంలో ఐక్యత, ధర్మ పరిరక్షణ, సాంప్రదాయ విలువల పరిరక్షణ లక్ష్యంగా ఈ సమ్మేళనం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమం శాంతియుతంగా మరియు క్రమబద్ధంగా నిర్వహించబడుతుందని హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా డి.ఎస్.పి కార్యక్రమం గురించి తెలుసుకుని, చట్టపరమైన నిబంధనలు పాటిస్తూ కార్యక్రమాన్ని నిర్వహించాలని సూచించినట్లు తెలిసింది. ఈ సమావేశంలో కమిటీ అధ్యక్షులు పి. వీరవర్ధనరావు, కార్యదర్శి లట్టి జగన్ మోహన్, సభ్యులు యెలదండి పూర్ణచందర్ రావు, వెంకట్ రెడ్డి, రాజేశ్వరరావు, న్యాయవాది పాతూరి పాండురంగ విటల్ పాల్గొన్నారు. సమ్మేళనం కార్యక్రమానికి



సంబంధించిన ఏర్పాట్లు కొనసాగుతున్నాయని, స్థానిక ప్రజలు, యువత పెద్ద సంఖ్యలో పాల్గొనాలని కమిటీ పిలుపునిచ్చింది.

# రోడ్డు ప్రమాదాల్లో గోల్డెన్ అవర్ ప్రాముఖ్యతపై అవగాహన

## కొత్తగూడెంలో సీపీఆర్ శిక్షణతో ప్రజల్లో చైతన్యం



(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

భద్రాద్రి-కొత్తగూడెం, ఏప్రిల్ 17:ప్రజా పాలన-ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యక్రమం, రోడ్ సేఫ్టీ అవేర్‌నెస్ వీక్ కార్యక్రమంలో భాగంగా శుక్రవారం డీఎంహెచ్ఓ డా. తుకారాం రాథోడ్ భద్రాద్రి జిల్లా కొత్తగూడెం ఆర్‌టిఓ కార్యాలయాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా రోడ్డు ప్రమాదాల్లో ప్రాణాలను కాపాడటంలో అత్యంత కీలకమైన గోల్డెన్ అవర్ ప్రాముఖ్యతపై అవగాహన కల్పిస్తూ శిక్షణ నిర్వహించారు. ప్రమాదం జరిగిన వెంటనే సరైన సమయంలో చికిత్స అందించడం ద్వారా ప్రాణ నష్టం తగ్గించవచ్చని తెలిపారు. అలాగే డ్రైవర్లు, సాధారణ ప్రజలకు సీపీఆర్ (కార్డియో పల్మనరీ రెసుసిటేషన్)పై అవగాహన కార్యక్రమం నిర్వహించి, ప్రాక్టికల్ డెమో కూడా చూపించారు. అత్యవసర పరిస్థితుల్లో సీపీఆర్ వంటి ప్రాథమిక ప్రాణరక్షణ పద్ధతులు తెలుసుకోవడం ఎంత ముఖ్యమో వివరించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ ప్రతాప్ (ప్రోగ్రామ్ ఆఫీసర్, ఎంహెచ్ఎన్), డాక్టర్ సుందర్ (ఆర్‌బీఎస్‌కే మెడికల్ ఆఫీసర్)తో పాటు ఆర్‌టిఓ సిబ్బంది పాల్గొన్నారు. ఈ కార్యక్రమం ద్వారా ప్రమాద సమయంలో తక్షణ స్పందన, ప్రాణరక్షణ చర్యలపై ప్రజల్లో అవగాహన పెంపొందించడం లక్ష్యంగా పెట్టుకున్నట్లు అధికారులు తెలిపారు.

# నాగారంలో ఉద్రిక్తతకు దారి తీసిన అక్రమ ఇసుక వ్యవహారం

## బెదిరింపులపై పోలీసులకు ఫిర్యాదు




(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

పాల్వంచ, ఏప్రిల్ 17:పాల్వంచ మండలం నాగారం గ్రామంలో అక్రమ ఇసుక రవాణా వ్యవహారం వివాదానికి దారి తీసింది. ట్రాక్టర్ స్వాధీనం ఘటన తర్వాత పరస్పర ఆరోపణలు, బెదిరింపుల నేపథ్యంలో విలేఖరి నునావత్ రఘురాం పోలీసులకు ఫిర్యాదు చేశారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా పాల్వంచ మండలం నాగారం గ్రామంలో అక్రమ ఇసుక రవాణా వ్యవహారం ఉద్రిక్తతకు దారి తీసింది. ఆదివారం గ్రామపంచాయతీ సర్పంచ్ స్వప్న అక్రమంగా తరలిస్తున్న ఇసుక ట్రాక్టర్‌ను అడ్డుకుని పాల్వంచ రూరల్ పోలీసులకు సమాచారం అందించారు. ఘటనపై మీడియాకు సమాచారం ఇవ్వడంతో విలేఖరి నునావత్ రఘురాం అక్కడికి వెళ్లి వివరాలను సేకరించారు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనాస్థలానికి చేరుకుని ట్రాక్టర్‌ను స్వాధీనం చేసుకుని పోలీస్ స్టేషన్‌కు తరలించి కేసు నమోదు చేశారు. అయితే ఈ ఘటనకు సంబంధించి గురువారం పాల్వంచ మండల ప్రెస్ క్లబ్‌లో ట్రాక్టర్ యజమాని కాటారపు యేసు విలేఖరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సర్పంచ్ స్వప్న మరియు విలేఖరి రఘురాం తనను బ్లాక్‌మెయిల్ చేస్తున్నారని, డబ్బులు డిమాండ్ చేశారని ఆరోపించారు. ఫోన్ పే ద్వారా డబ్బులు చెల్లించినట్లు స్క్రీన్‌షాట్లు ఉన్నాయని పేర్కొన్నారు. ఈ ఆరోపణలను ఖండించిన నునావత్ రఘురాం, తన పరువును దెబ్బతీసే విధంగా తప్పుడు ప్రచారం చేస్తున్నారని, అలాగే రోడ్లపై కనిపిస్తే ట్రాక్టర్‌తో తొక్కిస్తానంటూ బెదిరింపులకు పాల్పడుతున్నారని శుక్రవారం పాల్వంచ రూరల్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ ఘటనపై పోలీసులు దర్యాప్తు చేపట్టినట్లు సమాచారం.

# ప్రజలు సైబర్ మోసాలు, రహదారి ప్రమాదాలపై అప్రమత్తంగా ఉండాలి

## - ఐజీపీ చంద్రశేఖర్ రెడ్డి

## - "అర్రైవ్ అలైవ్"తో రహదారి భద్రతపై విస్తృత అవగాహన




(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

భద్రాద్రి-కొత్తగూడెం, ఏప్రిల్ 17: ప్రజలు సైబర్ మోసాలు, రహదారి ప్రమాదాలపై అప్రమత్తంగా ఉండాలని ఐజీపీ చంద్రశేఖర్ రెడ్డి. సూచించారు. భద్రాద్రి-కొత్తగూడెం జిల్లాలో రహదారి ప్రమాదాలను తగ్గించేందుకు ప్రజల్లో అవగాహన అత్యంత కీలకమని అధికారులు పేర్కొన్నారు. "అర్రైవ్ అలైవ్" కార్యక్రమం ద్వారా ట్రాఫిక్ నియమాల పాటన, గోల్డెన్ అవర్ ప్రాముఖ్యతపై ప్రజలకు చైతన్యం కల్పించారు. ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణలో భాగంగా నిర్వహిస్తున్న రహదారి భద్రత వారోత్సవాల్లో భాగంగా శుక్రవారం దమ్మపేటలో పోలీస్ శాఖ ఆధ్వర్యంలో "అర్రైవ్ అలైవ్" కార్యక్రమం కింద అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఐజీపీ చంద్రశేఖర్ రెడ్డి, జిల్లా కలెక్టర్ అంకిత్, జిల్లా ఎస్పీ రోహిత్ రాజు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా రాష్ట్రం మరియు జిల్లాలో చోటుచేసుకున్న రహదారి ప్రమాదాలు, వాటి కారణాలు, తీసుకోవాల్సిన జాగ్రత్తలపై పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా అవగాహన కల్పించారు. గుడ్ సమారిటన్ విధానం, త్వరలో అమలులోకి రానున్న పీఎం అర్వాత్ పథకం గురించి వివరించారు. ఐజీపీ చంద్రశేఖర్ రెడ్డి మాట్లాడుతూ ప్రజలు సైబర్ మోసాలు, రహదారి ప్రమాదాలపై అప్రమత్తంగా ఉండాలని సూచించారు. డబ్బు కోల్పోతే తిరిగి సంపాదించవచ్చుగానీ, ప్రాణం కోల్పోతే తిరిగి రాదని హెచ్చరించారు. గత ఏడాది జిల్లాలో 248 మంది రహదారి ప్రమాదాల్లో ప్రాణాలు కోల్పోయారని తెలిపారు. మద్యం సేవించి వాహనం నడపడం, హెల్మెట్, సీట్ బెల్ట్ వినియోగం లోపించడం ప్రధాన కారణాలని పేర్కొన్నారు. జిల్లా కలెక్టర్ అంకిత్ మాట్లాడుతూ "అవగాహన ద్వారానే ప్రమాదాలను తగ్గించవచ్చు" అన్నారు. జిల్లాలో భారీ వాహనాల రాకపోకల దృష్ట్యా 38 బ్లాక్ స్పాట్లను గుర్తించి ప్రత్యేక చర్యలు చేపడుతున్నామని తెలిపారు. ప్రమాదం జరిగిన వెంటనే వైద్య సహాయం అందించేందుకు అంబులెన్స్ సేవలను బలోపేతం చేస్తున్నామని చెప్పారు. జిల్లా ఎస్పీ రోహిత్ రాజు మాట్లాడుతూ రోజుకు దేశవ్యాప్తంగా 500 మందికి పైగా రహదారి ప్రమాదాల్లో ప్రాణాలు కోల్పోతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. ట్రాఫిక్ నియమాలను పాటించడం ద్వారా ప్రమాదాలను గణనీయంగా తగ్గించవచ్చని పేర్కొన్నారు. అనంతరం రహదారి భద్రతపై నిర్వహించిన వ్యాసరచన పోటీల్లో విజేతలకు బహుమతులు అందజేశారు. కొంతమందికి డ్రైవింగ్ లైసెన్సులు పంపిణీ చేయడంతో పాటు గిరిజనులకు హెల్మెట్లు అందించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ పగడాల రమాదేవి, మార్కెట్ కమిటీ చైర్మన్, పాల్వంచ డీఎస్పీ సతీష్, తహసీల్దార్ రామ్ నరేష్, ఎంపీడీవో రవీందర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# తెలంగాణను అవమానించిన బీజేపీ ఎంపీ తేజస్వి సూర్య వెంటనే క్షమాపణ చెప్పాలి

## - తెలంగాణ ఆత్మగౌరవాన్ని పార్లమెంట్ సాక్షిగా అవమానించిన బీజేపీ - తెలంగాణ అంటే త్యాగం...అవమానిస్తే ప్రతిఘటన తప్పదు - సీపీఐ భద్రాద్రి జిల్లా కార్యవర్గ సభ్యులు ఉప్పుశెట్టి రాహుల్

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

పాల్వంచ, ఏప్రిల్ 17:తెలంగాణ రాష్ట్ర ఏర్పాటును దేశ విభజనతో పోల్చుతూ అవమానకర వ్యాఖ్యలు చేసిన బీజేపీ ఎంపీ తేజస్వి సూర్య వెంటనే తన వ్యాఖ్యలను వెనక్కి తీసుకుని తెలంగాణ ప్రజలకు బేషరతుగా క్షమాపణ చెప్పాలని సీపీఐ భద్రాద్రి జిల్లా కార్యవర్గ సభ్యులు ఉప్పుశెట్టి రాహుల్ డిమాండ్ చేశారు. శుక్రవారం ఒక ప్రకటన ద్వారా రాహుల్ తన అభిప్రాయం తెలియజేస్తూ దశాబ్దాల పాటు సాగిన ప్రజాస్వామ్య పోరాటం, వేలాది మంది అమరవీరులు త్యాగాలతో తెలంగాణ రాష్ట్రం ఏర్పడిందని ఆయన గుర్తు చేశారు. ఎవరి దయతో కాదు, వేలాది మంది విద్యార్థులు, యువకులు, ఉద్యోగులు, కళాకారులు, గిరిజనులు, సబ్బండ వర్గాలు చేసిన పోరాటాలతో, బలిదానాలతో సాధించుకున్న హక్కన్నారు. తెలంగాణ ఉద్యమ చరిత్రలో శ్రీకాంత్ చారి, సిరిపురం యాదయ్య, కానిస్టేబుల్ కృష్ణయ్య, భోజ్య నాయక్, ప్రవీణ్ నాయక్ వంటి అనేకమంది అమరుల త్యాగాలు ఈ నేల గుండెల్లో చిరస్థాయిగా నిలిచాయిని అలాంటి పవిత్ర పోరాటాన్ని భారత్-పాకిస్థాన్ విభజనతో పోల్చడం అత్యంత అవివేకమన్నారు. అయన వ్యాఖ్యలు తెలంగాణ ఆత్మగౌరవాన్ని దెబ్బతీసే విధంగా ఉన్నాయని మండిపడ్డారు. తెలంగాణ పోరాట చరిత్ర తెలియకుండా మాట్లాడిన ఎంపీ చేసిన అనుచిత వ్యాఖ్యలను తీవ్రంగా ఖండించారు. పార్లమెంట్ లో తెలంగాణపై ఇలాంటి వ్యాఖ్యలు వచ్చినప్పటికీ, తెలంగాణకు చెందిన ఎంపీలు మౌనంగా ఉండడం సిగ్గుచేటని ఆయన విమర్శించారు. తెలంగాణ అంటే త్యాగం, తెలంగాణ అంటే పోరాటం, తెలంగాణ అంటే స్వాభిమానానికి ప్రతీకని ఆ స్వాభిమానాన్ని కాపాడుకోవడానికి తెలంగాణ సమాజం ఎప్పుడూ సిద్ధంగా ఉంటుంది. బీజేపీ నాయకులు వెంటనే తమ వ్యాఖ్యలను వెనక్కి తీసుకుని రాష్ట్ర గౌరవాన్ని కాపాడే బాధ్యత ప్రజాప్రతినిధులపై ఉందని, అలాంటి సమయంలో మౌనం అనేది తెలంగాణ ప్రజల భావోద్వేగాలను అవమానించడమేనన్నారు. బీజేపీ పార్టీ నాయకులు పదేపదే తెలంగాణపై వ్యతిరేక భావజాలాన్ని వ్యక్తం చేస్తూ ప్రజల ఆత్మగౌరవాన్ని దెబ్బతీస్తున్నారని ఆరోపించారు. తేజస్వి సూర్య వ్యాఖ్యల పై బీజేపీ పార్టీ కూడా స్పష్టమైన వైఖరి ప్రకటించి తెలంగాణ ప్రజలకు క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు.




# ప్రభుత్వ అధికారులు ప్రజల సమస్యలను పట్టించుకోవటం లేదు

## సేవాలాల్ సేన జిల్లా అధ్యక్షులు ధరావత్ సురేష్ నాయక్ ఆరోపణ

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

టేకులపల్లి, ఏప్రిల్ 17:భద్రాద్రి-కొత్తగూడెం జిల్లాలో ప్రజాస్వామ్య వ్యవస్థకు మనుగడ కరువైందని, కొందరు అధికారులు తమ బాధ్యతను విస్మరించి వ్యవహరిస్తున్నారని సేవాలాల్ సేన జిల్లా అధ్యక్షుడు ధరావత్ సురేష్ నాయక్ అన్నారు. భద్రాద్రి జిల్లా టేకులపల్లి మండల కేంద్రంలో శుక్రవారం ప్రకటన విడుదల చేస్తూ ఆయన మాట్లాడారు. జిల్లాలోని వివిధ ప్రజా సమస్యలపై క్షేత్రస్థాయి నుంచి జిల్లా స్థాయి అధికారుల వరకు అనేకమార్లు అర్జీలు సమర్పించినా, ఒక్క సమస్య కూడా పరిష్కారం కావట్లేదు అన్నారు.ప్రజావాణి వంటి కార్యక్రమాలు కేవలం అర్జీలు తీసుకోవడానికే పరిమితమయ్యాయని, క్షేత్రస్థాయిలో ప్రజల కష్టాలు తీర్చే నాథుడే కరువయ్యారని ఆరోపించారు. నెలల తరబడి పెండింగ్‌లో ఉన్న ఫైళ్లను అధికారులు ఎందుకు పట్టించుకోవడం లేదన్నారు. ప్రజాస్వామ్యం అంటే కార్యాలయాల చుట్టూ తిరగడమేనా సామాన్యుడు తన హక్కుల కోసం కార్యాలయాల చుట్టూ కాళ్లు అరిగేలా తిరగాలా జవాబుదారీతనం ఎక్కడ ప్రభుత్వ జీతాలు తీసుకుంటూ, ప్రజల సమస్యలను గాలికొదిలేసే అధికారులపై ప్రభుత్వం ఎందుకు చర్యలు తీసుకోవడం లేదన్నారు. ప్రజాస్వామ్య పద్ధతిలో మేము చేస్తున్న విజ్ఞప్తులను బలహీనతగా భావించవద్దు అన్నారు. జిల్లా ఉన్నతాధికారులు స్పందించి, పెండింగ్‌లో ఉన్న అన్ని సమస్యలను యుద్ధప్రతిపాదికన పరిష్కరించాలి డిమాండ్ చేశారు. లేనిపక్షంలో సేవాలాల్ సేన ఆధ్వర్యంలో జిల్లా వ్యాప్తంగా పెద్ద ఎత్తున ఆందోళనలు చేయబడుతూ, కలెక్టరేట్ ముట్టడిస్తామన్నారు.



# ఖమ్మంలో 19న బీఆర్ఎస్ మినీ ప్లీనరీ విజయవంతం చేయాలి

## బొమ్మర్ల ప్రసాద్ గౌడ్

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)



టేకులపల్లి, ఏప్రిల్ 17: బీఆర్ఎస్ పార్టీ ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకుని ఈ నెల 19న ఖమ్మం పట్టణంలోని మమత కాలేజీ గ్రౌండ్‌లో నిర్వహించనున్న మినీ ప్లీనరీని జయప్రదం చేయాలని టేకులపల్లి మండల పార్టీ అధ్యక్షుడు బొమ్మర్ల వరప్రసాద్ గౌడ్ పిలుపునిచ్చారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ, ఉమ్మడి ఖమ్మం జిల్లాలో పార్టీ శక్తి, ఐక్యతను చాటేలా ఈ మినీ ప్లీనరీని ఘనంగా నిర్వహించేందుకు పార్టీ నిర్ణయించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమానికి బీఆర్ఎస్ పార్టీ రాష్ట్ర నాయకులు, మాజీ మంత్రి, సిద్ధిపేట ఎమ్మెల్యే తన్నీరు హరీష్ రావు ముఖ్య అతిథిగా హాజరవుతున్నారని పేర్కొన్నారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు రేగా కాంతారావు, మాజీ ఎమ్మెల్యే మరియు ఇల్లందు ఇంచార్జ్ బానోత్ హరిప్రియ సూచనల మేరకు టేకులపల్లి మండలంలోని అన్ని గ్రామాల పార్టీ నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొనాలని కోరారు.

# పిఆర్సి, ఫిట్మెంట్ వెంటనే ప్రకటించాలి-సిపిఎస్ ను రద్దు చేయాలి

## టిపిటిఎఫ్ జిల్లా అధ్యక్షులు గుగులోత్ హరిలాల్ నాయక్




(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

టేకులపల్లి, ఏప్రిల్ 17:రాష్ట్ర ప్రభుత్వఉద్యోగ,ఉపాధ్యాయ,పెన్షనర్లకు ఇవ్వాల్సిన పిఆర్సి ఫిట్మెంట్ ను ప్రకటించి వెంటనే అమలు చేయాలని తెలంగాణ ప్రోగ్రెస్ టీచర్స్ ఫెడరేషన్ భద్రాద్రి జిల్లా అధ్యక్షులు గుగులోత్ హరిలాల్ నాయక్ డిమాండ్ చేశారు. టీజీఇ.,జేఏసీ., ఆధ్వర్యంలో భద్రాద్రి జిల్లా టేకులపల్లి మండల పరిధిలోని ప్రభుత్వ గిరిజన సంక్షేమ ఆశ్రమ ఉన్నత పాఠశాల గంగారంలో శుక్రవారం మధ్యాహ్నం భోజన విరామ సమయంలో ప్రభుత్వంపై నిరసన కార్యక్రమాన్ని చేస్తూ ఆయన మాట్లాడారు. పెండింగ్ లో ఉన్న నాలుగు డీఏ.,లను వెంటనే విడుదల చేయాలని, రిటైర్ మెంట్ 13 వేల కోట్ల పెండింగ్ బిల్లులను వెంటనే వ్యక్తిగత ఖాతాలలో జమ చేయాలని అన్నారు .సిపిఎస్ ను రద్దు చేసి పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించాలని,సెప్టెంబర్ ఒకటి 2003 తరువాత నియామకం పొందిన 2003 డిఎస్సి ఉపాధ్యాయులకు పాత పెన్షన్ విధానాన్ని వర్తింపచేయాలని కోరారు. కాంట్రాక్టు ఉద్యోగ, ఉపాధ్యాయులకు ఉద్యోగ భద్రత కల్పించి వారికి హెల్త్ కార్డులు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర ముఖ్యమంత్రి కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వస్తే, వచ్చిన ఆరు నెలల లోపు పిఆర్సి., ఫిట్మెంట్ ప్రకటించి అమలు చేస్తామని, పెండింగ్ డిఎలు అన్నింటిని వెంటనే విడుదల చేస్తామని, సిపిఎస్.ను రద్దు చేస్తామని ఇచ్చిన మాటను నిలుపుకోవాలని, పే రివిజన్ కమిషన్ రిపోర్టును తెప్పించుకోకుండా కమిషన్ కాలవ్యవధిని పొడిగిస్తూ ఉపాధ్యాయ ఉద్యోగులకు అన్యాయం చేస్తున్నారని అన్నారు. వెంటనే రిపోర్టును తెప్పించుకొని ఉద్యోగ ఉపాధ్యాయ సంఘాలతో చర్చలు జరిపి ఫిట్మెంట్ను ప్రకటించి, పిఆర్సిని అమలు చేయాలని వారు డిమాండ్ చేశారు. ఉద్యోగ, ఉపాధ్యాయ, పెన్షనర్ల 13వేల కోట్ల పెండింగ్ బిల్లులు అన్నింటిని ఒకేసారి విడుదల చేసి వారికి న్యాయం చేయాలని కోరారు. ప్రభుత్వం ముందుంచిన 63 డిమాండ్లను వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో గెజిటెడ్ ప్రధానోపాధ్యాయులు డి.జగన్, ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయులు టి.రామారావు, టిపిటిఎఫ్ మండల కార్యదర్శి జి.నందా, ఉపాధ్యాయులు కె.ఎర్రయ్య, డి.వీరన్న, మోకాళ్ళశ్రీనివాసరావు, టీ.బిక్షమయ్య, ఎం.రాంబాబు, బి.కస్నానాయక్, బి.వీరన్న, బి.శ్రీవాణి, టి.వెంకటరమణ, జి.బిచ్చ జానయ్య పాల్గొన్నారు.

# ఆనాడు కులగణను ఎందుకు వ్యతిరేకించారు

**- ఏప్రిల్ 17 కాంగ్రెస్ ఏమేం చేసిందో గుర్తు చేసుకోవాలి**

**- రాహులు వ్యాఖ్యలపై మండిపడ్డ నిశికాంత్ దుబె**

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

న్యూఢిల్లీ,ఏప్రిల్17 : పార్లమెంట్ సమావేశాల్లో రాహుల్ గాంధీ వ్యాఖ్యలపై జార్ఖండ్ బీజేపీ ఎంపీ నిషికాంత్ దూబె విమర్శలు గుప్పించారు. కులగణనను కాంగ్రెస్ గతంలో వ్యతిరేకించిందన్నారు. కులాల ఆధారంగా జనగణన దేశాన్ని విభజిస్తుందని నాడు హస్తం పార్టీ వాదించిందన్నారు. తమ ప్రభుత్వం అధికారంలో ఉన్నా, లేకపోయినా కులగణన నిర్వహణ ఎప్పటికీ సాధ్యం కాదని మాజీ ప్రధాని మన్మోహన్ సింగ్ చెప్పారని ఆయన గుర్తుచేశారు. ఇక ఏప్రిల్ 17 గురించి రాహుల్ చేసిన వ్యాఖ్యలపై విమర్శనాస్త్రాలు సంధించారు నిషికాంత్. 'ఏప్రిల్ 17 గురించి రాహుల్ గొప్పగా చెబుతున్నారు. 1987లో బోఫోర్స్ కుంభకోణం వెలుగు చూసింది ఆ రోజేగా. అదే రోజునే సీతారామ్ కేసరి నుంచి సోనియా గాంధీ పదవి లాక్కున్నారు. 1999లో వాజ్‌పేయీ ప్రభుత్వాన్ని కాంగ్రెస్ పడగొట్టింది కూడా ఇదే తారీఖునే. మహిళలకు రిజర్వేషన్లు ఇస్తుంటే రాహుల్ తట్టుకోలేకపోతున్నారు. రాహుల్ ప్రసంగం పీసీ సర్కార్ మ్యాజిక్ షోలా సాగింది. మహిళా బిల్లు గురించి రాహుల్ మాట్లాడలేదు. ఓబీసీ, ఎస్సీ, ఎస్టీల గురించి మాట్లాడే హక్కు కాంగ్రెస్‌కు లేదు' అని నిషికాంత్ దూబె అన్నారు.

# తేజస్వీ వ్యాఖ్యలపై బీఆర్ఎస్ సీరియస్

**- ఢిల్లీలో ఫిర్యాదు చేసిన మాజీమంత్రి శ్రీనివాసగౌడ్**

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

న్యూఢిల్లీ,ఏప్రిల్17 : బీజేపీ యువ మోర్చా జాతీయ అధ్యక్షుడు, ఎంపీ తేజస్వి సూర్య పార్లమెంటులో చేసిన వివాదాస్పద వ్యాఖ్యలు ఇప్పుడు రాజకీయ దుమారం రేపుతున్నాయి. తెలంగాణ ఏర్పాటును పాకిస్థాన్ విభజనతో పోల్చారని మాజీ మంత్రి శ్రీనివాస్ గౌడ్ తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. ఈ అంశంపై ఆయన ఢిల్లీలో పోలీసులకు ఫిర్యాదు చేసారు. లోకసభ సాక్షిగా తెలంగాణ రాష్ట్ర ఏర్పాటుపై అనుచిత వ్యాఖ్యలు చేశారనే ఆరోపణలతో తేజస్వి సూర్య చిక్కుల్లో పడ్డారు. తెలంగాణ ప్రజల ఆత్మగౌరవాన్ని దెబ్బతీశారంటూ బీఆర్ఎస్ నేత, మాజీ మంత్రి శ్రీనివాస్ గౌడ్ ఆయనపై ఢిల్లీలో పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఢిల్లీలోని పార్లమెంట్ స్ట్రీట్ పోలీస్ స్టేషన్‌లో శ్రీనివాస్ గౌడ్ ఆధ్వర్యంలో ఈ ఫిర్యాదు నమోదైంది. ఈ సందర్భంగా ఆయన ఎంపీ వ్యాఖ్యలపై తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. తెలంగాణ విభజన ప్రక్రియను పాకిస్థాన్ ఏర్పాటుతో లేదా దేశ విభజనతో పోల్చడం అత్యంత హేయమని శ్రీనివాస్ గౌడ్ పేర్కొన్నారు. వందలాది మంది బలిదానాలు, దశాబ్దాల పోరాటం తర్వాత సిద్ధించిన తెలంగాణను ఇలా అవమానించడం రాష్ట్ర ప్రజల భావాలను గాయపరచడమేనని ఆగ్రహం వ్యక్తం చేశారు. పార్లమెంటు వేదికగా ఓ బాధ్యతాయుతమైన పదవిలో ఉండి, ఓ రాష్ట్రం పట్ల ఇంతటి వివక్షతో మాట్లాడటం సరికాదని విమర్శించారు. తెలంగాణ ప్రజల ఆత్మగౌరవాన్ని కించపరిచిన తేజస్వి సూర్యపై తక్షణమే చట్టపరమైన చర్యలు తీసుకోవాలని శ్రీనివాస్ గౌడ్ పోలీసులను కోరారు. కేవలం రాజకీయ ప్రయోజనాల కోసం ఓ చారిత్రక ఘట్టాన్ని తక్కువ చేసి చూపడం రాజ్యాంగ విరుద్ధమని వాదించారు. 'తెలంగాణ అంటే పోరాటాల గడ్డ' అని.. అలాంటి పవిత్రమైన ఉద్యమ ఫలితాన్ని పాకిస్థాన్‌తో పోల్చడం తేజస్వి సూర్య అజ్ఞానానికి పరాకాష్ట అని ధ్వజమెత్తారు. ఆయన వెంటనే తెలంగాణ సమాజానికి క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. ఈ ఘటనపై తెలంగాణ వ్యాప్తంగా నిరసనలు వ్యక్తమవుతున్నాయి. సామాజిక మాధ్యమాల్లో కూడా ఎంపీ వ్యాఖ్యలకు వ్యతిరేకంగా నెటిజన్లు పోస్టులు పెడుతున్నారు.

# పదేళ్లు అధికారంలో ప్రజలను ఎందుకు కలవలేదు

మొదటిపేజీ తరువాయి

మాట్లాడు తారని.. దీనిని ఆచరణలోకి తీసుకురావాలని తాను ప్రారంభించాకే తనకు కష్టాలు వచ్చాయని పేర్కొన్నారు. తెలంగాణ జాగృతి పెట్టబోయే పార్టీకి మారోజు వీరన్న అనుచరులు, సీపీయూఎస్ఐ, దళిత బహుజన రాజ్యాధికార సంస్థ మద్దతు ఇచ్చారని తెలిపారు. శుక్రవారం జాగృతి కార్యాలయంలో కవితను పలువురు కలిశారు. ఆమెను కలిసిన వారిలో సీపీయూఎస్ఐ కేంద్ర కమిటీ కార్యదర్శి కోదండం, రాష్ట్ర కార్యదర్శి వెంకన్న, దళిత బహుజన రాజ్యాధికార కన్వీనర్ గుడిపల్లి రవన్న, మారోజు వీరన్న సహచరులు కిషన్ నాయక్ సహా పలువురు నాయకులు ఉన్నారు. ఈసమావేశంలో పలు కీలక అంశాలపై చర్చించారు. ఈ సందర్భంగా కవిత మాట్లాడారు. ప్రతి కష్టాన్ని పాఠంగా భావిస్తూ.. సామాజిక తెలంగాణ సాధించే వరకు పోరాటం చేస్తానని కవిత స్పష్టం చేశారు. సర్వోదయ తెలంగాణ తన లక్ష్యమని.. అందరి జీవితాల్లో వెలుగులు నిండాలని ఆకాంక్షించారు. మారోజు వీరన్న అనుచరుల మద్దతు ఎంతో శక్తిని ఇస్తుందని అన్నారు. తమతో మారోజు వీరన్న అనుచరులు కలవటమంటే ఇక తమను ఆపే శక్తే లేదని పేర్కొన్నారు. ఏదైనా శని ఉంటే.. అది తొలగిపోవడం కోసమే తాను వారణాసి వెళ్లి పూజలు చేశానని ప్రస్తావించారు. తాను పెట్టే పార్టీ సక్సెస్ కావాలని కోరుకున్నానని తెలిపారు. బీఆర్ఎస్‌కు చెందిన కొందరు మాజీ ఎమ్మెల్యేలు తనను కలిశారని.. పేర్లు మాత్రం తాను బయటకు చెప్పనని అన్నారు. ప్రజా సమస్యలపై బీఆర్ఎస్‌ను ముందుగా టార్గెట్ చేశానని తెలిపారు. తనను ఆ పార్టీ సస్పెండ్ చేసిందని కవిత ప్రస్తావించారు.

# కాళేశ్వరం ప్రాజెక్ట్ పునరుద్ధరణ

మొదటిపేజీ తరువాయి

వేగవంతం చేసేందుకు ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. రుతుపవనాలకు ముందే జియో టెక్నికల్ పరిశీలనలు పూర్తి చేయాలని తెలంగాణ సర్కార్ సూచించింది. మే 30వ తేదీలోగా పరిశీలనలు పూర్తిచేయాలని డెడ్‌లైన్ విధించింది. రోజువారీ పురోగతి నివేదికలు సమర్పించాలని ఆదేశాలు జారీ చేసింది. ప్రతిరోజూ సాయంత్రం 5 గంటలకు రిపోర్ట్ ఇవ్వాలని ఆదేశించింది. సీడబ్ల్యూసీ ఎన్డీఎస్ఏ అనుమతులతో పనులు, డిజైనింగ్ పునరుద్ధరణ పనులకు ప్రాధాన్యం ఇవ్వాలని నిర్ణయించింది. రోజువారీ యాక్షన్ ప్లాన్‌తో పనులు చేపట్టాలని తెలంగాణ ప్రభుత్వం సంబంధిత అధికారులను ఆదేశించింది.

# రాజ్యసభ డిప్యూటీ ఛైర్మన్‌గా మరోమారు హరివంశ్

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

న్యూఢిల్లీ,ఏప్రిల్17 : రాజ్యసభ డిప్యూటీ ఛైర్మన్‌గా హరివంశ్ నారాయణ్ సింగ్ ఎన్నికయ్యారు. ప్రతిపక్ష అభ్యర్థులు ఎవరూ నామినేషన్ దాఖలు చేయకపోవడంతో ఆయన ఎన్నిక ఏకగ్రీవం అయ్యింది. ఆయన ఉపసభాపతి బాధ్యతలు చేపట్టడం ఇది మూడోసారి.

ఈ సందర్భంగా ప్రధాని మోదీ డిప్యూటీ ఛైర్మన్‌కు శుభాకాంక్షలు తెలిపారు. ఆయన అనుభవం రాజ్యసభకు ఎంతో అవసరమని అన్నారు. ఆయన అందరినీ కలుపుకుని వెళ్లాలని ఆశిస్తున్నట్టు పేర్కొన్నారు. హరివంశ్ నేతృత్వంలో సభ మరింత శక్తిమంతం అవుతుందని అన్నారు. రాజ్యసభలో కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే కూడా నూతన ఉపసభాపతికి శుభాకాంక్షలు తెలిపారు. ఆయన ప్రతిపక్షానికి కూడా తగిన ప్రాధాన్యం ఇస్తారని ఆశిస్తున్నట్టు తెలిపారు. ఆయన అందరి వాడని అన్నారు. ఇటీవల ఆయన రాజ్యసభ పదవీకాలం ముగిసింది. దీంతో ఆయనను రాష్ట్రపతి కోటాలో నామినేట్ చేశారు.

# రెండోరోజూ నల్లదుస్తులతో డిఎంకె సభ్యులు

**ఆదరాబాదరాగా చట్టాలను తేవడంపై కనిమొళి అభ్యంతరం**

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

న్యూఢిల్లీ,ఏప్రిల్17 :మహిళా రిజర్వేషన్ అమలు, లోక్‌సభ సీట్ల పెంపు బిల్లులపై పార్లమెంటులో రెండోరోజు చర్చ ప్రారంభమైంది. ప్రతిపక్షాల నిరసనల నడుమ సభ సాగుతోంది. ప్రభుత్వ తీరుపై మరోసారి ప్రతిపక్షాలు మండిపడ్డాయి. సభలో చర్చ జరుగుతుండగా మహిళా రిజర్వేషన్‌పై గెజిట్ నోటిఫికేషన్ విడుదల చేశారని ఆక్షేపించాయి. కేంద్ర ప్రభుత్వం తీరుపై డీఎమ్‌కే ఎంపీ కనిమొళి మండిపడ్డారు. డిఎంకె ఎంపిలు వరుసగా రెండోరోజూ నల్లదుస్తులతో సభకు హాజరయ్యారు. హోం మంత్రి అమిత్ షా పొంతన లేని సమాధానాలు చెబుతున్నారని ఈ సందర్భంగా కనిమొళి అన్నారు. రోజుల వ్యవధిలో బిల్లులు ఆమోదింపచేసుకోవాలనే ప్రయత్నంలో రాజకీయ లెక్కలు కనిపిస్తున్నాయని అన్నారు. ఇది అసలైన సమాఖ్య స్ఫూర్తి కాదని అన్నారు. రాష్ట్రాల హక్కులను ఈ ప్రభుత్వం గుర్తించట్లేదని అన్నారు. ఢిల్లీ సార్ల కోసమే రాష్ట్రాలు ఉన్నట్టు కేంద్రం వ్యవహరిస్తోందని అన్నారు. కేంద్రం చర్యలపై మండిపడ్డారు. డీలిమిటేషన్‌కు మహిళా రిజర్వేషన్ బిల్లు బందీగా మారిందని అన్నారు. ఈ వ్యవహారాన్ని డీలిమిటేషన్‌తో లంకె పెట్టకూడదని అన్నారు. మహిళా బిల్లుకు అభ్యంతరం లేదని, కేవలం డీలిమిటేషన్ విషయంలోనే ఇంత తొందరెందుకని ప్రశ్నించారు. కావాలంటే ఉన్న సీట్లతోనే మహిళా రిజర్వేషన్లు అమలు చేయాలన్నారు.

# మరింత పెరిగిన బంగారం ధర

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

హైదరాబాద్,ఏప్రిల్17 :భారత్‌లో బంగారం ధరలు గత మూడు రోజులుగా ఎంతో కొంత పెరుగుతూనే ఉన్నాయి. అంతర్జాతీయ అనిశ్చితులు తగ్గుతాయన్న సంకేతాలతో పాటు అక్షయ తృతీయ సమీపిస్తున్న తరుణంలో పసిడికి డిమాండ్ అంతకంతకూ పెరుగు తోంది. గత మూడు రోజుల్లో పసిడి ధరలు సుమారు రూ.3 వేల మేర పెరిగాయి. గుడ్ రిటర్న్స్ వెబ్‌సైట్ కథనం ప్రకారం, ఉదయం 6.30 గంటల సమయంలో హైదరాబాద్ బులియన్ మార్కెట్‌లో 24 క్యారెట్ల 10 గ్రాముల పసిడి ధర రూ.1,55,580గా ఉంది. 22 క్యారెట్ల 10 గ్రాముల పసిడి ధర రూ.1,42,610గా ఉంది. వెండి ధర దాదాపుగా స్థిరంగానే ఉంది.ప్రస్తుతం కిలో వెండి ధర రూ.2,74, 900ల వద్ద కొనసాగుతోంది. చెన్నైలో 24 క్యారెట్ల 10 గ్రాముల పసిడి ధర రూ.1,56,670గా ఉంది. ముంబైలో రూ.1,55,580 వద్ద, న్యూఢిల్లీలో రూ.1,55,730 వద్ద కదలాడుతోంది. 22 క్యారెట్ల 10 గ్రాముల ఆర్నమెంటల్ పసిడి ధర చెన్నైలో రూ.1,43,610గా, ముంబైలో రూ.1,42,610గా, న్యూఢిల్లీలో రూ.1,42,760గా ఉంది. దేశవ్యాప్తంగా వివిధ నగరాల్లో వెండి ధరలు రూ.2.69 లక్షల నుంచి రూ.2.74 లక్షల వరకూ ఉన్నాయి. ఇక అంతర్జాతీయ మార్కెట్‌లోప్రస్తుతం ఔన్స్(31.10గ్రాములు) 24 క్యారెట్ల పసిడి ధర 4,787 డాలర్ల వద్ద, ఔన్స్ వెండి ధర 78 డాలర్ల వద్ద కొనసాగుతోంది.

# దక్షిణాది రాష్ట్రాలకు తీవ్ర నష్టం : డీలిమిటేషన్ ప్రక్రియపై శశిథరూర్

న్యూఢిల్లీ,ఏప్రిల్17 : పార్లమెంట్‌లో లోక్‌సభ, శాసనసభ నియోజకవర్గాల పునర్విభజన అంశంపై చర్చ తీవ్రరూపం దాల్చింది. జనాభా ఆధారంగా సీట్ల సంఖ్యను పెంచాలనే ఉద్దేశ్యంతో, కేంద్ర ప్రభుత్వం డీలిమిటేషన్ ప్రక్రియకు సంబంధించి చొరవ తీసుకుం టోంది. అయితే డీలిమిటేషన్ బిల్లును ప్రతిపక్ష పార్టీలు వ్యతిరేకిస్తు న్నాయి. శుక్రవారం రెండో రోజు కూడా డీలిమిటేషన్ బిల్లుపై చర్చ కొనసాగింది. డీలిమిటేషన్‌తో దక్షిణాది రాష్ట్రాలకు నష్టం జరుగుతుం దని కాంగ్రెస్ ఎంపీశశిథరూర్ అన్నారు.లోక్‌సభలో ఆయన మాట్లాడు తూ.. దక్షిణాది రాష్ట్రాలకు నష్టం జరగదని ప్రధాని మోదీ, కేంద్ర హోం మంత్రి అమిత్ షా మాట్లాడుతున్నారని, వారి మాటలకు విరుద్ధంగా డీలిమిటేషన్ బిల్లు రూపొందించారని ఆయన విమర్శిం చారు. డీలిమిటేషన్‌తో దక్షిణాది రాష్ట్రాలు రాజకీయంగా మరింత నష్టపోతాయని శశిథరూర్ తెలిపారు. కేంద్ర ప్రభుత్వం మహిళా రిజర్వేషన్ బిల్లు తీసుకురావడం మంచిదేనని, అయితే దీని అమలకు 2011 జనాభా లెక్కలకు, నియోజకవర్గాల పునర్విభజన ప్రక్రియకు ముడిపెట్టడారని ఆయనవిమర్శించారు.ఒకేసారి 816 మంది సభ్యుల కు సీట్లు పెంచడం ఆషామాషీ కాదన్నారు. దీంతో ఎన్నో సమస్యలు వస్తాయని హెచ్చరించారు. మరోవైపు లోక్ సభలో ఈ మూడు బిల్లుల ఓటింగ్ ఉత్కంఠ రేపుతోంది. సాయంత్రం 4 గంటలకు స్పీకర్ ఓంబిర్లా ఓటింగ్ చేపట్టనున్నారు. విపక్షాల్లోని పలు పార్టీలతో ఎన్డీయే నేతలు మంతనాలు చేస్తున్నారు. మరోవైపు ఓటింగ్ వేళ ఇండియా కూటమి వ్యూహరచన చేపట్టింది. ఇండియా కూటమికి భేటీకి ఆర్జేడీ హాజరుకావడంతో రాజకీయ ప్రాధాన్యం సంతరించు కుంది. ఒక్కొక సభ్యుడు ఉన్న పార్టీలను కూడా ఈ కూటమి సంప్రదిస్తోంది.

# తేజస్వీ వ్యాఖ్యలను తొలగించేలా చేయండి

**- కిషన్ రెడ్డిని కోరిన మంత్రి పొన్నం**

**- లోక్‌సభలో మాట్లాడిన వ్యాఖ్యలపై చర్యలు తీసుకోలేం**

**- మంత్రి పొన్నం లేఖపై డిజిపి శివధర్ రెడ్డి స్పష్టీకరణ**

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

హైదరాబాద్, ఏప్రిల్17 : తెలంగాణ రాష్ట్ర ఏర్పాటును అవమానించే విధంగా భాజపా ఎంపీ తేజస్వీ సూర్య పార్లమెంట్‌లో మాట్లాడారని మంత్రి పొన్నం ప్రభాకర్ ధ్వజమెత్తారు. తెలంగాణ ఏర్పాటును భారత్-పాకిస్థాన్ విభజనతో పోల్చడం సరికాదన్నారు. తేజస్వీ వ్యాఖ్యలను రికార్డుల నుంచి తొలగించాలని కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డికి పొన్నం ప్రభాకర్ విజ్ఞప్తి చేశారు. ఇందుకు లోక్‌సభ స్పీకర్‌ను ఒప్పించాలని ఆయన కోరారు. ఎంపీ విషయంలో చర్యలు తీసుకోవాలంటూ రాష్ట్ర డీజీపీ శివధర్ రెడ్డికి మంత్రి లేఖ రాశారు. ఈ లేఖపై డీజీపీ స్పందించారు. చట్టసభల్లో మాట్లాడిన అంశాలపై చర్యలు తీసుకునే అధికారం పోలీసులకు ఉండదని డీజీపీ శివధర్ రెడ్డి స్పష్టం చేశారు. తెలంగాణ విభజనపై బీజేపీ ఎంపీ తేజస్వి సూర్య చేసిన వ్యాఖ్యలపై మంత్రి పొన్నం ప్రభాకర్ తీవ్ర స్థాయిలో విరుచుకుపడ్డారు. తెలంగాణ ఆత్మగౌరవాన్ని కించపరిచేలా తేజస్వి మాట్లాడుతుంటే బీజేపీ ఎంపీలు, కేంద్ర మంత్రులు మౌనంగా ఉ న్నారని మంత్రి మండిపడ్డారు. తెలంగాణ ఏర్పాటును భారత్-పాకిస్తాన్ విభజనతో పోల్చడం సరికాదన్నారు. ఎంపీపై చర్యలు తీసుకోవాలని



డీజీపీ శివధర్‌రెడ్డిని మంత్రి పొన్నం ప్రభాకర్ కోరారు. పార్లమెంట్ ప్రత్యేక సమావేశాల్లో డీలిమిటేషన్‌పై చర్చలో ఎంపీ తేజస్వి సూర్య పాల్గొన్నారు. తెలంగాణ రాష్ట్ర విభజనను ప్రస్తావిస్తూ.. బ్రిటీష్ వాళ్లు చేసిన భారత్- పాకిస్తాన్ విభజనకంటే దారుణంగా ఆంధ్రప్రదేశ్ నుంచి తెలంగాణను వేరే చేశారంటూ ఎంపీ వ్యాఖ్యలు చేశారు. తెలంగాణ విభజనపై ఎంపీ తేజస్వి సూర్య చేసిన వ్యాఖ్యలు తీవ్ర దుమారాన్ని రేపాయి.

# 9 ఏళ్ల బాలికను కాపాడిని ముగ్గురు

మొదటిపేజీ తరువాయి

సందేశమని ప్రశంసించారు. మహిళలు, చిన్నారుల రక్షణలో పౌరులు ఇలాగే అప్రమత్తంగా ఉంటే నేరాలను అరికట్టవచ్చని వ్యాఖ్యానించారు. ప్రతి ఒక్కరూ 'ప్రజా పోలీస్'గా మారాలని సీపీ సజ్జనార్ సూచించారు. ఈ సందర్భంగా గతంలో గోల్కొండలో ఎనిమిదేళ్ల బాలికను కాపాడిన మహ్మద్ ఫిరోజ్ ఉదంతాన్ని కూడా సీపీ సజ్జనార్ గుర్తు చేశారు. ప్రజల చైతన్యమే నేర నియంత్రణలో పోలీసులకు కొండంత అండ అని అభిప్రాయపడ్డారు. సమాజంలో ఏవైనా అనుమానాస్పద ఘటనలు లేదా నేరాలు జరుగుతున్నప్పుడు భయపడకుండా ఈ మార్గాల ద్వారా పోలీసులను సంప్రదించాలని సీపీ సజ్జనార్ సూచించారు. అత్యవసర సహాయం కోసం డయల్ 100 లేదా హైదరాబాద్ పోలీస్ వాట్సాప్ నంబర్ 94906 16555లో సంప్రదించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఐటీ సెల్ ఇన్‌స్పెక్టర్ రమేశ్, జూబ్లీహిల్స్ ఎస్ఐ సోమ శేఖర్ తదితరులు పాల్గొని సాహస యువతను అభినందించారు. ఈ నెల 14వ తేదీన సెజల్ తన స్నేహితుడు గణపతితో కలిసి యూసుఫ్‌గూడ నుంచి మాదాపూర్ వైపు బైక్‌పై వెళ్తుండగా, జూబ్లీహిల్స్ రోడ్డు నంబర్ - 10 సమీపంలో ఓ హృదయ విదారక దృశ్యాన్ని గమనించారు. ఓ వ్యక్తి చిన్నారితో అత్యంత అసభ్యకరంగా ప్రవర్తిస్తున్నాడు. ఆ బాలిక కళ్లలో కనిపించిన భయం సెజల్, గణపతిలను కదిలించింది. ఏమాత్రం ఆలస్యం చేయకుండా వారు నిందితుడిని అడ్డుకున్నారు. అదే సమయంలో అటుగా వెళ్తున్న కాశీనాథ్, నారాయణలు కూడా తోడవడంతో నిందితుడు తప్పించుకోలేకపోయాడు. వెంటనే డయల్ 100కు కాల్ చేసి నిందితుడిని పోలీసులకు అప్పగించారు. పోలీసుల విచారణలో నిందితుడు యూసఫ్‌గూడకు చెందిన జావీద్ అని గుర్తించారు. బాలిక తల్లిదండ్రులు కూలీ పనులకు వెళ్లిన సమయాన్ని ఆసరాగా చేసుకున్న నిందితుడు, ఐస్‌క్రీమ్ కొనిస్తానని ఆ చిన్నారిని బైక్‌పై తీసుకెళ్లాడు. నిర్మానుష్య ప్రదేశానికి తీసుకెళ్లి లైంగిక వేధింపులకు గురిచేశాడు. నిందితుడిపై జూబ్లీహిల్స్ పోలీసులు పోక్సో యాక్ట్ కింద కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించారు.

# తేజస్వీ సూర్య మాటల్లో తప్పేముంది

మొదటిపేజీ తరువాయి

చేస్తున్నారని మండిపడ్డారు. కరీంనగర్‌లో రణభేరి కార్యక్రమానికి రేవంత్ రెడ్డి తుపాకీ పట్టుకొని వెళ్లారని కేంద్ర మంత్రి తెలిపారు. 1400 మంది బలిదానాలకు హత్యలకు కారణమైన పార్టీ కాంగ్రెస్ అని ఆరోపించారు. ఒక్క ఓటు, రెండు రాష్ట్రాలు అనే నినాదానికి కట్టుబడి, రాష్ట్ర విభజనకు మద్దతు ఇచ్చింది బీజేపీ అని తెలిపారు. మహిళా రిజర్వేషన్ బిల్లును కాంగ్రెస్ కావాలని అడ్డుకుంటోందని మండిపడ్డారు. బీఆర్ఎస్ అవినీతి గురించి సీఎం రేవంత్ రెడ్డి ఎందుకు మాట్లాడటం లేదని కేంద్ర మంత్రి బండి సంజయ్ ప్రశ్నించారు.

# సిగాచీ బాధితులను నట్టేట ముంచారు

మొదటిపేజీ తరువాయి

రూ. 24.51 కోట్లను విభజించి చూస్తే, ఒక్కో కార్మికుడి కుటుంబానికి సగటున అందిన పరిహారం కేవలం రూ. 45.40 లక్షలు మాత్రమే అని తెలిపారు. అంటే ముఖ్యమంత్రి హామీ ఇచ్చిన కోటి రూపాయల పరిహారంలో ఇంకా ఒక్కో కుటుంబానికి దాదాపు రూ. 54.60 లక్షల చొప్పున, మొత్తంగా రూ. 29.48 కోట్ల బకాయిని ఈ ప్రభుత్వం ఎగ్గొట్టి బాధితులను నట్టేట ముంచిందని మండిపడ్డారు. దిక్కుతోచని స్థితిలో ఉన్న ఆ పేద బాధిత కుటుంబాలను గాలికి వదిలేశారని మండిపడ్డారు. ఇక్కడ మరో మోసం దాగుందని విమర్శించారు. యాజమాన్యం తాము 40 నుంచి 42 లక్షలు ఇస్తున్నామని కోర్టుల ముందు ఒప్పుకుందని చెప్పారు. అసలు నిజమేంటంటే, వారు సొంతంగా ఇచ్చిన 25 లక్షలకు.. కార్మికులు చనిపోవడం వల్ల చట్టబద్ధంగా వారికి రావాల్సిన పీఎఫ్, ఈఎస్ఐ, లైఫ్ ఇన్సూరెన్స్ డబ్బులను కూడా కలుపుకుని ఈ లెక్కలు చూపిస్తున్నారని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం, యాజమాన్య అమానవీయతకు, దిగజారుడుతనానికి పరాకాష్ట అని మండిపడ్డారు. అంతేకాదు, ఆసుపత్రిలో చికిత్స పొందుతూ చనిపోయిన కార్మికుల వైద్య ఖర్చులను కూడా ఈ అరకొర పరిహారంలోనే కోత విధించడం దారుణమని అన్నారు. ఇక ప్రమాదంలో కాలి బూడిదై ఆచూకీ దొరకని 8 మంది కార్మికుల కుటుంబాలను డెత్ సర్టిఫికెట్ల కోసం నెలల తరబడి ఆఫీసుల చుట్టూ తిప్పించుకున్న దుర్మార్గ ప్రభుత్వం ఇది అని విమర్శించారు. ఇది కేవలం ఒక ప్రమాదం కాదు, యాజమాన్యం నిర్లక్ష్యంతో జరిగిన సామూహిక హత్య అని హరీశ్‌రావు అన్నారు. ఫ్యాక్టరీలో భద్రతా ప్రమాణాలు గాలికొదిలేశారని విచారణలో ఆధారాలతో సహా స్పష్టంగా తేలిందని చెప్పారు. బాధితుల పక్షాన హైకోర్టులో కేసు వేసి, న్యాయస్థానం మొట్టికాయలు వేస్తే తప్ప పోలీసులు కదలలేదని హరీశ్‌రావు తెలిపారు. తూతూ మంత్రంగా ఎండీని అరెస్టు చేయడం, వెంటనే ఆయన బెయిల్ మీద బయటకు వచ్చేలా పరోక్షంగా సహకరించడం చూస్తుంటే.. ప్రభుత్వానికి, కంపెనీ యాజమాన్యానికి మధ్య ఉన్న లోపాయికారీ ఒప్పందాలు ఏమిటో అర్థం అవుతూనే ఉ ందన్నారు. ఆనాడు మృతదేహాల సాక్షిగా ఇచ్చిన మాట ప్రకారం, పీఎఫ్, ఈఎస్ఐ డబ్బులతో సంబంధం లేకుండా ప్రతి బాధిత కుటుంబానికి కోటి రూపాయల పరిహారం వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు.

# రేవంత్‌ది అసదుద్దీన్ ఓవైసీ ఫార్మాలా

మొదటిపేజీ తరువాయి

రాష్ట్రాలకు అన్యాయం జరుగుతుందంటూ అపోహలు సృష్టించడం సరికాదని ఆయన హితవు పలికారు. ప్రతిపక్షాలు పార్లమెంట్ సాక్షిగా పచ్చి అబద్ధాలు ప్రచారం చేస్తున్నాయని, ప్రాంతీయ విద్వేషాలను రెచ్చగొట్టడం వారి రాజకీయ ప్రయోజనాల కోసమేనని ధ్వజమెత్తారు. దక్షిణ భారతదేశానికి న్యాయం చెయ్యడమే మోదీ ఫార్ములా. న్యాయమా, అన్యాయమా అనే దానిపై చర్చకు సిద్ధమా? అసదుద్దీన్ హైబ్రిడ్ ఫార్ములా ఇది, రేవంత్ రెడ్డి ఫార్ములా కాదు. మజ్లిస్ పార్టీ మహిళ రిజర్వేషన్లకు వ్యతిరేకం. ఈ పార్టీ కాంగ్రెస్, బీఆర్ఎస్‌ను కలిపింది. కాంగ్రెస్ ప్రభుత్వం మజ్లిస్ పార్టీకి లొంగిపోయి పనిచేస్తోంది. 360 మంది తెలంగాణ ఉద్యమకారులను అప్పట్లో కాంగ్రెస్ ప్రభుత్వం కాల్చి చంపింది. తెలంగాణ చివరి దశ ఉద్యమంలో 1200 మంది ఆత్మ బలిదానం చేసుకున్నారు. పార్లమెంట్లో బిల్లు పెట్టినప్పుడు కాంగ్రెస్ ఎంపీలే కారం పొట్లాలు, పెప్పర్ స్ప్రేలు కొట్టారు. తెలంగాణ విభజనపై ఎంపీ తేజస్వి సూర్య చేసిన తన వ్యాఖ్యలు తప్పు అయ్యాయని ఒప్పుకున్నారు. మహిళ రిజర్వేషన్, నియోజకవర్గాల పెంపు బిల్లును అడ్డుకునేవారు చరిత్రహీనులుగా మిగిలిపోతారు. దక్షిణాది రాష్ట్రాలకు నరేంద్ర మోదీ న్యాయం చేస్తున్నారని అన్నారు.

# 30లక్షలకు పైగా ధాన్యం సేకరణ చేపట్టండి

మొదటిపేజీ తరువాయి

ఈ రబీ సీజన్‌లో 30 లక్షల మెట్రిక్ టన్నుల బాయిల్డ్ రైస్ కేంద్ర ప్రభుత్వం ఎఫ్‌సీఐ ద్వారా తీసుకోవాలని కేంద్ర మంత్రికి విజ్ఞప్తి చేశాం. కేంద్రం నుంచి తెలంగాణకు రూ.1,400 కోట్లు రావాల్సి ఉంది. పదేళ్లుగా పెండింగ్‌లో ఉన్న ఆ నిధులను విడుదల చేయాలని కోరాం. కేంద్రం పోషకాహార పంపిణీ పథకాన్ని రద్దు చేసింది. ఇది సరైన విధానం కాదు' అని తెలిపారు. ఢిల్లీలో తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి పర్యటన బిజీబిజీగా సాగుతోంది. డీలిమిటేషన్‌పై హైబ్రిడ్ మోడల్‌కు మద్దతు కూడగట్టేందుకు ఆయన ముమ్మర ప్రయత్నాలు చేస్తున్నారు. ఈ మేరకు దక్షిణాది రాష్ట్రాల వాదనను జాతీయస్థాయిలో వినిపించేందుకు కృషి చేస్తున్నారు. ప్రోరేటాకు వ్యతిరేకంగా దక్షిణాది ముఖ్యమంత్రులను రేవంత్ సమన్వయం చేస్తున్నారు. అదే సమయంలో పలువురు కేంద్రమంత్రులను రేవంత్ రెడ్డి కలుస్తున్నారు. తెలంగాణకు రావాల్సిన నిధులు, పథకాలపై చర్చిస్తున్నారు.

# కాళేశ్వరంపై ఎలాంటి దురుద్దేశ్యం లేదు

మొదటిపేజీ తరువాయి

ప్రాజెక్టు, మేడిగడ్డ బ్యారేజ్ మరమ్మతులు, పునరుద్ధరణపై చర్చించామని తెలిపారు. గోదావరి వరదలు వచ్చేలోగా సాయిల్ టెస్టింగ్, డిజైన్లు పూర్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నామని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి వివరించారు. కాళేశ్వరం ప్రాజెక్టు విషయంపై కేసీఆర్ హయాంలో చేసిన పొరపాటు తెలంగాణ ప్రజలకు తెలుసునని చెప్పుకొచ్చారు. బీఆర్ఎస్ హయాంలో కాళేశ్వరాన్ని నిర్మించారని, అది కూలిపోయిందని అన్నారు. కాళేశ్వరంపై దాదాపు రూ.97 వేల కోట్ల ప్రజాధనాన్ని ఖర్చు చేసి ఆ ప్రాజెక్టు నిర్మించారని తెలిపారు. కాళేశ్వరంపై ప్రతి ఏడాది రూ.10వేల కోట్ల వడ్డీ కడుతున్నామని తెలిపారు. ప్రజాధనం ఉపయోగించడంతోనే దాన్ని ఎలా రిపేర్ చేయాలో ఆలోచించి ముందుకు వెళ్తున్నామని స్పష్టం చేశారు. తెలంగాణ ప్రజలు అన్నీ విషయాలు గమనిస్తున్నారని అన్నారు. నేషనల్ డ్యామ్ సేఫ్టీ అథారిటీ మార్గదర్శకాలకు అనుగుణంగా ముందుకు వెళ్తున్నామని చెప్పుకొచ్చారు. మేడిగడ్డ డ్యామేజ్ సాయిల్ టెస్ట్, డిజైన్ల ఖర్చులను కాంట్రాక్ట్ సంస్థలే భరిస్తాయని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి పేర్కొన్నారు.

